www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 4-5-2025 | పేజీలు: 18 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 18 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి ఉ.7:19 తదుపరి అష్టమి, నక్షత్రం: పుష్యమి మ.12:53 ఆశ్లేష, వర్జ్యం: రా.2:17-తె.3:57, దుర్ముహూర్తం: సా.4:51-5:42, అమృతఘడియలు: ఉ.6:23-8:01, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 5:51, సూర్యాస్తమయం: 6:32 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 4-5-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

నారాయణ మెడికల్ అకాడమీ

NEET-2024 ద్వారా ప్రభుత్వ వైద్యకళాశాలల్లో సీట్లు సాధించిన నారాయణ విద్యార్థులు



Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice

Due to space constraints, only a few achievers are shown.

2025-26 అడ్మిషన్లు జరుగుచున్నవి

TWO YEARS INTEGRATED CLASSROOM COURSE	ONE YEAR CLASSROOM COURSE	FOUNDATION	LONG TERM
JEE/NEET	JEE/NEET	One / Two / Three / Four Years Course	JEE/NEET
Eligibility : X to XI moving Students	Eligibility : XI to XII moving students		Eligibility : XII Pass Students

Get Up to **90%** Scholarship*

NEET LONG TERM BRANCHES: ANANTHAPUR • Khaja Nagar - Day Boys & Girls - Ph: 9912342560, 8328156819. • Vadiyampeta, Girls Hos Ph: 8179880115, 9502887777. CUDDAPAH • NGO Colony Day Boys & Girls - Ph: 8179880585, 9912341791. EAST GODAVARI - KAKINADA Santhinagar Day - Boys & Girls - Ph: 8179880688, 9866602346. GUNTUR • Guntur Day - Boys & Girls - Ph: 9912342207, 8179880548. • Guntur - Hos - Boys & Girls - Ph: 9912342207, 8179880633. KURNOOL • Lakshmi Nagar - Day (Boys & Girls), Hos Girls - Ph: 7337336357, 8179880438. NELLORE • Kakupalli Boys Resi. Ph: 8179880607, 8317558265. • Haranatha Puram Day- Boys & Girls - Ph: 8179880611, 9441523160. • Dhanalakshmi Puram Girls Resi. - Ph: 9912343878, 8179881289. ONGOLE Day Boys & Girls - Ph: 8179880042, 7337336421. TIRUPATI New Balaji Colony, Boys Hos & Day - Ph: 7337337069, 7337336092. • Korla Gunta, Girls Hos & Day - Ph: 8179969006, 8179973073. VIJAYAWADA • Kanuru, Boys Hostel - Ph: 8179880552, 7799638899. • Mogbalrajapuram, Day Scholars - Boys & Girls - Ph: 9912317888, 8179917389. • Kanuru Girls Hostel - Ph: 7337335699, 8179880552. VISAKHAPATNAM Day - Boys & Girls • CBM Compound - Ph: 9966234159, 8555828868, 9912340781. Hostel - Boys Paradesipalem, Ph: 8179880701, 9963905426, 9912340781. Hos - Girls- Boyapalem, Ph: 8179880713, 9963905426, 9912340781.

SCAN QR CODE FOR ADMISSIONS

NARAYANA® EDUCATIONAL INSTITUTIONS

TOLL FREE: 1800 102 3344 | www.narayanagroup.com

Narayana Admission-Cum-Scholarship Test : 25th May 2025, 1st బ్యాచ్ క్లాసులు ప్రారంభం : 05-06-2025



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 4-5-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ



అందగత్తెలు
వచ్చేస్తున్నారు!

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మిస్ కెనడా మోరిసన్‌కు సంప్రదాయ స్వాగతం

నేడు, రేపు 120 దేశాల పోటీదార్ల రాక

హైదరాబాద్ వేదికగా 10 నుంచి 31వ వరకు మిస్ వరల్డ్ పోటీలు

మిస్ కెనడా ఎమా డీనా క్యాథరన్ మోరిసన్‌కు కళాకారిణుల ఆహ్వానం

11



9

'ఆల్ ఇన్ వన్ గోల్డ్ ఏటీఎం'

బంగారం అమ్మకం, కొనుగోలు, మార్పిడితో పాటు నగల కొనుగోలు సేవలు అందించేలా రూపకల్పన

త్వరలో గోల్డ్ సిక్కా సంస్థతో అందుబాటులోకి..

పచ్చళ్లపైనా ట్రంప్ పగ!

భారత్ నుంచి తెప్పించుకునే ఆహారోత్పత్తులపై నిఘా

పన్ను కట్టకపోతే భారీ జరిమానాలు

సోషల్ మీడియా, యాప్‌ల ద్వారా అమెరికాలో పలువురు భారతీయుల చిరువ్యాపారాలు

ఇంతకాలం సుంకాలు లేకుండానే.. ఇకపై పన్నుపోటు

అమెరికాకు బంధువులు తీసుకొచ్చే వాటిపైనా నిబంధనలు

ఆందోళనలో భారతీయులు.. వాట్సాప్ గ్రూపుల్లో చర్చ

12



'క్వాంటమ్'తో కొత్త శకం!

క్వాంటమ్ టెక్నాలజీ అధునాతన సాంకేతిక అంశం కావడంతో దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని.. సామాన్యులకు అర్థమయ్యేలా క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రయోజనాలను తెలపాలని ప్రభుత్వం భావిస్తోంది.

దేశంలో తొలి క్వాంటమ్ వ్యాలీ అమరావతిలోనే

అతిపెద్ద, అత్యాధునిక ఐబీఎం సిస్టం-2 ఏర్పాటు

టెక్ వరల్డ్‌లో సంచలనంగా ప్రభుత్వ ఒప్పందం

రాష్ట్రంవైపు అంతర్జాతీయ టెక్ నిపుణుల చూపు

నాలెడ్జ్ ఎకానమీకి కేరాఫ్‌గా మారనున్న ఏపీ రాజధాని

10 వేల కోట్ల నుంచి 15 వేల కోట్ల దాకా పెట్టుబడులు

క్వాంటమ్ టెక్నాలజీతో ప్రయోజనాలెన్నో..

అత్యంత వేగంగా సమాచారం, డేటా విశ్లేషణ



హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించిన ఎల్‌అండ్‌టీ సంస్థే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలను డిజైన్ చేస్తోంది.

అత్యాధునిక ఐబీఎం ప్రాసెసర్‌కు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేసేలా చర్యలు చేపడతారు.

అంతర్జాతీయ టెక్ దిగ్గజం... ఐబీఎం! అదే స్థాయిలో పేరు పొందిన టీసీఎస్! ఈ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న 'క్వాంటమ్ వ్యాలీ' ఒప్పందం... టెక్ ప్రపంచంలో సంచలనం సృష్టిస్తోంది. భారత దేశంలోనే తొలి 'క్వాంటమ్ వ్యాలీ' ఆంధ్రప్రదేశ్‌లో... అది కూడా అమరావతిలో ఏర్పాటవుతోందన్న వార్త అంతర్జాతీయ మీడియా దృష్టినీ ఆకర్షించింది. భవిష్యత్ టెక్నాలజీ అవకాశాలను అందిపుచ్చుకునేలా... జనవరి 1వ తేదీనే రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ ప్రారంభం కానుంది. నిర్మాణ బాధ్యతలను ఎల్‌అండ్‌టీ చేపడుతోంది. అసలు ఏమిటీ క్వాంటమ్ వ్యాలీ? టెక్నాలజీపరంగా ఎందుకు కీలకం? అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు ఒనగూరే ప్రయోజనం ఏవిటి? 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

క్వాంటమ్ టెక్నాలజీతో త్వరలో మరో సాంకేతిక విప్లవం రాబోతోంది. దేశంలో ఆ టెక్నాలజీకి అమరావతి తొలి వేదిక కాబోతోంది. శుక్రవారం అమరావతి పనుల పునఃప్రారంభ సమయంలోనే దీనికి కూడా ముందడుగు పడింది. 2026 జనవరి ఒకటో తేదీన క్వాంటమ్ వ్యాలీని ప్రారంభించేందుకు ప్రపంచ టెక్ దిగ్గజాలు ఐబీఎం, టీసీఎస్‌తో పాటు

మిగతా 14వ పేజీలో...



కశ్మీర్‌లోని దాల్ సరస్సు వద్ద పహారా కాస్తున్న జవాను

వాణిజ్యం బంద్!

పాక్ నుంచి అన్నిరకాల దిగుమతులపై భారత్ నిషేధం

ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులన్నింటికీ వర్తిస్తుందని స్పష్టీకరణ

కొరియర్లు, పార్సిల్ సేవలు కూడా పూర్తిగా నిలిపివేత

పాక్ నౌకలేవీ భారత పోర్టుల్లోకి రాకుండా నిషేధం

భారత్ నుంచి దిగుమతులను ఇప్పటికే నిషేధించిన పాక్

ఇరు దేశాల మధ్య రూ.80 వేల కోట్లకుపైనే వాణిజ్యం

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్రదాడి, అనంతర పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ నుంచి అన్నిరకాల దిగుమతులనూ నిలిపివేస్తున్నట్టు భారత్ ప్రకటించింది. పాక్‌లో తయారైన, పాక్ నుంచి వచ్చే ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులు ఏవైనా సరే ఈ నిషేధం వర్తిస్తుందని శనివారం స్పష్టం చేసింది. అంతేకాదు ఆ దేశం నుంచి వచ్చే కొరియర్లు, పార్సిళ్లు వంటి వాటిని కూడా పూర్తిగా నిలిపివేస్తున్నట్టు తెలిపింది. మరోవైపు భారత్‌లోని అన్ని నౌకాశ్రయాల్లోకి పాక్‌కు చెందిన, పాక్ జెండా ఉన్న ఎలాంటి నౌకలూ ప్రవేశించకూడదంటూ నిషేధం విధించింది. ఇదే సమయంలో భారత నౌకలేవీ పాకిస్థాన్ పోర్టులకు వెళ్లవద్దని సూచించింది. "ప్రత్యక్షంగా, పరోక్షంగా పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయిన, ఆ దేశం నుంచి

మిగతా 12వ పేజీలో...

నావికాదళం సిద్ధం!

అరేబియా సముద్రంలో లైవ్ ఫైరింగ్ డ్రిల్

యుద్ధంలోలాగే అసలైన ఆయుధాలతో లక్ష్యాలపై దాడి

మోదీతో నేవీ చీఫ్ అడ్మిరల్ భేటీ

సింధు జలాలు మళ్లించే ఏ నిర్మాణమైనా ధ్వంసం చేస్తాం!

పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్య

450 కి.మీ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన పాక్

అనుమతిస్తే పాక్‌లో మానవబాంబుగా పేలుతా

కర్ణాటక మంత్రి జమీర్ అహ్మద్

ఆంధ్ర ప్రగతికి అమరావతి!



అమరావతి పనులు పునఃప్రారంభమయ్యాయి. మూడేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజధాని పనులు వేగంగా, గడువులోపు పూర్తవడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఇదొక శుభపరిణామం.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతి కొందరిదే అన్న భావనను ఒక వర్గం ప్రజల్లో బలంగా వ్యాపింపజేయడంలో జగన్ రెడ్డి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు ఆయన మళ్లీ ప్రతిపక్షంలో ఉన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అమరావతి నిర్మాణం పూర్తయ్యే వరకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

భారతదేశంలో బెంగళూరు, హైదరాబాద్ మాత్రమే ఐటీకి కేరాఫ్‌గా అభివృద్ధి చెందాయంటే ఎస్.ఎం.కృష్ణ, చంద్రబాబు పోటీపడటం వల్లనే. అప్పట్లో కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా ఉన్న వీరిరువురూ ఐటీని అభివృద్ధి చేయడంలో పోటీ పడ్డారు.

రాజధాని నిర్మాణం కోసం యాభై వేల ఎకరాలు అవసరమా? అని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంతమంది అపర మేధావులు ఇప్పటికీ కూనిరాగాలు తీస్తున్నారు. ఇలాంటి వాళ్లు హైదరాబాద్ అభివృద్ధి ఎలా జరిగిందో తెలుసుకోవాలి.

అమరావతి నిర్మాణానికి ఖర్చు చేయబోయే డబ్బుకు రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేదు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చిన భూముల్లో ప్రభుత్వానికి తన వాటాగా వచ్చే భూమిని అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చుకుంటున్నారు. అందుకే ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అయింది.

హైదరాబాద్ ఈ స్థితికి రావడానికి మూడు దశాబ్దాలకు పైగా సమయం పట్టింది. అమరావతిలో కూడా అభివృద్ధి జరిగితే భూములు ఇచ్చిన రైతులు మైనారిటీలు అవుతారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారి సంఖ్యే అధికంగా ఉంటుంది. ఇప్పుడు జగన్ అండ్ కో ఏడుస్తున్నట్టుగా 'ఆ వర్గం' వారు ఎక్కడుంటారో కూడా తెలియదు.

అమరావతిలో చేపట్టిన పనుల వల్ల జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి దాదాపు పదివేల కోట్ల రూపాయలు సమకూరుతాయి. ఈ డబ్బుతో సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించవచ్చు. చంద్రబాబు చెప్పే మోడల్ ఇదే.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంటి పరిసరాల్లో సర్వే చేస్తున్న వారిని అడ్డుకుంటున్న ఆయన అనుచరులు

'బుగ్గమఠం భూముల్లో'
రుబాబు

సర్వే జరక్కుండా పెద్దిరెడ్డి అనుచరుల దౌర్జన్యం

మాజీ మంత్రి ఇంటి వద్ద అధికారులతో ఘర్షణ

బైక్ తాళం లాక్కుని పోలీసుల ఎదుటే వీరంగం

బుగ్గమఠం భూముల్లో 14.49 ఎకరాలు కబ్జా

మఠం ఫిర్యాదుతో పెద్దిరెడ్డి సహా పలువురికి నోటీసు

తాఖీదులకు స్పందించని మాజీ మంత్రి

పైగా సర్వేకు వెళ్లిన అధికారులపై అరాచకం

ఎట్టకేలకు అతికష్టం మీద సర్వే పూర్తిచేసిన వైనం

తిరుపతి, మే 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆక్రమణలకు గురైన బుగ్గమఠం భూముల సర్వేకు వెళ్లిన అధికారులపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు రెచ్చిపోయారు. శనివారం ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు.. సర్వే జరిగినంత సేపూ అధికారులతో ఘర్షణ పడటమో, వారితో వాగ్వాదానికి దిగడమో చేస్తూ ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారు. పెద్దిరెడ్డి ఇంటి ఆవరణలో సర్వే జరపకుండా పలుసార్లు అడ్డుకున్నారు. సర్వే ముగించి వెనుదిరిగిన అధికారులను మరోసారి అడ్డగించి, బైక్ తాళాలు లాక్కొని దౌర్జన్యం చేశారు. సర్వే అధికారులకు రక్షణగా నిలవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్రనే పోషించారు. చివరికి డీఎస్పీ గట్టిగా ఆదేశించడంతో కదిలి ఆందోళనకారులను నియంత్రించారు. ఇక భూదందా విషయానికి వస్తే.. తిరుపతి అర్బన్ మండలం

మిగతా 13వ పేజీలో...

వైసీపీకి లిక్కర్ ఫండ్

అందుకనుగుణంగా మద్యం పాలసీ

డబ్బులు బాగా రావాలని జగన్ చెప్పారు

విజయ సాయిరెడ్డి, మిథున్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి కలిసి చర్చించాం

వ్యాపారుల్ని 12% కమీషన్ అడిగాం

ముడుపులు ఇవ్వనివారికి ఆర్డర్ బంద్

కొన్ని డిస్టిలరీలను లాక్కునే బాధ్యత సాయిరెడ్డి, మిథున్ రెడ్డి తీసుకున్నారు

సిట్ కస్టడీలో రాజ్ కసిరెడ్డి వెల్లడి

చాణక్యతో కలిపి ప్రశ్నించిన అధికారులు

మద్యం స్కామ్‌లో నేడూ సిట్ విచారణ



అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): 'పార్టీకి బాగా ఫండ్ వచ్చేలా లిక్కర్ పాలసీ రూపొందించాలని జగన్ రెడ్డి ఆదేశించారు. విజయసాయి రెడ్డి ఇల్లు, స్టార్ హోటళ్లు, మా ఆఫీసులో పలుమార్లు సమావేశమై అందుకు అనుగుణంగా పాలసీ రూపొందించాం. సాయిరెడ్డి, మిథున్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి కలిసి చర్చలు జరిపాం. కమీషన్ల పర్సెంటేజీపైనా చర్చించి డిస్టిలరీలకు చెప్పేశాం' అని వేల కోట్ల మద్యం స్కాంలో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రానికి మరో భారీ ప్రాజెక్టు

దేశంలోనే తొలి ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ

10 వేల కోట్ల పెట్టుబడులు.. 1.50 లక్షల ఉద్యోగాలు

క్రియేటివ్ ల్యాండ్ ఆసియాతో ప్రభుత్వం ఒప్పందం

ముంబై వేవ్స్ సదస్సులో ఎంవోయూపై సంతకాలు

థీమ్ పార్క్‌లు, గ్లోబల్ సినిమా కో-ప్రొడక్షన్ జోన్‌లు

ఏఐ ఆధారిత వర్చువల్ స్టూడియో కాంప్లెక్స్ ఏర్పాటు

సినిమా, వినోద, పర్యాటక అభివృద్ధికి దోహదం

13

ఆలయంలో తొక్కిసలాట

ఆరుగురి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు

12

ఉత్తర గోవాలోని శిర్గావ్ జాతరలో అపశ్రుతి

26 మంది ఎంబీబీఎస్ విద్యార్థుల సస్పెన్షన్

14 మంది అడ్మిషన్లు రద్దు

11

నీట్-యూజీ 2024 పేపర్ లీకేజీపై ఎన్‌ఎంసీ చర్యలు



విద్యుత్తు సంస్థల డైరెక్టర్ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు సంస్థల్లో డైరెక్టర్ల నియామకానికి సీఎం చంద్రబాబు శనివారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఫైలు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు.. ఆ వెంటనే ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు చేరింది. ముఖ్యమంత్రి ఆమోదం పొందడంతో త్వరలోనే నియామక ఉత్తర్వులు వెంటనే విడుదలయ్యే వీలుందని ఇంధనశాఖ వర్గాలు తెలిపాయి. కాగా, సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (సీపీడీసీఎల్) ఇన్‌చార్జి సీఎండీ భాస్కర్ స్థానంలో సీఎండీగా పుల్లారెడ్డిని నియమించారు.

ప్రపంచ మహాసభలకు తెలుగు ప్రజలు తరలిరావాలి

3వ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచార పత్రిక ఆవిష్కరణలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ప్రచార పత్రికలను ఆవిష్కరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, కోవెలమూడి రవీంద్ర, గజల్ శ్రీనివాస్ తదితరులు

గుంటూరు(తూర్పు), మే 3(ఆంధ్రజ్యోతి): మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు తెలుగు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రపంచ తెలుగు మహా సభల ప్రచార పత్రికను ఆయన గుంటూరు, భారతీయ విద్యా భవన్‌లో శనివారం ఆవిష్కరించి ప్రసంగించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆంధ్ర మేవ జయతే నినాదంతో నిర్వహిస్తున్న తెలుగు పండుగను ప్రతిష్ఠాత్మకంగా గుంటూరులో జరపడం అందరికీ గర్వకారణమన్నారు. తాను ప్రజల్లోకి చొచ్చుకెళ్లేందుకు వారి హృదయాల్లో స్థానం పొందేందుకు తెలుగు భాష చక్కటి మాధ్యమంగా పనిచేసిందని తెలిపారు. తెలుగు మహా సభలకు ఉపరాష్ట్రపతిని ఆహ్వానించాలని నిర్వాహకుల విజ్ఞప్తికి పెమ్మసాని సానుకూలంగా స్పందించారు. గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ తెలుగు మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో జరిగే ప్రపంచ తెలుగు మహాసభలకు గుంటూరు వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. మహాసభల లోగోలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారని, ప్రచార పత్రికలను పెమ్మసాని విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆదివారం నుంచి పలు జిల్లాల్లో వాహనాల ద్వారా తెలుగు మహాసభల విశిష్టత తెలుపుతూ ప్రచారం నిర్వహిస్తామన్నారు.

ఆహార శుద్ధి.. పరిశ్రమతో లబ్ధి!

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ఎంఎస్ఎంఈ రంగంతో ఈ యూనిట్ల అనుసంధానం
- పంట ఉత్పత్తులకు అదనపు విలువ లభించే అవకాశం
- ఆ దిశగా సరికొత్త పారిశ్రామిక పాలసీ కోసం కసరత్తు
- నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి వారిని ఔత్సాహిక
- పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం
- తిరుపతిలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్
- మూడు నెలల కాలపరిమితితో ఔత్సాహికులకు శిక్షణ
- పల్లెల్లోనే టమాటా ప్రాసెసింగ్ కేంద్రాలకు ప్రతిపాదన
- ఈవోఐ ప్రాతిపదికన నిధుల మంజూరుకు కేంద్రం ఓకే
- రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పేవారికి ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు రుణ సదుపాయం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాయలసీమ జిల్లాల్లో ఉద్యాన పంటలు, మామిడి, మిరప, పసుపు తదితరాలతో పాటు కోస్తా జిల్లాల్లో ఆక్వా ఉత్పత్తులను శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని భావిస్తోంది. అందుకు అనువైన పరిస్థితులు, అపారమైన సహజ వనరులు అందుబాటులో ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఆహార శుద్ధి పరిశ్రమలను పెద్దఎత్తున నెలకొల్పాలని నిర్ణయించింది. ఎంఎస్ఎంఈ రంగంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను అనుసంధానం చేయడం ద్వారా గ్రామాల్లో రైతులు పండించే పంటలకు అక్కడికక్కడే వాల్యూ ఎడిషన్ (అదనపు విలువ) లభించే దిశగా సరికొత్త పారిశ్రామిక పాలసీని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో ఆహార శుద్ధి పరిశ్రమలను నెలకొల్పేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు భారీ ప్రోత్సాహకాలు అందించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఈ రంగంలో శిక్షణ ఇచ్చి వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇచ్చేందుకు తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. త్వరలోనే ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇక్కడ అభ్యర్థులకు ప్యాకింగ్, డిజిటల్ కామర్స్, మార్కెటింగ్ మెలకువలను 3నెలల వ్యవధిలో నేర్పిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారు ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు రుణ సదుపాయం సైతం కల్పించనున్నారు.

రూ.50 కోట్లతో టమాటా ప్రాసెసింగ్ కేంద్రాలు

టమాటా ఉత్పత్తుల కోసం పల్లెల్లోనే ఎక్కడికక్కడ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందు కోసం 'ఆపరేషన్ గ్రీన్స్' కార్యక్రమంలో భాగంగా టమాటా విరివిగా పండించే జిల్లాల్లో ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు రూ.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. వీటి ఏర్పాటుకు డీపీఆర్‌ల ప్రాతిపదికన నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించింది. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ ప్రాతిపదికన నిధుల మంజూరుకు కేంద్రం సానుకూలత వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, ఎంఎస్ఎంఈ రంగంతో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను అనుసంధానం చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం రాష్ట్రంలో సొంత భూములు కలిగిన రైతులు, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేసే దిశగా కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆహార శుద్ధి పరిశ్రమలు నెలకొల్పేవారికి తగిన ప్రోత్సాహకాలు అందిస్తే ఈ రంగం ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

రేపు ఏయూ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

విశాఖపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో (సెల్ఫ్ సపోర్టు) ప్రవేశాలకు ఏయూ అధికారులు ఈ నెల ఐదో తేదీన ఆఈట్-2025ను నిర్వహించనున్నారు. పరీక్షకు మొత్తం 5,948 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు.

డయాలసిస్ రోగుల పెరుగుదలకు జగన్ బ్రాండ్లే కారణం

- ఆ మద్యం తాగి అనేకమంది మృతి: మంత్రి సత్యకుమార్
- నెల్లూరు జిల్లాలో రెండు డయాలసిస్ కేంద్రాలు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



నెల్లూరు జిల్లా పొదలకూరులో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రాష్ట్రంలో డయాలసిస్ రోగుల సంఖ్య పెరగడానికి జగన్ మద్యం బ్రాండ్లే కారణమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్ అన్నారు. శనివారం నెల్లూరు జిల్లా వింజమూరు, పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డయాలసిస్ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో 18 వేల మంది ఉన్న డయాలసిస్ రోగులు 2019-24 సంవత్సరాల్లో 81 వేలకు పెరిగారని తెలిపారు. రాష్ట్రంలో 42 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా మరో 18 ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో రాజధానిని నిర్మిస్తామంటున్న కూటమి ప్రభుత్వ హామీలో లొసుగులు వెతకటానికి వైసీపీ విఫలయత్నం చేసిందని మంత్రి సత్యకుమార్ ఆరోపించారు.

సక్సెస్‌కు చిరునామా కేఎల్ యూనివర్సిటీ

- వందశాతం ప్లేస్‌మెంట్స్.. విద్యార్థుల ప్రతిభకు నిదర్శనం
- విద్యకు ప్రాధాన్యం ఇస్తున్న చంద్రబాబు, లోకేశ్: మంత్రి కొల్లు రవీంద్ర



ప్లేస్‌మెంట్‌లు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

తాడేపల్లి(వడ్డేశ్వరం), మే 3(ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ అంటే సక్సెస్‌కు చిరునామా అని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 2025 విద్యా సంవత్సరంలో వంద శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సాధించిన సందర్భంగా గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆదివారం విజయోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన అనంతరం మంత్రి ప్రసంగించారు. ఇక్కడ చదివిన ఆరు వేల మందికి ప్లేస్‌మెంట్‌లు అంటే చిన్న విషయం కాదన్నారు. చంద్రబాబు, లోకేశ్ విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. నూతన విద్యా విధానం ద్వారా లోకేశ్ యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నారని చెప్పారు. స్కిల్ సెన్సస్‌ను తయారు చేసేలా నూతన విధానాలు అవలంబిస్తున్నారన్నారు. క్వాంటమ్ వ్యాలీతో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వాటి ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. చంద్రబాబు పాలనను స్ఫూర్తిగా తీసుకున్నానని మోదీ స్వయంగా చెప్పారంటే అది మన ముఖ్యమంత్రి పని తీరుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రోవీసీ డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్లేస్‌మెంట్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎన్‌బీవీ ప్రసాద్, నైపుణ్యాభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ శ్రీనాథ్, అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, డాక్టర్ సుమన్, డాక్టర్ కిశోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నం థర్మల్‌కు పారాదీప్ పోర్టు పురస్కారం



పారాదీప్ పోర్టు నుంచి ఏపీ జెన్కో అధికారులు అందుకున్న అవార్డు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): బొగ్గు నిల్వలు, గరిష్ఠ స్థాయి విద్యుదుత్పత్తి విభాగాల్లో కృష్ణపట్నం దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్రాజెక్టుకు పారాదీప్ పోర్టు వార్షిక పురస్కారం లభించింది. ప్లాంట్ రిలీఫ్ (పీఎల్ఎఫ్) ఏకంగా 2.0 శాతం పెరిగి 80శాతానికి చేరుకోవడం, పది నుంచి 13 రోజుల పాటు బొగ్గు నిల్వలు సమకూర్చుకోవడంతో ఈ అవార్డు దక్కింది. ఏపీ జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధర బాబు థర్మల్ విద్యుత్తు ప్లాంట్లలో ఉత్పత్తి గరిష్ఠస్థాయిలో ఉండేలా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ అవార్డు దక్కిందని జెన్కోవర్గాలు శనివారం ప్రకటించాయి.

7న ఐసెట్

విశాఖపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల ఏడో తేదీన ఏపీ ఐసెట్-2025ను నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ ప్రొఫెసర్ శశి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 37,752 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు
▪ఆర్కే RK

అమరావతి.. కొందరిదా? అందరిదా?

ప్రధానమంత్రి శుక్రవారం నాడు ప్రారంభించిన పనులతోనే రాజధాని నిర్మాణం సంపూర్ణం కాదు. ప్రభుత్వ నిర్మాణాలతో పాటు ప్రైవేటు రంగంలో కూడా నిర్మాణాలు జరిగినప్పుడే రాజధానికి ఒక రూపు వస్తుంది. "అమరావతి పేరిట ఒక వర్గం ప్రజలకు మేలు చేసేందుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడం అవసరమా? రాష్ట్ర ప్రజలందరికీ చెందిన సొమ్మును ఒకే చోట ఖర్చు చేయడం ఏమిటి?" అని ప్రజలలో విష ప్రచారం చేస్తున్న వారికి వాస్తవం తెలియక కాదు. అమరావతి నిర్మాణానికి ఖర్చు చేయబోయే డబ్బుకు రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేదు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చిన భూముల్లో ప్రభుత్వానికి తన వాటాగా వచ్చే భూమిని అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చుకుంటున్నారు. అందుకే ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అయింది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి గ్రహణాలన్నీ ఇప్పుడు తొలగిపోయాయి. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం మూడేళ్లలో రాజధాని నిర్మాణానికి నేను కూడా భుజం కలుపుతానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అమరావతి కేవలం రాజధాని కాదు– ఒక శక్తి అని, రాజధాని పూర్తయితే రాష్ట్ర జీడీపీ ఎక్కడికి వెళుతుందో ఊహించగలనని కూడా ప్రధాని చెప్పారు. ఇదే అమరావతికి, ఇదే ప్రధానమంత్రి సుమారు పదేళ్ల కిందట శంకుస్థాపన చేశారు. కాలూ చేయీ కూడదీసుకొని పనులు ప్రారంభించి, ఒకస్థాయికి చేర్చేసరికి రాష్ట్రంలో ప్రభుత్వం మారి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. మూడు రాజధానుల పల్లవి అందుకున్నారు. అప్పటి నుంచి అమరావతికి గ్రహణం పట్టింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అప్పటికే ఖర్చు చేసిన పది వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయింది. అమరావతిని భ్రమరావతిగా, కమ్మరావతిగా అభివర్ణించారు. వైసీపీకి చెందిన కాలనాగులు రాజధానిపై విషం చిమ్మాయి. ఫలితంగా ఆంధ్రుల కలల రాజధాని శ్మశానంగా మారింది. రేపటి కోసం చంద్రబాబు కలలుగన్న అమరావతి ఉసురు తీయాలనుకున్నారు. అమరావతి తమది కాదన్న భావనను ఒక వర్గం ప్రజలలో నూరి పోశారు. ఇది గతం! అమరావతి చంద్రబాబుది కాదు. లోకేశ్‌ది కాదు. ఆ సామాజిక వర్గానిదీ కాదు. రేపటికోసం నిర్మితం కాబోతున్న నగరమది. రేపటి తరం ఆ ఫలితాలను అందుకుంటుంది.

శుభపరిణామాలు...

ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అమరావతి పనులు పునఃప్రారంభమయ్యాయి. మూడేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజధాని పనులు వేగంగా, గడువులోపు పూర్తవడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఇదొక శుభపరిణామం. ఎందుకంటే, అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు 2029 వరకు అధికారంలో ఉంటాయి. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం పనులు జరిగితే ఆలోపే రాజధాని నిర్మాణం పూర్తవుతుంది. ఆ తర్వాత ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ రాజధానిని కదిలించలేరు. అయితే, ఇల్లు అలకగానే పండుగ కాదన్నట్టుగా శుక్రవారం నాటి ప్రధాని హామీతో అంతా సవ్యంగా జరుగుతుందని భావించలేం. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమరావతిపై అంతులేని ద్వేషాన్ని పెంచుకున్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల ముఖాలు చూడ్డానికి కూడా అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఇష్టపడలేదు. గత ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిందిగానీ, వైసీపీకి అనుబంధంగా మారిన పోలీసులు, అధికారులు, జర్నలిస్టులుగా చలామణి అవుతున్న వాళ్లు, మేధావుల ముసుగులో తిరగాడుతున్న వాళ్లు, పిల్ల సైకోలు ఇప్పటికీ చురుగ్గానే పనిచేస్తున్నారు. ఈ శక్తులు మారీచులుగా మారి అమరావతి నిర్మాణానికి అడుగడుగునా ఆటంకాలు సృష్టించవచ్చు. రాజధాని ప్రాంతంలో అరటి తోటలు తగులబెట్టడం– కులం చిచ్చు పేరిట రాష్ట్రంలో రైళ్లను ధ్వంసం చేయడం వంటి సంఘటనలను మళ్లీ చూడాల్సి రావచ్చు. హై సెక్యూరిటీ ఉండే విమానాశ్రయాలలో కోడికత్తులను చూశాం. నట్టింట్లో గొడ్డలి వేటునూ చూశాం. ఇలాంటివి మళ్లీ జరగవన్న గ్యారంటీ ఏమిటి? కులాలపరంగా ఆంధ్రప్రదేశ్ అతి సున్నితమైన రాష్ట్రం. కులం కోసం కత్తులు దూసుకుంటారు. తెలంగాణలో మాదిరి ఈ రాష్ట్రం నాది– మాకు రాజధాని లేకపోతే ఎలా? అన్న భావన తక్కువ. ఈ కారణంగానే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతి కొందరిదే అన్న భావనను ఒక వర్గం ప్రజల్లో బలంగా వ్యాపింపజేయడంలో జగన్‌రెడ్డి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు ఆయన మళ్లీ ప్రతిపక్షంలో ఉన్నారు. శాసనసభలో సంఖ్యాపరంగా జగన్ బలహీనంగా ఉన్నప్పటికీ కుల, మత అభిమానంతోపాటు రాజశేఖరరెడ్డి కుమారుడన్న అభిమానం కలగలిపి మొత్తం మీద 40 శాతం ప్రజలు ఇప్పటికీ తనకు అండగా ఉన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం అమరావతి నిర్మాణం పూర్తయ్యే వరకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎంత మంచి పంట వేసినా దానికి చీడపీడలు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కలుపు మొక్కలను ఏరిపారేయాలి. అప్పుడే పంట చేతికి వస్తుంది. ప్రధాని ఊహించినట్టుగా రాష్ట్ర జీడీపీ అమాంతం పెరగాలంటే అమరావతి నిర్మాణం ఆటంకాలు లేకుండా సకాలంలో పూర్తి కావాలి. ఈ క్రమంలో రాహు కేతువులను అణచివేయాలి. మన చుట్టూ ఉన్న ఆర్థిక ఉగ్రవాదులు, సైకోలను కట్టడి చేయాలి. జగన్‌రెడ్డి సంప్రదాయ రాజకీయాలను నమ్మకోరు. ఈ కారణంగా ఎవరూ ఊహించని మార్గాల నుంచి రాజధాని నిర్మాణానికి ఆటంకాలు ఎదురుకావొచ్చు.

నేటికీ లేని రాజధాని

రాష్ట్రం విడిపోయి పదకొండేళ్లు అవుతున్నా రాజధాని కూడా ఏర్పడనందుకు ఆంధ్రులు బాధపడాలి. అద్భుతంగా అభివృద్ధి చెందిన హైదరాబాద్ తెలంగాణ సొంతం. మనం కూడా అటువంటి రాజధానిని నిర్మించుకోవాలన్న కసి ఏపీ ప్రజల్లో ఏర్పడకుండా చేశారు. ప్రపంచంలో ఏ నగరం కూడా మూడు నాలుగేళ్లలో పూర్తి కాదు. అదొక నిరంతర ప్రక్రియ. హైదరాబాద్‌నే తీసుకుందాం! ప్రస్తుతం అభివృద్ధికి నమూనాగా ఉన్న సైబరాబాద్‌కు చంద్రబాబు పురుడుపోసినప్పుడు అక్కడ రాళ్లూ రప్పలు మాత్రమే ఉండేవి. ఆ తర్వాత ప్రైవేటు రంగం సహకారంతో అద్భుత నగరంగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వం తరఫున చంద్రబాబు అప్పట్లో సహాయ సహకారాలు అందించారు. ఐటీ రంగాన్ని ఆకర్షించారు. అప్పట్లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తాను హైదరాబాద్‌లో చంద్రబాబు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తున్న తీరును జాగ్రత్తగా గమనించేవాడినని ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా చెప్పారు. నాలుగు ప్రభుత్వ భవనాలను నిర్మించినంత మాత్రాన అభివృద్ధి జరిగిపోదు. ఏ ప్రభుత్వమైనా ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు మౌలిక వసతులను మాత్రమే సమకూరుస్తుంది. భారతదేశంలో బెంగళూరు, హైదరాబాద్ మాత్రమే ఐటీకి కేరాఫ్‌గా అభివృద్ధి చెందాయంటే ఎస్.ఎం.కృష్ణ, చంద్రబాబు పోటీపడటం వల్లనే. అప్పట్లో కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా ఉన్న వీరిరువురూ ఐటీని అభివృద్ధి చేయడంలో పోటీపడ్డారు. అప్పటికే ఐటీలో బెంగళూరు ముందంజలో ఉంది. హైదరాబాద్ మత కలహాలకు కేరాఫ్‌గా ఉండేది. ఆ పరిస్థితులలో హైదరాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను దిగ్గజ ఐటీ కంపెనీలకు కేటాయించడం ద్వారా చంద్రబాబు ఆయా కంపెనీలను ఆకర్షించారు.

కుహనాల కూని రాగాలు...

రాజధాని నిర్మాణం కోసం యాభై వేల ఎకరాలు అవసరమా? అని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంతమంది అపర మేధావులు ఇప్పటికీ కూని రాగాలు తీస్తున్నారు. ఇలాంటి వాళ్లు హైదరాబాద్ అభివృద్ధి ఎలా జరిగిందో తెలుసుకోవాలి. ప్రైవేటు సంస్థలకు కేటాయించడానికి అవసరమైన భూమి ప్రభుత్వం వద్ద ఉన్నప్పుడే ఏ కంపెనీ అయినా ముందుకు రావడానికి ఆసక్తి చూపుతుంది. హైదరాబాద్‌లో ఇప్పటికీ ప్రభుత్వం వద్ద కొన్ని వేల ఎకరాల భూమి ఉంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనుకొనే వారికి ఈ భూములను ఆకర్షణగా చూపుతున్నారు. అమరావతి మహానగరంగా అభివృద్ధి చెందాలంటే ప్రైవేటు రంగం కూడా కలసి రావాలి. ప్రధానమంత్రి శుక్రవారం నాడు ప్రారంభించిన పనులతోనే రాజధాని నిర్మాణం సంపూర్ణం కాదు. ప్రభుత్వ నిర్మాణాలతో పాటు ప్రైవేటు రంగంలో కూడా నిర్మాణాలు జరిగినప్పుడే రాజధానికి ఒక రూపు వస్తుంది. "అమరావతి పేరిట ఒక వర్గం ప్రజలకు మేలు చేసేందుకు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడం అవసరమా? రాష్ట్ర ప్రజలందరికీ చెందిన సొమ్మును ఒకేచోట ఖర్చు చేయడం ఏమిటి?" అని ప్రజలలో విష ప్రచారం చేస్తున్న వారికి వాస్తవం తెలియక కాదు. అమరావతి నిర్మాణానికి ఖర్చు చేయబోయే డబ్బుకు రాష్ట్ర బడ్జెట్‌తో సంబంధం లేదు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇచ్చిన భూముల్లో ప్రభుత్వానికి తన వాటాగా వచ్చే భూమిని అభివృద్ధి చేసి విక్రయించడం ద్వారా రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చుకుంటున్నారు. అందుకే ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అయింది. హైదరాబాద్‌లో, అంటే సైబరాబాద్‌లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వాలు కూడా తమ వద్ద ఉన్న భూములను విక్రయించడం ద్వారా నిధులు సమకూర్చుకోవడం వాస్తవం కాదా? ఇప్పుడు అభివృద్ధి చెందిన హైదరాబాద్ నుంచి అందుతున్న ఫలాలతోనే తెలంగాణలోని మిగతా ప్రాంతాలను అభివృద్ధి చేయడం నిజం కాదా? అమరావతిని మాత్రమే అభివృద్ధి చేస్తే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని నసుగుతున్నవారు ఈ విషయం తెలుసుకోవాలి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ఆర్థికంగా పరిపుష్టంగా ఉండటానికి కారణం ఏమిటి? చెన్నయ్, బెంగళూరు, ముంబై వంటి మహానగరాలు ఉండటం వల్లనే ఆయా రాష్ట్రాలకు ఇబ్బడి ముబ్బడిగా ఆదాయం వస్తోంది. తమిళనాడులో చెన్నయ్ మాత్రమే కాదు– మరెన్నో నగరాలు ఉన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కోయంబత్తూరు వంటి నగరాలు ఉన్నాయి. చిన్న రాష్ట్రమైన కర్ణాటకను బెంగళూరు ఆదుకుంటోంది. దేశ ఆర్థిక రాజధానిగా అలరారుతున్న ముంబైతోపాటు పుణె, నాగపూర్ వంటి నగరాలు మహారాష్ట్రలో ఉన్నాయి. నగరాలు అభివృద్ధి చెందిన రాష్ట్రాలలోనే ప్రగతిని చూస్తున్నాం. మహానగరాలు లేని ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. అందుకే వాటి గురించి మనం మాట్లాడుకోం! మన యువత ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్, ముంబై, ఢిల్లీ వంటి నగరాల వైపు మాత్రమే చూస్తున్నారు కదా! నగరాల నుంచి లభించే ఆదాయంతో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవచ్చు. ఈ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. లేని పక్షంలో గ్రామాల నుంచి నగరాలకు వలసలు పెరిగిపోయి సామాజిక పరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయి.

> **'గొప్పగా ఆలోచించండి' అని దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాటలను విశ్వసించే చంద్రబాబు అమరావతి విషయంలో కూడా గొప్పగా ఆలోచిస్తున్నారు. ఇందులో తప్పు పట్టేది ఏముంది? ఆయన తదనంతరం ముఖ్యమంత్రులుగా వచ్చే వాళ్లు ఇదే ఒరవడిలో ఆలోచిస్తే అమరావతి నిరంతరంగా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది.**

'ఒక వర్గం'... ఒక వాదన!

అమరావతి ఒక వర్గం ప్రజలకు మాత్రమే పరిమితమన్న విమర్శల విషయానికి వద్దాం! హైదరాబాద్ ఒకప్పుడు ఎలా ఉండేదో గుర్తుచేసుకుందాం. అప్పుడు మూసీకి అవతల, ఇవతల అన్నట్టుగా ఉండేది. ఒకవైపు ముస్లింల సంఖ్య అధికంగా ఉండేది. మరోవైపు స్థానిక హిందువులు ఉండేవారు. రెండు వర్గాల మధ్య మత ఉద్రిక్తతలు తలెత్తేవి. నిజాం హయాంలో నిర్మితమైన కట్టడాలు మినహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెప్పుకోదగిన నిర్మాణాలను ప్రభుత్వాలు చేపట్టలేదు. హైదరాబాద్ అభివృద్ధి చెందని కారణంగా రాష్ట్ర ఆదాయం 1983 వరకు పదివేల కోట్ల రూపాయలలోపు ఉండేది. ఈ నేపథ్యంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ట్యాంక్ బండ్‌తోపాటు హైదరాబాద్‌లోని ప్రధాన రహదారులను విస్తరించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఆంధ్ర ప్రాంతం నుంచి సామాన్య ప్రజలు కూడా హైదరాబాద్‌కు వలస వచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఐటీ రంగం అభివృద్ధిని ఒక ఉద్యమంలా చేపట్టారు. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన ఐటీ రంగ నిపుణులు ఉపాధి కోసం హైదరాబాద్ బాట పట్టారు. ఆ తర్వాత రాజశేఖరరెడ్డి, కేసీఆర్ వంటి వారితోపాటు ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు కూడా పెట్టుబడులను ప్రోత్సహించడంలో పోటీపడ్డాయి. ఫలితంగా దేశం నలుమూలల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు వలస వచ్చి స్థిరపడ్డారు. దేశంలోని 28 రాష్ట్రాల ప్రజలూ ఇక్కడ కనిపిస్తారు. ఫలితంగా హిందూ–ముస్లింల మధ్య గొడవలు నిలిచిపోయాయి. ఇప్పుడు హైదరాబాద్‌లో తెలంగాణ వారు ఎంత మంది? ఇతర రాష్ట్రాల వారు ఎంత మంది? అంటే బయటి వాళ్లే ఎక్కువ అని చెప్పవచ్చునేమో! దీంతో మత ఉద్రిక్తతలకు ఒకప్పుడు కేరాఫ్ అడ్రస్‌గా ఉండే హైదరాబాద్ ఉపాధి అవకాశాలకు చిరునామాగా మారింది. హైదరాబాద్ ఈ స్థితికి రావడానికి మూడు దశాబ్దాలకు పైగా సమయం పట్టింది. అమరావతిలో కూడా అభివృద్ధి జరిగితే భూములు ఇచ్చిన రైతులు మైనారిటీలు అవుతారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారి సంఖ్యే అధికంగా ఉంటుంది. ఇప్పుడు జగన్ అండ్ కో ఏడుస్తున్నట్టుగా 'ఆ వర్గం' వారు ఎక్కడుంటారో కూడా తెలియదు. రేపటికోసం ఆలోచించే వాడే నిజమైన ప్రజానాయకుడు, రాజనీతిజ్ఞుడు అవుతాడు. సంకుచితంగా ఆలోచించేవాడు ఎప్పటికీ ప్రజా నాయకుడు కాలేడు. సైబరాబాద్‌కు పునాదులు వేసిన చంద్రబాబు ఇప్పుడు తెలంగాణలో బయటి వ్యక్తి! నిజాం నిర్మించిన భవనాలలో ఇప్పుడు వారి వారసులు నివసించడం లేదే? అమరావతి కూడా పూర్తిగా అభివృద్ధి చెందడానికి కొన్ని దశాబ్దాలు పడుతుంది. అప్పటిదాకా నేను జీవించి ఉంటానా? అని చంద్రబాబు ఆలోచిస్తే సమర్థించగలమా? 'గొప్పగా ఆలోచించండి' అని దివంగత అబ్దుల్ కలాం చెప్పిన మాటలను విశ్వసించే చంద్రబాబు అమరావతి విషయంలో కూడా గొప్పగా ఆలోచిస్తున్నారు. ఇందులో తప్పు పట్టేది ఏముంది? ఆయన తదనంతరం ముఖ్యమంత్రులుగా వచ్చేవాళ్లు ఇదే ఒరవడిలో ఆలోచిస్తే అమరావతి నిరంతరంగా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. చంద్రబాబు రేపటి కోసం ఆలోచిస్తుండగా, కొంత మంది ఇవాళ సంగతి ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ భవన నిర్మాణం చేపట్టినప్పుడు కూడా ఎన్నో విమర్శలు వచ్చాయి. హైదరాబాద్‌లో ఇప్పుడు కొంత మందైనా ఆయనను తలచుకుంటున్నారు. రాయలసీమలో పాలెగాళ్ల సంస్కృతి విషయానికి వద్దాం! ఒకప్పుడు అక్కడ ఫ్యాక్షన్ గొడవలకు ఎంతో మంది బలయ్యారు. అందుకు ప్రధాన కారణం పేదరికంతోపాటు ఉపాధి లేకపోవడం. కాలక్రమంలో రాయలసీమలో సాగునీటి వసతి మెరుగుపడుతూ వచ్చింది. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. ప్రభుత్వాలతో ప్రమేయం లేకుండానే పాలెగాళ్ల సంస్కృతి చాలా వరకు మాయమైంది.

అందుబాటులో భూమి...

భూమి లభ్యత కారణంగా హైదరాబాద్‌లో వేలాది పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వందలు, వేల ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ స్థాయిలో భూమి లభ్యత ఉండదు. అక్కడ ప్రైవేటు భూమి ఎక్కువ. భారీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమిని ప్రభుత్వం కేటాయించలేదు. అలాంటప్పుడు రాజధానిలో ఉపాధి అవకాశాలు పెంచడం ఎలా? అన్న సందేహం కలుగుతుంది. ఈ కారణంగానే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాంది పలికారు. వందల వేల ఎకరాలు కేటాయించలేని పరిస్థితి ఉన్నందున సర్వీసు రంగాన్ని ఆయన ఎంచుకున్నారు. అమరావతి వంటి మహా నగరాలు అభివృద్ధి చెందినప్పుడే ఆంధ్రప్రదేశ్‌లో కులాల కుంపట్లు పోతాయి. హైదరాబాద్‌లో ఎవరి కులం ఏమిటో ఎవరికీ తెలియదు. ఎందుకంటే మన పక్కింటివాడు వేరే రాష్ట్రానికి చెందినవాడై ఉంటాడు. అభివృద్ధి కారణంగానే అక్కడ కులాలు, మతాలకు చోటు లేకుండా పోయింది. ఏపీలో ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో రంగంలో అభివృద్ధి చేయవచ్చు. ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖపట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేస్తే అది కూడా మహానగరం అవుతుంది. రాయలసీమలో తిరుపతి ఉండనే ఉంది. మిగతా ప్రాంతాలలో సోలార్ ఎనర్జీని అభివృద్ధి చేస్తున్నారు. అమరావతితో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి తన సంపూర్ణ సహకారాలు ఉంటాయని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు కనుక ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇదొక మహదావకాశం. అమరావతి ప్రజా రాజధాని ఎలా అవుతుంది? అని విమర్శించే వారికి కూడా సమాధానం చెప్పేలా ఆయన రాజధానిని నిర్మించాలి. భూముల ధరలు ప్రజలకు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడితే అల్పాదాయ వర్గాల వారు ఇబ్బందిపడతారు. అన్ని వర్గాల వారూ నివసించడానికి అనువుగా రాజధాని నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలి. లేని పక్షంలో ఇప్పుడు హైదరాబాద్‌లో అల్పాదాయ వర్గాల వారికి ఎదురవుతున్న ఇబ్బందులే అమరావతిలోనూ ఎదురవుతాయి. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ బూమ్ పేరిట హైదరాబాద్‌లో భూముల ధరలను ఆకాశాన్ని అంటేలా చేశారు. ధరలను కృత్రిమంగా పెంచారు. వేలాది ఎకరాల భూమి నిరుపయోగంగా ఉన్నప్పటికీ సొంత ఇంటి కలకు పేదవారు దూరమయ్యారు. అమరావతిలో భూముల ధరలకు ఇప్పటికే రెక్కలు వచ్చాయి. బహుశా ఈ కారణంగానే కాబోలు, మరికొంత భూమిని రాజధాని కోసం సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

విశాల దృక్పథంతోనే...

చరిత్రలో ఎంతో మంది పాలకులను చూశాం. వారిలో కొందరినే గుర్తుపెట్టుకుంటాం. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే అక్కడి ప్రజల ఆలోచనలు కూడా కొన్ని సందర్భాలలో సంకుచితంగా ఉంటాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వంటి వారు ఉండనే ఉంటారు. ప్రజల మెదళ్లను విషపూరితం చేయడానికి ఆయన ప్రయత్నిస్తూనే ఉంటారు. అమరావతి నిర్మాణం సజావుగా పూర్తయి చంద్రబాబుకు పేరొస్తే జగన్‌రెడ్డి జీర్ణించుకోలేరు. ఇప్పటికైనా రాజధాని ఏర్పడుతుందా? అని ఎంతో మంది ఆశగా ఎదురుచూస్తుండగా, రాజధాని ఎప్పటికీ ఏర్పడకూడదని కోరుకొనే వాళ్లలో జగన్ వంటి వాళ్లు ముందుంటారు. విపరీత మనస్తత్వం ఉన్న వాళ్లు ఇలాగే ఆలోచిస్తారు. ఈ కారణంగా గతంలో జరిగిన కుట్రలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో అమలయ్యే అన్ని రకాల కుట్రలను పసిగడుతూ చంద్రబాబు ప్రభుత్వం జాగరూకతతో వ్యవహరించాలి. జగన్‌కు మద్దతుగా నిలుస్తున్న పిల్ల సైకోలు ప్రతి చిన్న విషయాన్ని రాద్ధాంతం చేయడానికి కాచుకొని ఉన్నాయి. అడుగుకొకరు చొప్పున మారీచులు, సుబాహులు ఉన్నారు. అందుచేత అమరావతి నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోయాయని భావించడానికి లేదు. ఈ నేపథ్యంలో రేపటి తరంకోసం ఆలోచించే వారందరూ ప్రభుత్వానికి అండగా నిలబడి రాజధాని అనే మహాయజ్ఞం నిర్విఘ్నంగా పూర్తయ్యేలా చేయి చేయి కలిపి నడవాలి. అదే సమయంలో ప్రభుత్వం తన దృష్టినంతా అమరావతి నిర్మాణంపైనే పెట్టిందన్న అభిప్రాయం ఇతర ప్రాంతాల ప్రజల్లో వ్యాపించకుండా పాలకులు జాగ్రత్తలు తీసుకోవాలి. అభివృద్ధి ఫలాలు అందేలోపు.. ప్రజల్లో అసంతృప్తి బీజాలు ఏర్పడకుండా చూడాలి. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో ఫీల్ గుడ్ భావన కల్పించడం అవసరం. అయితే ప్రభుత్వ పరంగా చోటుచేసుకొంటున్న కొన్ని సంఘటనలు కూటమి ప్రభుత్వానికి మచ్చగా మిగులుతున్నాయి. తాజాగా విశాఖపట్నంలో సింహాచలం దేవస్థానం వద్ద నిర్మాణంలో ఉన్న గోడ కూలి ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణం. కనీస అంచనాలు, డిజైన్లు కూడా లేకుండా ఎవరో అధికారి చెప్పారని గోడ కట్టించడం ఏమిటి? తిరుమల తర్వాత అంతటి ప్రాశస్త్యం ఉన్న సింహాచలం దేవస్థానానికి పూర్తి స్థాయి ఈవో లేకపోవడం ఏమిటి? అధికార యంత్రాంగం కలుషితం అయింది. అధికారుల్లో అనేక మంది ఇప్పటికీ జగన్ రెడ్డికి విధేయులుగానే ఉన్నారు. ఇలాంటి వారిని ఏరి పారేయకుండా కీలక స్థానాల్లో కొనసాగించడం వల్ల అనర్థాలే జరుగుతాయి. నోటి మాటగా చెప్పగానే గోడ కట్టించడం అంటే దేవదాయ శాఖలో బాధ్యతారాహిత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గోడ నిర్మాణంలో దేవాదాయ శాఖ బాధ్యత ఎంతో, పర్యాటక శాఖ బాధ్యత ఎంతో తేలాల్సి ఉంది. ఏది ఏమైనా ఏడు నిండు ప్రాణాలు పోయాయి. ప్రభుత్వ విభాగాలలో జవాబుదారీతనం పెంపొందించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి పెట్టాలి. నిన్నగాక మొన్న తిరుపతిలో ఒక దురదృష్టకర సంఘటన జరిగింది. ప్రమాదాలకు కారణాలు ఏమైనప్పటికీ అధికార యంత్రాంగంలో భయం, భక్తి లేకపోవడమే ప్రధాన కారణం. వివిధ కారణాల వల్ల తెలుగునాట భక్తి రసం పొంగి పొరలుతోంది. భక్తిని మార్కెట్ చేస్తున్నారు. దీంతో ప్రతి చిన్న ప్రత్యేక సందర్భాలలో భక్తులు దేవాలయాలకు పోటెత్తుతున్నారు. ఒకప్పుడు హనుమాన్ జయంతిని పెద్దగా పట్టించుకునేవారు కారు. ఇప్పుడు ఆ రోజున కూడా రామాలయాలు కిటకిటలాడుతున్నాయి. ఇప్పుడు అమరావతిలో కూడా భారీ నిర్మాణాలు చేపట్టబోతున్నారు. అక్కడ ఎలాంటి దురదృష్టకర సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఫలితం ఉండదు.

అలాగే... అమరావతితో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కూడా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలి. లేని పక్షంలో ప్రాంతీయ విద్వేషాలు సృష్టించడానికి కొంత మంది సిద్ధంగా ఉన్నారు. అభివృద్ధి పనులు ఊపందుకుంటే ప్రభుత్వ ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుంది. అమరావతిలో చేపట్టిన పనుల వల్ల జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి దాదాపు పదివేల కోట్ల రూపాయలు సమకూరుతాయి. ఈ డబ్బుతో సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించవచ్చు. చంద్రబాబు చెప్పే మోడల్ ఇదే. అయితే, చంద్రబాబు రాజకీయంగా దెబ్బ తినకూడదంటే వచ్చే ఎన్నికల లోపు అభివృద్ధి ఫలాలు పేదలకు అందేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి. లేనిపక్షంలో జగన్ వంటి వారికి ఆయుధాలు ఇచ్చినట్టే అవుతుంది. తస్మాత్ జాగ్రత్త!




> **గతంలో జరిగిన కుట్రలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో అమలయ్యే అన్ని రకాల కుట్రలను పసిగడుతూ చంద్రబాబు ప్రభుత్వం జాగరూకతతో వ్యవహరించాలి. జగన్‌కు మద్దతుగా నిలుస్తున్న పిల్ల సైకోలు ప్రతి చిన్న విషయాన్ని రాద్ధాంతం చేయడానికి కాచుకొని ఉన్నాయి. అడుగుకొకరు చొప్పున మారీచులు, సుబాహులు ఉన్నారు. అందుచేత అమరావతి నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోయాయని భావించడానికి లేదు. ఈ నేపథ్యంలో రేపటి తరంకోసం ఆలోచించే వారందరూ ప్రభుత్వానికి అండగా నిలబడి రాజధాని అనే మహా యజ్ఞం నిర్విఘ్నంగా పూర్తయ్యేలా చేయి చేయి కలిపి నడవాలి. అదే సమయంలో ప్రభుత్వం తన దృష్టినంతా అమరావతి నిర్మాణంపైనే పెట్టిందన్న అభిప్రాయం ఇతర ప్రాంతాల ప్రజల్లో వ్యాపించకుండా పాలకులు జాగ్రత్తలు తీసుకోవాలి. అభివృద్ధి ఫలాలు అందేలోపు.. ప్రజల్లో అసంతృప్తి బీజాలు ఏర్పడకుండా చూడాలి. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో ఫీల్ గుడ్ భావన కల్పించడం అవసరం.**

బజారోడు సెప్పిందే యేదం!

బజారులోని సరుకుల్లాగ మనుషులూ కల్తీ అయిపోనారు. కల్తీ యేదో నికార్సేదో పొల్తి పట్టలేము. కల్తీయే నికార్సుగా చలామణీ అయిపోతంది! బజారుని ఆక్రమించినోడు మనుషుల్నీ ఆక్రమించినాడు. కనబడనీ చెయ్యేదో ఆడిస్తన్న ఆట బొమ్మలమని అపుడెపుడో సినీకవి దేవుడిసేతిలో బొమ్మలన్న అర్థంల రాసినాడు గానీ ఆదిగా దేముడ్నీ బొమ్మని చేసి ఆడించుతండు కనబడకండా! పొద్దు దూరిన నుంచి పొద్దుపోయీదాకా ఆడు మనుషులెనకాల నిలబడి నడిపిత్తాడు. ఆడు చెప్పినట్టు నడడాన్ని వ్యసనం సేసినాడు. పక్కకి వొసలడానికి వొల్లకాదు. వొలలోని సేపల్లాగ ఆడి ఇలాకాల తిరగాల. పళ్లుదోముకొని పాచి కడుక్కోడం నుండి రేతిరి కునుకుదీసీదాకా నువ్వేటి సెయ్యాలో, యే గుడ్డ కట్టాలో, యే నీళ్ల వోసుకోవాలో, యే నీళ్ల తాగాలో, యేటి తినాలో ఆఖరికి యేటి యేరగాలో ఆడే డైరెక్సన్ సేత్తాడు. మనుసులిపుడు బజారోడి చేతిల కీలు బొమ్మలు. బజారుని ఆక్రమించినోడు బజారోడి సరుకులునే కాదు ఆడి గుణాల్నీ మనుసులికి అంటగట్టినాడు. మాయామర్మం, బాబక్రం, ఉబ్బర సొత్తుకి ఉరకడం, అవుసిరిం లేకపోయినా అబద్ధమే ఆడడం, పొరుగుకి పనికొస్తాదంతే పొయ్యి ఆర్పేడం, ఊస్టమయినా ఎవుడికీ ఎరువివ్వకపోడం, నాకేటి అన్న ఆలోసిన తప్పా మనకేటి అని పొరపాట్న కూడా అనుకోకపోడం... బజారోడి గుణాలు. మనుసులిపుడు బజారోళ్లు! బృందాలుగుంతారు, సంగాలు గడతారు. మోర్నింగ్ వాకులూ, ఈవెనింగు ఈవెంట్లూ కలిసేసేస్తారు, గానీ ఎవుడికి ఆడు యమునాతీరే!

ప్రపంచమంతా ఒక బజారయినపుడు ఆరంభమయినాదీ బజారుగుణం. అంతకమునుపు మనుషులు కష్టాన్ని నమ్ముకునీవోళు. కష్టాన్ని అమ్ముకునీవోళ్లు. నమ్ముకున్నదానికి, అమ్ముకున్నదానికి అన్నేయిం జరిగితే కన్నెర్రజేసీ వోళు. కర్రా, కత్తి పట్టుకుని తిరగబడీవోళు. కష్టసుఖాలందరూ పంచుకునీవోళు. ఇరుగూ పొరుగూ, ఊరూ వాడా దండుగట్టీవోళు. ధర్మాధర్మాల్ని తేల్సీసీవోళు. తప్పుడు కూతల్నీ, సేతల్నీ, నడతల్నీ సెరిగీసీవోళు.. బజారు మనిసని దూసించీవోళు. మనుసులు బజారోడు నడిపినట్ట నడిసీవోళు కాదు. కనబడని సెయ్యి కాదు మహాత్ములెలిగించిన బతుకు దివ్వలేవో దోవ సూపేవి. దోవ సూపే దివ్వల్ల యిపుడు చమురింకిపోనాది. పమిదలు పగిలిపోనాయి. అక్కడక్కడా దివిటీలేవో మండతన్నాయిగానీ సీకటి కమ్మిన లోకాన ఆ ఎల్తురు సాలటంలేదు. కొన్ని దివిటీలు ఆరిపోనాయి. ఆరిపోయిన దివిటీలొట్టుకొని కొందరు నడస్తన్నారు. సీకటి, సీకటి, సీకటి బజారయిపోనాది నోకం!



> **మనుసులిపుడు బజారోడు అమ్మిందే కొంటన్నారు. ఆడు తినమన్నదే తింటన్నారు. ఆడు సదవమన్నదే సదువుతన్నారు. ఆడు యిచ్చినంత పుచ్చుకొని చెప్పిన నౌకరీనే సేస్తన్నారు. గద్దె మీదున్నోడే గజీతగాడంతన్నారు. గజీతగాడు పురాణాల్ని తిరగ రాస్తే కంఠోపాఠం పెడతన్నారు. చట్టాల్ని రద్దు చేస్తే చప్పట్లు కొడతన్నారు. ఆడు మొక్కమన్న దేముడికే మొక్కతన్నారు.**

సీకటి కాదిది ఎల్తురంతాడు బజారోడు. ఆడి సేతిల నువ్వే కాదు నీ ఓటుతోటి గద్దెనెక్కిన పెద్దమనిసీ కీలుబొమ్మే. నీలాగే బజారోడు సెప్పినట్టగ గద్దెనెక్కినోడూ నడుసుకుంతాడు. పొద్దూరిన కాంచి పొద్దుపోయీ దాకా ఆడేటి సెయ్యాలో బజారోడు సెపతాడు. ఏ దేశం యెళ్లాల? ఏ కంపెనీని దేశంలోకి రమ్మనాల? ఏ అడివిలు నరకాల? ఏ కొండలు దొలచాల? ఏ సముద్రాలు తోడీయాల? యే ఊరిల యే దివ్వెలెలగాల? ఏ నగరంల యే దివ్వెలారిపోవాల... అన్నీ బజారోడు సెపతాడు. గద్దెనెక్కినోడు సేసిపెడతాడు. రాజ్జెంగాన్ని బజారోడి ఇనప్పిరవాల తనకా యెట్టీసుకుంతాడు.

ఆడి కోసం ఊళ్లని ఖాళీ సెయ్యించుతాడు. భూముల్ని సెజ్జులు సేస్తాడు. రోడ్లని యెడల్పు సెయ్యించుతాడు. ఇమానాశ్రయాలు కడతాడు. గుడిసెల్ని ఖాళీ జేయించి సుందర నగరాల్ని సేస్తాడు. బజారోడు ఆడించినట్టల్లా ఆడతాడు. అలగేటలగ ఆడతన్నావు... బజారోడి పరిపాలన సేస్తన్నావేటని నువ్వడిగితే నిన్ను నక్సలయిటువంతాడు. నక్సలయిటులు అడివిలగదా వుంతారు, నీను అడివిల లేను, నగరాల వున్నానంతే – అపుడాడు నిన్ను అర్బన్ నక్సలయిటువంతాడు. ఆడిని సంపడానికి నువ్వూ, ఆ అడివిల వున్నోళూ కలిసి కుట్ర సేసారని కుట్ర కేసెట్టి నిన్ను ఖైదులెడతాడు! దేశభక్తిని బజారోడి కాడ నేర్సుకోమంతాడు.

మనుసులిపుడు బజారోడు అమ్మిందే కొంటన్నారు. ఆడు తినమన్నదే తింటన్నారు. ఆడు సదవమన్నదే సదువుతన్నారు. ఆడు యిచ్చినంత పుచ్చుకొని చెప్పిన నౌకరీనే సేస్తన్నారు. గద్దె మీదున్నోడే గజీతగాడంతన్నారు. గజీతగాడు పురాణాల్ని తిరగ రాస్తే కంఠోపాఠం పెడతన్నారు. చట్టాల్ని రద్దు చేస్తే చప్పట్లు కొడతన్నారు. ఆడు మొక్కమన్న దేముడికే మొక్కతన్నారు.

ఆడు అలాగలాగ మనుసుల్ని మార్సీసి యిపుడు ఆడి బజారు భాషనే మాటాడమంతండు. నగరంల ఒకడే రగుడీసోడుండాల– ఆడు పోలీసోడవ్వాల అని రావిశాస్త్రి బావు రాసినాడు గానీ ఆడు పొలిటీసియనయినాడిపుడు. ఆడిని నిలిపినోడూ, గెలిపించినోడూ బజారోడు!

▪ అట్టాడ అప్పల్నాయుడు

చకచకా

వేగంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులు

- గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోనే రాజ్‌భవన్ నిర్మాణం
- గవర్నర్‌తో మంత్రి నారాయణ చర్చలు
- ఐకానిక్ భవనాల ఇంటర్నల్ డిజైన్లపైనా ప్రతిపాదనలు
- నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్లు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో సమావేశం





అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష, (ఇన్‌సెట్‌లో) నార్మన్ ఫోస్టర్స్, ఎల్ అండ్ టీ ప్రతినిధులతో కలిసి డిజైన్ల పరిశీలన

అమరావతి పునర్నిర్మాణానికి ఇలా ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారో లేదో.. అలా పనులు పురోగతిలోకి వస్తున్నాయి. తాజాగా గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోనే రాజ్‌భవన్ నిర్మించాలని నిర్ణయించడం, వాటికి సంబంధించిన డిజైన్లపై గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మంత్రి నారాయణ చర్చించడం, ఐకానిక్ భవనాలైన హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ టవర్ల ఇంటర్నల్ డిజైన్లపై నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్లు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో సమావేశం కావడంతో పనులు త్వరలోనే ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

విజయవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ (ఏజీసీ) పరిధిలోనే రాజ్‌భవన్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌భవన్ డిజైన్ ఎలా ఉండాలన్న దానిపై శనివారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ కలిసి చర్చించారు. రాజ్‌భవన్ ఎలా ఉండాలి? ఆర్కిటెక్చరల్ డిజైన్ ఎలా ఉంటే బాగుంటుంది? ఇంటీరియర్ స్ట్రక్చర్ ఎలా ఉండాలి? ఎన్ని రూములు ఏర్పాటు చేయాలి? సిబ్బంది ఎంతమంది ఉంటారు ? సమావేశాలకు, ఇతర అవసరాలకు అనుగుణంగా ఏమేం ఏర్పాటు చేయాలి? ఓపెన్ ఏరియా, గార్డెన్ వంటి సదుపాయాలకు సంబంధించి గవర్నర్ నుంచి మంత్రి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా కొన్ని సూచనలు చేసినట్టు సమాచారం.

ఐకానిక్ భవనాల ఇంటర్నల్ డిజైన్లపై చర్చ

రాజధాని అమరావతిలో తలపెడుతున్న ఐకానిక్ భవనాలైన హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ టవర్ల ఇంటర్నల్ డిజైన్లు ఎలా ఉండాలన్న దానిపై శనివారం మంత్రి నారాయణ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్‌అండ్‌టీ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఐదు ఐకానిక్ టవర్లు, హైకోర్టు, అసెంబ్లీ భవనాల్లో ఇంటర్నల్ డిజైన్లు ఎలా ఉండాలన్న దానిపైనా ఈ సమావేశం సాగింది. హైకోర్టు కాంప్లెక్స్‌లో ఎన్ని గదులు ఉండాలి? ఆర్కిటెక్చర్ ఎలా ఉండాలన్న దానిపై చర్చించారు. ఇంతకుముందే మంత్రి నారాయణ హైకోర్టు సీజేతో హైకోర్టు కాంప్లెక్స్‌కు సంబంధించి చర్చించారు. హైకోర్టు కాంప్లెక్స్‌లో 40 గదులు వస్తాయని మంత్రి నారాయణ చెప్పినపుడు, 52 గదులు కావాలని సీజే సూచించినట్టు సమాచారం. డిజైన్‌ను బట్టి అన్ని గదులు కష్టమని మంత్రి నారాయణ చెప్పగా, 48 గదులు కచ్చితంగా ఉండాలని సీజే చెప్పారని తెలుస్తోంది. సీజే వ్యక్తపరిచిన విధంగా హైకోర్టు కాంప్లెక్స్‌లో చేపట్టాల్సిన ఇంటర్నల్ డిజైన్లు రూమ్స్‌పై నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు.

టవర్‌లోకి అనుమతిపై మంతనాలు

హైకోర్టు కాంప్లెక్స్‌పై సందర్శకుల కోసం టవర్ ఏర్పాటు ఉంటుంది. ఈ టవర్‌లోకి సందర్శకులకు అనుమతి ఉంటుంది కాబట్టి.. ఎంతవరకు వారికి భద్రత ఇవ్వాలి? ఎంత ఎత్తు వరకు సందర్శకులను అనుమతించవచ్చు? టవర్ ఎక్కటానికి ఎలివేటర్స్ ఎంతమేర ఏర్పాటు చేయాలి? వంటి అంశాలను చర్చించారు. అసెంబ్లీ భవనంలో అసెంబ్లీ, మండలితో పాటు లోపల ఎన్ని రూములు ఏర్పాటు చేయాలి? సమావేశ మందిరాలు, ఆర్కిటెక్చరల్ డిజైన్లు ఎలా ఉండాలి? ఎంతమంది సిబ్బంది ఉన్నారు? ఆయా సిబ్బందికి అనుగుణంగా విభాగాలను ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై చర్చించారు. సచివాలయ టవర్లకు సంబంధించి కూడా శాఖలు, సిబ్బందికి అనుగుణంగా లోపల భాగాన్ని ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై చర్చలు సాగాయి.

ఆ సార్ ఆఫీసులో చాలా స్ట్రిక్ట్. ఆఫీసు పూర్తయ్యాక మాత్రం చాలా సిల్లీ. సరసాలు ఆడటంలో ఆయనకు సాటే లేరు. ఏకంగా పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) డివిజనల్ కార్యాలయంలోనే దుకాణం తెరిచిన ఘనుడు. రోజూ ఆఫీసు మూసివేసిన తర్వాత ఓ మహిళను వెంటబెట్టుకుని వచ్చి కార్యాలయ తాళాలు తెరిచి ఏకాంత వ్యవహారాలు వెలగబెడుతున్నాడు. సార్ కార్యకలాపాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడం, వారు విచారణకు ఆదేశించడం, సీసీ ఫుటేజీలో అడ్డంగా దొరికిపోవడంతో ఏపీటీడీసీలోని ఈ కీలక ఉద్యోగి బాగోతం మరోసారి బట్టబయలైంది.

సరసాల సార్..!

ఏపీటీడీసీలోని కీలక ఉద్యోగి రాసలీలలు

- డివిజనల్ కార్యాలయంలోనే కార్యకలాపాలు
- ఆఫీసు మూసివేశాక ఓ మహిళతో ప్రవేశం
- తాళాలు తెరిచి ఏకాంత వ్యవహారాలు
- సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదుతో వెలుగులోకి..
- సీసీ ఫుటేజీ ద్వారా బండారం బట్టబయలు
- విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు
- గతంలో హరిత బెర్మ్‌పార్కులోనూ ఇంతే..



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఏపీటీడీసీ డివిజనల్ కార్యాలయంలోని కీలక విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగి ఆయన. రోజూ రాత్రిపూట తన ద్విచక్రవాహనంపై ఓ మహిళను వెంటబెట్టుకుని కార్యాలయానికి వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. కలెక్టరేట్‌కు అభిముఖంగా, బందరురోడ్డు వెంబడి లైలా కాంప్లెక్స్ ఉంది. ఈ కాంప్లెక్స్ దిగువన ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ కార్యాలయం, కమర్షియల్ విభాగాలు ఉన్నాయి. ఈ భవనం మల్టీప్లెక్స్ కావటంతో బయట పెద్దపెద్ద గేట్లు ఉంటాయి. సెక్యూరిటీ కూడా ఉంటుంది. పర్యాటకాభివృద్ధి సంస్థ ఉద్యోగి కావటంతో సెక్యూరిటీ సిబ్బంది అభ్యంతరం చెప్పే పరిస్థితి లేదు. దీంతో ఆయన రోజూ రెచ్చిపోతున్నారు. రాత్రి సమయంలో ఓ మహిళను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వస్తుండటంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది విషయాన్ని ఏపీటీడీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అసలేం జరుగుతుందో తెలుసుకోవటానికి అధికారులు సీసీ ఫుటేజీని పరిశీలించారు. దీంతో సదరు ఉద్యోగి అడ్డంగా దొరికిపోయారు. రోజూ రాత్రి 7-8 గంటల మధ్యలో తన బైకుపై ఓ మహిళను తీసుకురావటం సీసీ కెమెరాల ద్వారా రికార్డైంది. బైక్ పార్కు చేసి ఆమెను లోపలికి తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. కార్యాలయం తాళం తెరిచి, ఆ మహిళను లోపలికి తీసుకెళ్లి తిరిగి తలుపులు వేయడం, అరగంట తర్వాత బయటకు వచ్చి బైక్‌పై వెళ్లిన ఆధారాలను సీసీ ఫుటేజీ ద్వారా సేకరించారు.

గతంలోనూ ఇంతే.. అయినా చర్యలు శూన్యం

ఈ ఉద్యోగి కామక్రీడలు ఇంతకుముందు కూడా జరిగాయి. హరిత బెర్మ్‌పార్క్‌లోని స్టాఫ్ రూమ్‌లో కూడా చాలాకాలం ఈయన కార్యకలాపాలు సాగించారు. పార్క్‌లో వాకింగ్ చేయటానికి వచ్చిన మహిళను తరచూ స్టాఫ్‌రూమ్‌లోకి తీసుకెళ్లేవాడు. సిబ్బందిని బయటకు పంపేసి రాసలీలలు సాగించేవాడు. దీంతో సిబ్బందే వలపన్ని సదరు సార్.. లీలలను బయట పెట్టారు. ఏసీ పైపుల రంధ్రానికి సీక్రెట్ కెమెరా పెట్టి మరీ ఈ విషయాన్ని సిబ్బందే వెలుగులోకి తెచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. కానీ, ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా ఏకంగా డివిజనల్ కార్యాలయంలోనే ఇలాంటి పనులు చేస్తుండటంతో అధికారులు విచారణకు ఆదేశించారు. కాగా, సదరు మహిళతో సన్నిహితంగా ఉన్న ఫొటో ఆయన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకోవడంతో ఆయన రాసలీలలను ఆయనే బయట పెట్టుకున్నట్టు అయ్యింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై విచారణ జరుగుతోంది.

కొత్త వాహనాల బ్యాటరీలు మాయం

ఎక్సెల్ ప్లాంట్‌లో కార్పొరేషన్ ఉద్యోగుల చేతివాటం

దొంగలు దొరికినా చర్యలకు మీనమేషాలు



ఉద్యోగుల నుంచి స్వాధీనం చేసుకున్న బ్యాటరీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌లో నిలుపుదల చేసిన చెత్త తరలింపు లారీల బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. సీసీ కెమెరాల ద్వారా వీటిని దొంగిలించింది కార్పొరేషన్ ఉద్యోగులేనని తెలుసుకున్నప్పటికీ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని చెత్తను ఇతర ప్రాంతాలకు తరలించటం కోసం ఓ ప్రముఖ కంపెనీకి చెందిన పది చక్రాల టిప్పర్లను కార్పొరేషన్ కొనుగోలు చేయాలని నిర్ణయించింది. నగరంలోని వందలాది మెట్రిక్ టన్నుల చెత్తను గుంటూరులోని జిందాల్ ఫ్యాక్టరీకి తరలించేందుకు వీలుగా వీటిని ఉపయోగించాలని నిర్ణయించింది. కాగా, ఒప్పందం ప్రకారం సదరు సంస్థ మిగతా 6లో..



ఎయిర్‌పోర్టును కమ్మేసిన పొగ

గన్నవరం విమానాశ్రయంలో మంటలపై దర్యాప్తు

విజయవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : రాజధాని పునః ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం రాగా, ఆయన వస్తున్న విమానం గన్నవరం విమానాశ్రయంలో ల్యాండ్ అవుతున్న సమయంలో ఎగసిపడిన మంటలపై ఎయిర్‌పోర్ట్ అధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. మోదీ విమానం ల్యాండింగ్ సమయంలో భారీ ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఈ మంటలు అజ్జంపూడి గ్రామం వైపు నుంచి రాగా, ఎయిర్‌పోర్టును భారీ పొగ కమ్మేసింది. ప్రహరీవైపు నుంచి పొగలు, అక్కడి ఖాళీ ప్రదేశంలో మంటలు చెలరేగినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్న ఎయిర్‌పోర్టు ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు.

నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేడు నగరంలో 28 కేంద్రాల్లో పరీక్ష
- మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు
- నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో అధికారులకు ప్రత్యేక శిక్షణ

సజావుగా గ్రూప్1 పరీక్ష

- తొలిరోజు 1,801 మంది అభ్యర్థులకు 1,161 మంది హాజరు
- ఈ నెల 9 వరకు నిర్వహణ

6లో

ఇంటి దొంగలు..!

గృహనిర్మాణ శాఖలో అవినీతి ఉద్యోగులపై వేటు

రూ.39 లక్షల విలువైన సిమెంట్, ఇనుము మాయం

- అవనిగడ్డలోని ఇద్దరు ఏఈల శాశ్వత తొలగింపు
- క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని నిర్ణయం
- అవనిగడ్డ డీఈపై శాఖాపరమైన విచారణకు ఆదేశాలు
- చల్లపల్లి, ఘంటసాల మండలాల గోడౌన్ ఇన్‌చార్జి సస్పెన్షన్
- విధులకు దూరంగా మోపిదేవి మండల ఏఈ
- అక్రమాలు రుజువైన ఏడాదికి కలెక్టర్ చర్యలు



సిమెంట్, ఇసుక, ఇనుమును పప్పుబెల్లాల్లా పంచుకున్నారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందించిన మెటీరియల్‌ను ఇష్టానుసారంగా దారి మళ్లించారు. జిల్లాలోని గృహనిర్మాణ శాఖలోని కొందరు ఏఈలు, డీఈలు సాగించిన ఈ అవినీతి బాగోతాలపై వెల్లువలా ఫిర్యాదులు అందడం, నిజాలు నిర్ధారణ కావడంతో అవనిగడ్డ నియోజకవర్గంలో గతంలో పనిచేసిన హౌసింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటూ కలెక్టర్ బాలాజీ ఉత్తర్వులు జారీచేశారు. చల్లపల్లి మండలం గృహనిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ఏఈగా పనిచేసిన అరుణకుమారి, వినయ్‌చంద్రను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించడంతో పాటు క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని ఉత్తర్వులు జారీచేశారు. అవనిగడ్డ నియోజకవర్గ డీఈగా పనిచేసిన బానోజీరావుపై శాఖాపరమైన విచారణతో పాటు ముదినేపల్లి మండల ఏఈ వై.శేషగిరిరావును సైతం సస్పెండ్ చేశారు. ఈ మొత్తం అవినీతి వ్యవహారంలో రూ.39 లక్షల మేర దారి మళ్లిందని నిర్ధారణైంది.

మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : అవనిగడ్డ నియోజకవర్గంలోని అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో గృహనిర్మాణ శాఖలో పనిచేసిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)లు తమ చిత్తానుసారం వ్యవహరించారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించకుండానే ముందస్తుగా లబ్ధిదారులకు సిమెంట్, ఇనుము, ఇసుక వంటి మెటీరియల్ ఇచ్చినట్టుగా రికార్డుల్లో రాసి, వాటిని పక్కదారి పట్టించి విక్రయించేశారు. ఈ నాలుగు మండలాల్లో గృహనిర్మాణ శాఖలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసిన ఏఈలు తమదైనశైలిలో అక్రమాలకు పాల్పడటంతో ఉన్నతాధికారులకు విడతలవారీగా గతంలోనే ఫిర్యాదులు అందాయి. గృహనిర్మాణ శాఖ, విజిలెన్స్ అధికారులు విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ నివేదిక బయటకు మిగతా 6లో..

మోపిదేవి మండల ఏఈ దుమ్మా

మోపిదేవి మండలంలో తాండవ కృష్ణ అనే ఏఈ పనిచేశారు. గతంలో ఈ ఏఈ అవనిగడ్డ మండలం గృహనిర్మాణ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మోపిదేవి మండలం ఏఈగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. మోపిదేవి, కోసూరివారిపాలెం గ్రామాల్లో గిరిజనుల ఇళ్లను ఈ ఏఈనే కాంట్రాక్టు తీసుకుని నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇళ్లు సరిగ్గా నిర్మించకపోవడంతో పాటు రెండువేల టన్నుల ఇసుకను మాయం చేసిన కృష్ణను మచిలీపట్నంలోని జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు. తనపై చర్యలు తప్పవని నిర్ధారణకు వచ్చిన ఈయన చాలాకాలంగా విధులకు హాజరుకావట్లేదు.

విచారణ ఎప్పటికో..!

జలవనరుల శాఖలో ఏఈపై అంతర్గత విచారణ

- ఆర్సీ డివిజన్‌లో అక్రమాలపై ఫిర్యాదులు
- రెండు నెలలుగా ముందుకు సాగని విచారణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జలవనరుల శాఖలో ఆయనో ఇంజనీర్. అవనిగడ్డ నియోజకవర్గమే ఆయన కేంద్రం. ఉద్యోగంలో చేరింది మొదలు ఇప్పటి వరకు సర్వీసులో ఎక్కువకాలం ఆ నియోజకవర్గంలో ఉన్న సబ్ డివిజన్లలో విధులు నిర్వర్తించారు. దీంతో ఆయన సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు. ఇంకేముంది వరుస అక్రమాలు మొదలయ్యాయి. నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఏ పార్టీ వ్యక్తి ఉన్నా సదరు ఇంజనీర్‌నే కోరుకుంటారు. ప్రస్తుతం ఈ అసిస్టెంట్ ఇంజనీర్ అక్రమాల చిట్టా ఉన్నతాధికారులకు చేరడంతో అంతర్గత విచారణకు ఆదేశించారు. అయితే, విచారణ ముందుకు సాగకపోవడం ఇప్పుడు జలవనరుల శాఖలో చర్చనీయాంశంగా మారింది. మూడు నెలలుగా విచారణ ఇంకా సాగుతూనే ఉంది. ఆ ఏఈపై సమగ్రంగా దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని ఫిబ్రవరిలో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాల ప్రకారం అడుగులు వేయడానికి జిల్లా జలవనరుల శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

కట్టలపై అనధికార తూములు

కాల్వలపై కట్టలు బలహీనపడుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. భారీగా వర్షాలు కురిసినప్పుడు కట్టల పరిస్థితి దారుణంగా ఉంటోందని ఇప్పటికే పలువురు రైతులు అధికారుల వద్ద మొరపెట్టుకుంటున్నారు. ఈ ఏఈ పనిచేసిన ప్రతి సెక్షన్‌లోనూ కరకట్టలపై అనధికారికంగా తూములు ఏర్పాటు చేయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ అధికారి విషయంలో అధికార, ప్రతిపక్ష నేతలు ఒకేమాట మీద ఉంటారంటే ఆయన పరపతి ఏమిటో అర్థమవుతుంది.

ఉన్నతాధికారులకు తెలియకుండా చెక్ పవర్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. కొత్త పాలకవర్గాలు ఏర్పడ్డాయి. అప్పటి వరకు ఆయా సబ్ డివిజన్లలో నీటి సంఘాలకు వచ్చే నిధులు, రైతులు చెల్లించే పన్నులను జమచేసే బ్యాంకు ఖాతాలకు సంబంధించిన పుస్తకాలు సంబంధిత ఇంజనీర్ల ఆధీనంలో ఉండేవి. వాటికి కాంపిటెంట్ అథారిటీగా జలవనరుల శాఖ ఎస్ఈ ఉండేవారు. ప్రాజెక్టు కమిటీలు ఎన్నికైన తర్వాత మినిట్స్ బుక్, బ్యాంక్ ఖాతాల పాస్‌బుక్‌లు, నగదు.. పాలకవర్గ చైర్మన్, వైస్ చైర్మన్ వద్ద ఉండాలి. అప్పటి వరకు అధికారులు నిర్వహించిన ఈ వ్యవహారాలను ఇక నుంచి చైర్మన్, వైస్ చైర్మన్ నిర్వహిస్తారని సంబంధిత బ్యాంక్‌కు అధికారికంగా లేఖ ఇవ్వాలి. బ్యాంక్ ఖాతాలు చైర్మన్, మిగతా 6లో..

6 నుంచి దుర్గగుడి ఘాట్‌రోడ్డు మూత

ఇంద్రకీలాద్రి, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొండ ప్రాంతానికి మెస్ వేసి రక్షణ చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఘాట్‌రోడ్డుపై రాకపోకలను నిషేధిస్తున్నట్లు దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రూట్‌లో వచ్చే భక్తులు పున్నమిఘాట్ వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, అక్కడి నుంచి దేవస్థానం ఏర్పాటుచేసిన బస్సుల్లో కొండపైకి చేరుకోవాలని సూచించారు. చెన్నై, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వీఎంసీ కార్యాలయం సమీపంలోని సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న హోల్డింగ్ ఏరియాలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని, అక్కడి నుంచి దేవస్థాన బస్సుల్లో ఆలయానికి చేరుకోవాలని పేర్కొన్నారు. కనకదుర్గానగర్‌వైపు ఉన్న మార్గం ద్వారానే భక్తులు కొండపైకి చేరుకోవాలని, మూడు రోజుల పాటు పార్కింగ్ ప్రదేశాల నుంచి భక్తులకు ఉచిత రవాణా సదుపాయం ఉంటుందని ఆయన వివరించారు.

వల్లభనేని వంశీకి అనారోగ్యం

- ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు

విజయవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జిల్లాజైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శనివారం అనారోగ్యానికి గురయ్యారు. దీంతో జైలు అధికారులు ఆయన్ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన కాళ్లకు వాపులు రావడం, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని ఆర్ఎంవో చాంబర్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు వైద్యులు ఎకో 2డీ, ఈసీజీ, బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేశారు. సుమారు రెండు గంటలపాటు ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆయనకు వెన్నెముక నొప్పి ఉంది. బీపీ, షుగర్‌కు సంబంధించి వైద్యులు రాసిచ్చిన మందులు కాకుండా వేరే మందులు వాడటంతో కాళ్లకు వాపులు వచ్చినట్టుగా వైద్యులు అనుమానిస్తున్నారు.

ఆసుపత్రి నుంచి రంగా డిశ్చార్జి

జైలు నుంచి వల్లభనేని వంశీ ఆసుపత్రికి రావడానికి ముందు ఆయన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగా డిశ్చార్జి అయ్యారు. షుగర్ తగ్గిపోవడంతో రెండు రోజుల క్రితం రంగా అనారోగ్యం బారిన పడ్డారు. ఆయన్ను జైలు అధికారులు ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో వైద్యులు అడ్మిషన్ ఇచ్చారు. తిరిగి శనివారం డిశ్చార్జి చేయడంతో జిల్లా జైలుకు తరలించారు.

15 నుంచి బీచ్ ఫెస్టివల్

- వినూత్నంగా నిర్వహిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

6లో

15 నుంచి బీచ్ ఫెస్టివల్

● వినూత్నంగా నిర్వహిస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌లో ఈనెల 15వ తేదీ నుంచి 17వ తేదీ నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌ను వి నూత్న రీతిలో నిర్వహిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో అధికారులతో బీచ్ ఫెస్టివల్‌పై ఆ యన చర్చించారు. ఫుడ్‌కోర్టులు, పార్కింగ్ ఏర్పాటు, జలక్రీడలు, వినోద క్రీడలు, బీచ్ కబడ్డీ, బోట్ రేస్ తదితర అంశాలపై కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, మెప్మా పీడీ సాయిబాబు, వివిధ శాఖల అధికారులతో ఆయన చర్చించారు. 2018లో నిర్వహించిన బీచ్ ఫెస్టివల్‌లో లక్షలాది మంది పాల్గొన్నారని తెలిపారు. యువతకు మధురమైన అనుభూతులు మిగిల్చేలా బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో పాల్గొనేందు కు వచ్చిన క్రీడాకారులు, కళాకారులకు భోజన, వసతి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంగినపూడిబీచ్‌కు కబడ్డీ ఆడేందుకు జాతీ య క్రీడాకారులు వస్తున్నారని, వీరందరికీ వసతి సదుపాయాలు కల్పించడంపై హోటల్ యజమానులతో మాట్లాడామన్నారు. లక్షలాది పర్యాటకులు వస్తున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూస్తామన్నా రు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు.

'పునఃప్రారంభం' సభతో

నవ్యాంధ్ర నవశకానికి నాంది

● టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, మే 3(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీ ఇచ్చిన హామీలతో అమరావతి రాజధాని పునఃప్రారంభం సభ ఐదు కోట్ల ఆంధ్రుల ఆశలకు ఊపిరులు ఊదింది. నవ్యాంధ్రలో నవశకానికి నాంది పలికింది.' అని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. శనివారం అమరావతి సభ విజయవంతంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. సభలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం రాష్ట్ర ప్రజలకు ఎం తో ఉత్సాహాన్నిచ్చిందని, భవిష్యత్‌పై ఎన్నో అంచనాలు కల్పించిందని ఆయన తెలిపారు. ఐదేళ్లలో నిర్వీర్యమైన రాజధానికి పదే పది నెలల్లో రూపురేఖలు తెచ్చి, ప్రధాని మోదీతో పునఃశంకుస్థాపన, రూ.60 వేల కోట్లతో పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయించటం, భవిష్యత్‌లోను ఇదే మద్దతు కొనసాగిస్తామని హామీ పొందటం చంద్రబాబు విజన్‌కు నిదర్శనమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు స్పష్టంగా ప్రజలు ఏమి కోరుకుంటున్నారో చెప్పి ప్రధాని మోదీని ఆ దిశగా హామీ ఇప్పించగలిగారని తెలిపారు.

7 నుంచి వేదాద్రిలో బ్రహ్మోత్సవాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట, మే 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 7 నుంచి వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య శనివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో కె.కిశోర్ మాట్లాడారు. 7న స్వామిని పెండ్లి కుమారుడిని చేయడం, 8న అంకురార్పణ, ధ్వజారోహణ, 9న శేష వాహనసేవ, 10న హనుమంతుసేవ, 11న భూనీలా సమేత యోగా నంద లక్ష్మీ నరసింహస్వామి తిరుక్కల్యాణ మహోత్సవం జరుగుతుందని, 12న తెప్పోత్సవం, గజవాహనసేవ, 13న చూర్ణోత్సవం, వసంతోత్సవం, 14న పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తుందని తెలిపారు. ఈవోతోపా టు వంశపారంపర్య ధర్మకర్తల తరఫున కేసీపీ సిమెంట్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఉదయభాను, నెట్టెంకు ఆహ్వానపత్రికలు

వేదాద్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినే ని ఉదయభానుకు ఈవో కె.సురేష్, కేసీపీ అసిస్టెంట్ మేనేజర్ రాంప్రసాద్ ఆహ్వానపత్రికలు అందించారు.

బ్రహ్మోత్సవాల విజయవంతానికి

సమన్వయంతో పని చేయండి

● అధికారులకు నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచన

జగ్గయ్యపేట రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): వేదాద్రి గ్రామంలో ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించే యోగానంద లక్ష్మీ నరసింహస్వామి తిరుక్కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. 11న స్వామి కల్యాణం జరుగుతుందని, తిలకించేందుకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కృష్ణానదిలో స్నానాలకు, బం దోబస్తు, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణకు ఏర్పాట్లు చేయాలన్నా రు. విద్యుత్, ఫైర్, తదితర శాఖల అధికారులు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చూడాలని ఆదేశించారు. ఆలయ ఈవో సురేష్‌బాబు, తహసీల్దార్ మనోహర్, ఆర్టీసీ, ఫైర్, పోలీస్, విద్యుత్, పంచాయతీ, ఫిషరీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు

దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, మే 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 24వ తేదీలోపు తమ దరఖాస్తులను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. 8వతరగతి, పదో తరగతి ఉత్తీర్ణులయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94906 39639కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజాభేరి

గవర్నర్‌పేట, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజాభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ తెలిపారు. శనివారం శ్రీశ్రీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ప్రజల నుంచి రెండు లక్షల సంతకాలను సేకరించామని తెలిపారు. ఈనెల 7వ తేదీన విద్యుత్ సౌధ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాలు మో పిందని, కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేయకుండా అదనంగా భారాలు వేస్తోందని ఆరోపించారు. విద్యుత్ అక్రమ ఒప్పందాలు రద్దు చేసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.



నిర్వహణ కొరవడడంతో కళ తప్పిన ఇబ్రహీంపట్నం రింగ్

కళావిహీనంగా..

ఇబ్రహీంపట్నం రింగ్

● వెలిసిపోయిన కొండపల్లి బొమ్మలు
● చనిపోయిన పూల మొక్కలు



రంగు వెలిసి వెలవెలబోతున్న కొండపల్లి బొమ్మ

ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిలో ఉన్న ఇబ్రహీంపట్నం రింగ్ తెలియని వారుండరు. 2014-19 వరకు ఈ రింగ్ పచ్చని చెట్లతో నిత్యం కళకళలాడుతూ అందరికీ ఆహ్లాదాన్ని పంచేది. 2019-24 మధ్య కాలంలో రింగ్ నిరాదరణకు గురైంది. రింగ్‌లో ఉన్న పచ్చని గడ్డి మాడిపోయింది. జిల్లేడు చెట్లు మొలిచాయి. మొక్కలకు నీళ్లు పోసే నాథుడు లేక, కొండపల్లి బొమ్మలకు రంగులేసిన వారు లేక కళాహీనంగా మారింది. రాష్ట్ర రాజధాని అమరావతికి ముఖద్వారంగా ఇబ్రహీంపట్నం రింగ్ కూడా ఉండే అవకాశం ఉంది. ఒకప్పుడు పవిత్రసంగమం వద్ద హైకానిక్ బ్రిడ్జ్ నిర్మాణం చేపడతారని రింగ్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తారని అనుకున్నారు. అయితే అటు తర్వాత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అంతా తారుమారై రింగ్‌కు ఈ దుస్థితి వచ్చింది. ప్రస్తుతం పలు పార్టీల రాజకీయ నాయకులకు స్వాగతం పలికేందుకు, రాజకీయ, సినీ నటుల జన్మదినాలకు ఫ్లెక్సీలు కట్టుకునేందుకే ఈరింగ్ ఉపయోగపడుతోంది. రింగ్ బాగోగులు ఎవ్వరికీ పట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా మరలా రింగ్‌కు పూర్వ వైభవం తెచ్చి సుందరంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

బుల్లెట్‌ను ఢీకొన్న లారీ.. యువకుడి దుర్మరణం

● మరొక యువకుడికి తీవ్రగాయాలు



దేవరకొండ సాయి (ఫైల్)

జగ్గయ్యపేట, మే 3(ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట- చిల్లకల్లు రోడ్డులో బుల్లెట్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు దుర్మరణం చెందగా, మరొక యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. జగ్గయ్యపేట ఎస్సై-2 వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గయ్యపేట చెరువు బజార్‌కు చెందిన దేవరకొండ సాయి (22) నందిగామలో ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తన స్నేహితుడు తమ్మిశెట్టి వాసు(21) తో కలిసి బుల్లెట్‌పై జగ్గయ్యపేటకు బయలుదేరాడు. చిల్లకల్లు దాటాక శుభమస్తు ఫంక్షన్‌హాలు, బేతెస్థ గార్డెన్స్ సమీపంలో లారీ యూటర్న్ తిరుగుతూ బుల్లెట్‌ను ఢీకొట్టింది. బుల్లెట్‌పై ఉన్న సాయి తలకు, దేహానికి తీవ్రగాయాలు కావటం, రోడ్డు దెబ్బ తగలడంతో అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి మృతి చెందాడు. వాసు కాలికి తీవ్ర గాయమైంది. ఆ సమయంలో జగ్గయ్యపేట రౌండ్స్‌కు వస్తున్న పెనుగంచిప్రోలు ఎస్సై అర్జున్ జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. శనివారం ప్రభుత్వాస్పత్రిలో సాయి భౌతికకాయానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతుడు సాయి తండ్రి నాగేశ్వరరావు ప్రముఖ ఆర్ఎంపీ వైద్యుడు. తలలో నాలుకలో ఉండే నాగేశ్వరరావు కుమారుడు చనిపోవటంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాయి భౌతికకాయానికి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, యువనేత శ్రీరాం చినబాబు నివాళులర్పించారు. నాగేశ్వరరావును పరామర్శించి వారు ధైర్యం చెప్పారు.

నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

● నేడు విజయవాడలో 28 కేంద్రాల్లో పరీక్ష
● మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహణ
● కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో అధికారులకు ప్రత్యేక శిక్షణ

విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): నీట్-2025 పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 13,625 మంది పరీక్ష రాయబోతున్నారు. నీట్ పరీక్ష కోసం ప్రభుత్వం నగరంలో 28 కేంద్రాలు ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. అనుమతులున్న పీడబ్ల్యూడీ అభ్యర్థులకు మాత్రం సాయంత్రం ఆరు గంటల వరకు అవకాశమిచ్చారు. పరీక్ష నిర్వహించబోయే అధికారులకు శనివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఏర్పాట్లు, కంట్రోల్ రూమ్ విధులు, బయోమెట్రిక్ హాజరు, వీడియోగ్రఫీ, సీల్డ్ కవర్స్ నివేదికలు, కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ నిర్వహణపై కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా పరీక్ష నిర్వహించాలని శిక్షణకు హాజరైన అధికారులకు కలెక్టర్ సూచించారు. శిక్షణ అధికారులు ఆదిశేషుశర్మ, వెంకటేశ్వరరావు, ఆర్డీవో కె.చైతన్య పాల్గొన్నారు.



బిషప్ అజరయ్య బాలికల జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సజావుగా గ్రూప్-1 పరీక్ష

● తొలిరోజు 1,801 మంది అభ్యర్థులకు 1,161 మంది హాజరు.. ఈ నెల 9 వరకు పరీక్షలు

విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రూప్- 1 పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. అన్ని కేంద్రాల్లో పరీక్ష సజావుగా జరిగింది. ఈ నెల తొమ్మిదో తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. ఎండతీవ్రత, పరీక్షా కేంద్రానికి నిమిషం ఆలస్యమయినా అనుమతించరనే నిబంధనలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. నగరంలో గ్రూప్ -1 పరీక్షకు ఆరు కేంద్రాలను కేటాయించారు. జిల్లాలో మొత్తం 1,801 మంది దరఖాస్తు చేసుకోగా 1,161 మంది(64.46 శాతం) హాజరయ్యారు. ట్యాబ్‌లతో పాటు డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్ష నిర్వహించారు. బిషప్ అజరయ్య బాలికల జూనియర్ కాలేజీ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. లైజనింగ్ అధికారులు, అసిస్టెంట్ లైజనింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

హిందూ ధర్మాన్ని విశ్వవ్యాపితం చేయడమే వీహెచ్‌పీ లక్ష్యం

● వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్

హనుమాన్‌జంక్షన్, మే 3 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని విశ్వవ్యాపితం చేయడంతో పాటు హిందూ దేవాలయాలను పరిరక్షించడమే విశ్వ హిందు పరిషత్ ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అన్నారు. శనివారం విశ్వహిందు పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ హనుమాన్‌జంక్షన్‌లోని తన ఫామ్‌హౌస్‌లో ఆశాజ్యోతి ఆశ్రమ పాఠశాల దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఉపకరణాలు, దుస్తులను పంపిణీ చేశారు. అలోక్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలోక్‌కుమార్ మాట్లాడారు. హిందు మతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. వంద దేశాల్లో మత ధర్మాన్ని వ్యాప్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగానే కుల మతాలకు అతీతంగా విశ్వ హిందు పరిషత్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తోందన్నారు. హిందూ మత ధర్మాన్ని మరింత విస్తృతం చేయడానికి అయోధ్యలో రామమందిర్ నిర్మాణం దోహదపడుతుందన్నారు. రామమందిరం నిర్మాణం విశ్వహిందు పరిషత్ సాధించిన గొప్ప విజయమన్నారు. భారతదేశం ఒక హిందు దేశం, ఒక కులానికి మతానికి చెందినది కాదన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడులు పూర్తిగా మత పరమైనవన్నారు. విశ్వహిందు పరిషత్ తెలంగాణా, ఆంధ్రరాష్ట్రాల అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ విశ్వహిందు పరిషత్ ఒక ధార్మిక సామాజిక సంస్థ, ధర్మం కోసం హైందవ శంఖారావం నిర్వహించిందన్నారు. సమాజం కోసం లక్ష ఏకోపాధ్యాయ పాఠశాలలు, అనాధ శరణాలయాలు, హాస్టల్స్, గోశాలలు నిర్వహిస్తోందన్నారు. దేవాలయాలను అభివృద్ధి చేయడంతో పాటు అర్చకులకు ప్రత్యేక శిక్షణాలయాలను నిర్వహిస్తుందన్నారు. సమాజాన్ని సమరసత మార్గంలో నడిపించడానికి పరిషత్ కృతనిశ్చయంతో పని చేస్తోందన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి దుర్గాప్రసాద్, నాయకులు శ్రీనివాసరాజు ఉన్నారు.

బెజవాడలో హోటల్‌పై మెరుపు దాడులు

వ్యభిచారం చేస్తుండగా పట్టుకున్న పోలీసులు

నలుగురు యువతులు, ఇద్దరు యువకులు అరెస్టు

గుణదల, మే 3 (ఆంధ్రజ్యోతి) : బందరురోడ్డులోని పీవీపీ మాల్ సమీపంలో ఉన్న ఓ హోటల్‌పై మాచవరం పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందస్తు సమాచారం మేరకు మాచవరం సీఐ ప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం హోటల్‌కు చేరుకుని పరిశీలించగా, రూమ్‌లో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన నలుగురు యువతులు ఉండటాన్ని గుర్తించారు. వారితో ఉన్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరు వ్యభిచారం చేస్తున్నట్లుగా ఆధారాలు లభ్యం కావడంతో అరెస్టు చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన పల్లెపోగు కుమార్ రాజా పీవీపీ మాల్ రోడ్డులో ఓ హోటల్లో రెండు రూమ్‌లు అద్దెకు తీసుకుని ఈ వ్యభిచారం చేయిస్తున్నట్టుగా గుర్తించారు. కుమార్ రాజా ఫోన్ల ద్వారా విటులను సంప్రదించి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన యువతులతో హోటల్లోనే వ్యవహారాలు నడుపుతున్నట్టు గుర్తించామని సీఐ తెలిపారు. ఇప్పటి వరకు స్పా సెంటర్లపైనే దృష్టి పెట్టామని, ఇక హోటళ్లపై కూడా దృష్టిపెడతామని, ఈ తరహా కార్యకలాపాలు జరిగితే సహించేది లేదన్నారు. హోటళ్లలో ఎవరైనా ఇలా పట్టుబడితే సదరు వ్యక్తులపైనే కాకుండా హోటల్ నిర్వాహకులపై కూడా కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

అమరావతిలో తప్పిపోయిన రామగిరివాసి

రామగిరి, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం దుబ్బార్లపల్లి గ్రామానికి చెందిన దేవజ్జి గజ్జిలప్ప అమరావతిలో తప్పిపోయాడు. రాజధాని పనుల పునఃప్రారంభ వేడుకలకు స్థానికులతో కలిసి పేరూరు నుంచి బస్సులో వెళ్లిన ఆయన.. అక్కడ జనంలో కనబడకుండాపోయారు. గాలించినా కనిపించకపోవడంతో మిగిలిన వారు బస్సులో తిరిగి వచ్చేశారు. ఇప్పటి వరకూ ఆచూకీ తెలియలేదని గ్రామస్థులు తెలిపారు. అతని గురించి సమాచారం తెలిస్తే టీడీపీ రామగిరి మండల కన్వీనర్ సుధాకర్ సెల్ నంబర్ 8374594679, దేవజ్జి వెంకటేశ్ సెల్ నంబర్‌కు 9440260494 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని గ్రామస్థులు కోరారు.

ఇంటి దొంగలు..!

(5వ పేజీ తరువాయి)

రాకుండా, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకుండా తెరవెనుక పెద్దలు వ్యవహారం నడుపుతూ వచ్చారు. అవినీతి ఆరోపణలు, విచారణ జరిగాక అదే మండలంలో పనిచేస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే కారణంతో ఏఈలు వ్యూహాత్మకంగా గృహనిర్మాణ సంస్థ జిల్లా కార్యాలయంలో పనిచేసేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అధికారుల విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైనా సుదీర్ఘకాలంగా జీతాలు పొందుతూ వస్తున్నారు.

అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ అక్రమాలు

అవనిగడ్డ, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో గృహనిర్మాణ శాఖలో పనిచేసే ఉద్యోగులంతా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసినవారే. పామర్రు నియోజకవర్గం మొవ్వ మండలంలో పనిచేసే అరుణకుమారి అనే వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను వైసీపీ ప్రభుత్వ హయాంలో చల్లపల్లి మండల గృహనిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ఏఈగా నియమించారు. గతంలో చల్లపల్లి మండలం ఇన్‌చార్జులుగా అరుణకుమారి, వినయ్‌చంద్ర పనిచేసిన కాలంలో పేదల ఇళ్ల నిర్మాణాలకు సిమెంట్, ఇనుము ఇవ్వకుండానే ఇచ్చినట్టుగా రికార్డుల్లో నమోదు చేశారు. వందలాది బస్తాల సిమెంట్, ఏడు టన్నులకుపైగా ఇనుమును మాయం చేశారనే అంశంపై ఫిర్యాదులు అందాయి. ఆ ఇద్దరు ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణచేసి నివేదిక సిద్ధం చేశారు. ఈ విచారణ అనంతరం అరుణకుమారిపై చర్యలు తీసుకోకుండా మచిలీపట్నంలోని జిల్లా గృహనిర్మాణ శాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. వినయ్‌చంద్‌ను కోడూరు మండలానికి బదిలీ చేశారు. మచిలీపట్నంలోని జిల్లా గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో పనిచేసే ఒక డీఈ వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇంతకాలంగా తెరవెనుక చక్రం తిప్పారనే విమర్శలు ఉన్నాయి. కానీ, అరుణకుమారి, వినయ్‌చంద్రను శాశ్వతంగా విధుల నుంచి తొలగించడంతో పాటు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. గతంలో చల్లపల్లి, ఘంటసాల మండలాల సిమెంట్ గోడౌన్ ఇన్‌చార్జిగా పనిచేసిన ఏఈ వై.శేషగిరిరావును మాత్రం సస్పెండ్ చేశారు.

డీఈ కనుసన్నల్లోనే అక్రమాలు

అవనిగడ్డ గృహనిర్మాణ సంస్థ డివిజనల్ ఇన్‌చార్జి (డీఈ)గా పనిచేసిన బానోజీరావు తనదైనశైలిలో వ్యవహరించి అక్రమాలకు తెరతీశాడనే ఆరోపణలున్నాయి. చల్లపల్లి, ఘంటసాల మండలాల ఇన్‌చార్జుల లాగిన్‌లో నుంచి సిమెంట్, ఇనుమును పక్కదారి పట్టించారని డీఈపై పలు ఫిర్యాదులు అందాయి. దీనిపైనా అధికారులు విచారణ చేశారు. సిమెంట్, ఇనుము మాయం చేశారని రుజువైంది. దీంతో డీఈపైనా చర్యలు తీసుకోవాలని విచారణ అధికారులు సిఫారసు చేశారు. దీంతో ఆయనపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఘంటసాల మండలంలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు సిమెంట్, ఇనుము ఇచ్చేందుకు గోడౌన్ ఉంది. చల్లపల్లి ఏఈగా పనిచేసిన వై.శేషగిరిరావు గతంలో ఈ గోడౌన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయన్ను ముదినేపల్లి ఏఈగా బదిలీ చేశారు. బదిలీ అయిన శేషగిరిరావు ఘంటసాల గోడౌన్‌కు సంబంధించిన రికార్డులను అప్పగించలేదు. ఆ తరువాత ఘంటసాల ఏఈగా సురేంద్రను నియమించారు. డీఈ బానోజీరావు, ఏఈ సురేంద్ర తమ చిత్తానుసారంగా వేలాది బస్తాల సిమెంటును మాయం చేశారనే ఆరోపణలపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. సిమెంట్ మాయంలో డీఈ పాత్ర అధికంగా ఉన్నట్టుగా విచారణలో వెల్లడైంది. ఘంటసాల ఏఈ సురేంద్ర ఒక వ్యాన్ కొనుగోలు చేసి, ఆ వ్యాన్ డ్రైవర్ ద్వారా లబ్ధిదారులు ఇనుము, సిమెంట్ పంపిణీ పేరుతో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. నియోజవర్గంలో రెండువేల టన్నులకుపైగా ఇసుకను లబ్ధిదారులకు ఇవ్వకుండా ఇచ్చినట్టుగా చూపిన అంశంపైనా అధికారులకు పలు ఫిర్యాదులు అందాయి.

పెదపారుపూడి మండలంలో పక్కా అవినీతి

పామర్రు నియోజకవర్గంలోని పెదపారుపూడి మండలంలో సిమెంట్, ఇనుము పెద్దమొత్తంలో మాయమైంది. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు విచారణ చేస్తున్నారు. ఇటీవల పెదపారుపూడి మండలం గృహనిర్మాణ సంస్థలో పనిచేసే సిబ్బందిని జిల్లా గృహనిర్మాణ సంస్థ కార్యాలయానికి పిలిపించారు. రికార్డులను తనిఖీ చేశారు. గతంలో పనిచేసిన డీఈ సిమెంట్, ఇనుము లబ్ధిదారులకు ఇవ్వకుండానే పామర్రులోనే గుంపగుత్తగా విక్రయించేశారని సిబ్బంది చెప్పినట్లు సమాచారం. గతంలో పామర్రులో పనిచేసిన డీఈ ప్రస్తుతం జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్నారు. పెడన నియోజకవర్గంలో ఒక మండలంలో నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగం చేస్తున్న ఒక ఏఈపైనా విచారణ చేయాలని ఇప్పటికే ఫిర్యాదులు అందాయి. అధికారులు ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

కొత్త వాహనాల బ్యాటరీలు మాయం

(5వ పేజీ తరువాయి)

మొత్తం 5 టిప్పర్లను రెండు వారాల కిందట డెలివరీ ఇచ్చింది. వీటిని సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్‌లో ఉంచారు. సాంకేతిక కారణాల వల్ల కార్పొరేషన్ వాటిని ఇంకా స్వాధీనంలోకి తీసుకోలేదు. ఈలోపే ఆ వాహనాల్లోని బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. తొలుత ఒక బ్యాటరీ వైర్లు కత్తిరించి దొంగతనం చేశారు. విషయం అధికారులకు తెలిసి.. ఎవరు దొంగతనం చేసి ఉంటారన్న దానిపై విచారణ జరుగుతుండగానే, రెండో లారీ బ్యాటరీ కూడా పోయింది. ఆ వెంటనే మరో రెండు లారీల బ్యాటరీలు కూడా మాయమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుంది. దీంతో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఎక్సెల్ ప్లాంట్‌లో బిగించిన 35 సీసీ కెమెరాలను పరిశీలించగా, దొంగలెవరన్నది తేలింది. పార్క్ సెక్షన్‌కు చెందిన ఉద్యోగులుగా గుర్తించారు. వారి నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఆయన ఈ విషయాన్ని స్థానిక ఈఈ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఘటన జరిగి వారం అవుతున్నా ఇప్పటి వరకు ఉన్నతాధికారులకు కనీసం నోట్ ఫైల్ కూడా పంపకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

విచారణ ఎప్పటికో..!

(5వ పేజీ తరువాయి)

వైస్ చైర్మన్ సంయుక్తంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఇద్దరి స్పెసిమన్ సిగ్నేచర్లను ధ్రువీకరించి బ్యాంక్‌కు లేఖ రాయాలి. కానీ, సదరు ఏఈ మాత్రం తూర్పు డెల్టా కమిటీ ప్రాజెక్టు చైర్మన్ ఒక్కరి సంతకాన్నే స్పెసిమన్ సిగ్నేచర్‌గా గుర్తిస్తూ ఎస్ఈకి తెలియకుండా బ్యాంక్ అధికారులకు లేఖ రాశారు. బ్యాంక్ అధికారులు దీన్ని పునఃపరిశీలించడంతో జలవనరుల శాఖ అధికారులకు అసలు విషయం తెలిసింది. దీంతో సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉన్నతాధికారులకు తెలియకుండా, కాంపెటెటివ్ అథారిటీ కాకపోయినా స్పెసిమన్ సిగ్నేచర్లను ఎలా ధ్రువీకరించి బ్యాంక్‌కు పంపారో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

ఉయ్యూరులో హనుమాన్ శోభాయాత్ర 22న

ఉయ్యూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి పురస్కరించుకుని ఈ నెల 22న ఉయ్యూరులో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహిస్తున్నట్టునిర్వాహకులు తెలిపారు. శ్రీహనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో పెద్దయెత్తున నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించి ఆలయ కమిటీలు, పురప్రముఖులకు అందజేశారు. జై శ్రీరామ్, జై హనుమాన్‌స్మరణతో భక్తి చైతన్య పూర్వక శ్రీహనుమాన్ శోభా యాత్ర కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీహనుమాన్ భక్తబృందం

నిరుపయోగంగా..!

- పట్టించుకునే వారు లేక శిథిలావస్థకు చేరిన తువ్వాళ్ల నేత కేంద్ర భవనం
- కమ్యూనిటీహాల్‌గా మార్చాలంటున్న ఆనందపురం వాసులు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

గండిగుంట ఆనందపురం ఎస్సీ కాలనీలో తువ్వాళ్ల నేత కేంద్రం ఏళ్లతరబడి ఉపయోగంలో లేక వృథాగా ఉంటూ శిథి లావస్థకు చేరుకుంటుంది. ఆనందపురం పరిసర ప్రాంతాల్లో చేనేత నేర్చుకున్న వారికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో షెడ్యూల్ కులాల ఆర్థిక సహకార సంస్థ సహాయంతో 1988 సంవత్సరంలో తువ్వాళ్ల నేత కేంద్రాన్ని 20 మగ్గాలతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రారంభించారు. అప్పటి నుంచి కొన్నేళ్లపాటు నడిచిన కేంద్రం తరువాత పలు కారాణాల వల్ల మూతపడగా అప్పటి నుంచి భవనం నిరుపయోగంగా ఉండగా మగ్గాలు పనికిరాకుండా పోతు న్నాయి.



గండిగుంట ఆనందపురంలో తువ్వాళ్ల నేత కేంద్ర భవనం

భవనాన్ని పట్టించుకున్నవారు లేక గోడలపై చెట్లు పెరిగి కూలేందుకు సిద్ధంగా ఉంది. సంవత్సరాల తరబడి నిరుపయోగం ఉండటం వలన భవనం ఎవ్వరూ ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోతుందని. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని కాలనీ వాసులు సామాజిక పరంగా ఉపయోగించుకునేం దుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మూతపడిన తువ్వాళ్ల నేత కేంద్రంలో మగ్గాలు

కమ్యూనిటీ హాల్‌గా మార్చాలి



రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంటున్న తువ్వాళ్ల నేత కేంద్రం భవనాన్ని కాలనీ వాసులు కమ్యూనిటీ హాల్‌గా ఉపయోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇందుకు అధికారులు, నాయకులు సహకరించాలి. ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

కొండా ప్రవీణ్, స్థానికుడు

రోగులను ఇబ్బంది పెట్టొద్దు

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలను ఇబ్బంది పెట్టొద్దు అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వైద్యాధికారులను కోరారు. స్థానిక సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య కేంద్రం)ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి మొత్తం పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడు తూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పనితీరుపై అనేక విమర్శలు వస్తున్నా యన్నారు. రెండు మూడు నెలల క్రితం సుమారు 150 నుంచి 200 వరకు ఉండాల్సిన ఓపీ ప్రస్తుతం 60 నుంచి 70కి పడిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనం పడిపోతున్న ఓపి అన్నారు. ఆసుపత్రికి వస్తున్న రోగులతో సిబ్బంది తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలందాలన్నారు. ఎక్కడైనా ఎవరైనా ఇబ్బంది పడ్డారన్న సమాచారం తన దృష్టికి వస్తే సహించేది లేదన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత పరిష్కరించేందుకు జిల్లా వైద్యాధికారితో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్ర మంలో సీహెచ్‌సీ చైర్మన్ బోయిన నాగరాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వర రావు, సీహెచ్‌సీ డైరెక్టర్ చలవాది రాజా గురవయ్య, ఏనుగ జయప్రకాష్, అన్నే రామారావు, చిట్టూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

రైతులకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మార్కెట్‌యార్డ్‌లో శనివారం జరిగిన పచ్చిరొట్ట విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి 24 గంటల్లోనే బిల్లులు వారి అకౌంట్లలో జమ అయ్యాయని తెలియజేశారు.

●స్విమ్మింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ తరపున కృష్ణాజిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈడుపుగల్లు స్విమింగ్‌పూల్‌లో శనివారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ శిబిరం నెలాఖరు వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. - పెనమలూరు

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కాకులపాడు చెరువులో ఈతకు దిగి గల్లంతైన వ్యక్తి దూసరి సతీష్ కుమార్ (27) మృతదేహం శనివారం లభ్యమైంది. పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో శుక్రవారం రాత్రి వరకూ గాలించినా ఆచూకి లభించక పోవడంతో శనివారం ఉదయం అగ్నిమాపకశాఖ సిబ్బంది తిరిగి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి ఏసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హనుమాన్‌జంక్షన్ ఎస్సై 2 నరసింహమూర్తి తెలిపారు.

నీట్ యూజీ-2025 నిర్వహణకు ఏర్పాట్లు

గన్నవరం, మే 3 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం వి.ఎస్.సెయింట్‌జాన్స్ హయ్యర్ సెకండరీ స్కూల్ ఆవర ణలో మే 4వ తేదీ జరిగే నీట్ యూజీ - 2025కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపాల్ రెవ. బ్రదర్ సంతోష్‌కుమార్ శనివారం తెలిపారు. ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్‌లకు సంబంధించి జరిగే ప్రవేశ పరీక్షలకు 480 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ సూపరింటెండెంట్ కుమారి. ఎస్.యానీ మాథ్యూస్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

డిప్యూటీ కలెక్టర్ సతీష్‌కు రైతు సంఘం నేతల వినతి

విజయవాడ రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో పండించిన ధాన్యం మొత్తాన్ని జాప్యం లేకుండా తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నేతలు శనివారం డిప్యూటీ కలెక్టర్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. నగరంలోని ఆయన కార్యాలయానికి వెళ్లి కలసిన నేతలు రైతుల సమస్యలను వివరించారు. నున్న గ్రామంతో పాటుగా కౌలూరు, కొత్తూరు తాడేపల్లి, పైడూరుపాడు, మూలపాడు తదితర రూరల్ మండలంలోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు విషయంలో తీవ్ర జాప్యం జరుగుందని చెప్పారు. ప్రభుత్వ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా నేటికి ధాన్యం తరలింపులో అలసత్వం జరుగుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో జాప్యం కారణంగా ధాన్యం ఎక్కువగా ఎండటం వలన ధాన్యం ముక్కలవుతోందని మిల్లర్లు క్వింటాకు ఐదు కేజీల చొప్పున తరుగు తీస్తున్నారని ఈ కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతు న్నారన్నారు. ధాన్యం దించుకోవడంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహించినా వాహనాల కిరాయిలు రైతుల వద్ద వసూళ్లు చేస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డిప్యూటీ కలెక్టర్‌ను కలసిన వారిలో ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, నేతలు పి. వెంకటే శ్వరరావు, భోగేశ్వరరావు, నాగరాజు తదితరులు ఉన్నారు.



డిప్యూటీ కలెక్టర్ సతీష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నేతలు

చదరంగ పోటీలు ప్రారంభం

విజయవాడ(స్పోర్ట్స్), మే3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండర్ 9 బాలబాలికల చదరంగ పోటీలు కానూరులోని స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలను స్కూల్ సీఈవో జాహ్నవి ప్రారంభించారు. 97మంది బాలురు, 37మంది బాలికలు పాల్గొనగా మొత్తం 7 రౌండ్లు జరుగుతాయి. మొదటి రోజు 4 రౌండ్లు జరగ్గా బాలుర విభాగంలో హితేష్, జస్వంత్, శశాంక్, ప్రభంజన్ నాయుడులు నాలుగు పాయింట్లతో ముందంజలో ఉన్నారు. బాలికల విభాగంలో మోదిత రెడ్డి 4 పాయింట్లు, మోక్ష సత్య ఆద్య, సహస్రలు 3.5 పాయింట్లతో ముందంజలో ఉన్నారు. ఆదివారం మిగిలిన మూడు రౌండ్లు జరుగుతాయి.



టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు



చినఓగిరాల్లో పాలడుగు పద్మావతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పాలడుగు పద్మావతికి ఎమ్మెల్యే యార్లగడ్డ నివాళి

ఉయ్యూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : చినఓగిరాలకు చెందిన కేసీపీ మాజీ ఏజీఎం పాలడుగు భాస్కరరావు మాతృమూర్తి పాలడుగు పద్మావతి చిత్రంపటం వద్ద ప్రభుత్వ చీఫ్‌విప్ గన్నవరం ఎమ్మెల్యే, యార్లగడ్డ వెంకట్రావు శనివారం నివాళులర్పించారు. భాస్కరరావు తల్లి ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందగా భాస్కరరావు కుటుంబ సభ్యులను యార్లగడ్డ పరామర్శించి సంతాపం తెలియజేశారు.

వృత్తినైపుణ్య కోర్సుల్లో శిక్షణ

ఉంగుటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం (యూబీఆర్ఎస్ఈటీఐ)లో స్వయం ఉపాధి కల్పించే పలు వృత్తినైపుణ్య కోర్సుల్లో మే 15నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు శిక్షణా కేంద్రం డైరెక్టర్ వి.అమరేశ్వర్‌రెడ్డి తెలిపారు. బ్యూటీషియన్, మగ్గం ఎంబ్రాయిడరీ, సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీసింగ్, జ్యూట్‌బ్యాగుల తయారీ, పుట్టగొడుగుల పెంపకం, అగర్‌బత్తీ తయారీ, కొవ్వొత్తుల తయారీ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు కృష్ణా జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో నేరుగా శిక్షణాకేంద్రానికి విచ్చేసి దరఖాస్తు చేసుకోవాలని లేదా 6304254730, 9490011081 నెంబర్లలో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

వెబ్ డవలపర్ కోర్సులో..

గన్నవరం : గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నెలకొల్పిన స్కిల్ హబ్‌లో వెబ్ డవలపర్ కోర్సు నేర్చుకోవడం ద్వారా యువతకు సువర్ణావకాశం లభిస్తోందని ప్రిన్సిపాల్ వీ.వీ.కృష్ణమోహన్ శనివారం తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, ఫోటోతో గన్నవరం పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో సంప్రదించాలని తెలిపారు.

హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

విశ్వహిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్

హనుమాన్‌జంక్షన్, మే 3 (ఆంధ్రజ్యోతి): హిందూ మత ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడంతో పాటు హిందూ దేవాలయాలను పరిరక్షించడమే విశ్వహిందూ పరిషత్ ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ అన్నారు. శనివారం విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ హనుమాన్ జంక్షన్‌లోని తన ఫామ్ హౌస్‌లో ఆశాజ్యోతి ఆశ్రమ పాఠశాల దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఉపకరణాలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అలోక్ కుమార్ దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ రాష్ట్ర కోశాధికారి దుర్గాప్రసాద్, నాయకులు శ్రీనివాసరాజు ఉన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ నాయకులు నందూరు సత్యవేంకటేశ్వర శర్మ, నందిగం స్వామి, తాడి రంగారావు, వేగిరెడ్డి నాని, మరీదు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆశాజ్యోతి దివ్యాంగులకు ఉపకరణాలను అందిస్తున్న వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు అలోక్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగిని మృతి

హనుమాన్‌జంక్షన్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డులో శేరీనరసన్నపాలెం అడ్డరోడ్డు వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడ సచివాలయం ఉద్యోగిని దుర్మరణం చెందారు. ఏలూరు జిల్లా వంగాయిగూడెంకు చెందిన రామిశెట్టి కుసుమ అరుణకుమారి (50) విజయవాడ సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో రామవరప్పాడు నుంచి భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వంగాయిగూడెం వెళ్తుండగా శేరీనరసన్నపాలెం అడ్డరోడ్డు సమీపంలో కంటైనర్ లారీ ఢీ కొంది. జంక్షన్ ఎస్సై వి.సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శనివారం గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఆర్థిక బాధలు తాళలేక..

సత్యనారాయణపురం : ఆర్థిక బాధలు తాళలేక సచివాలయం ఉద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం ప్రసాదంపాడు తాళ్లబజారులో చోటుచేసుకుంది. పటమట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం.చక్రధర్ (35) ప్రసాదంపాడు తాళ్లబజారులో నివసిస్తుంటాడు. ఇతను ప్రసాదంపాడు సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అప్పుల బాధలు ఎక్కువడంతో శనివారం ఇంట్లో ఫ్యాన్‌కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం ఇతని భార్య ప్రజ్ఞ పటమట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

సండే సెలబ్రిటీ







> 37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... కె. రాఘవేంద్రరావు. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

• హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్‌వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

• మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

• ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకోవచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి

సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

• పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు'. 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

• వినాయకరావు

28 రోజుల్లో 'జ్యోతి'



ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు...' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జిని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'



నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలిన ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స



ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.

బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.



- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



అద్భుతమైన మహిళల కోసం

నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.



"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలో మీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.

దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్టును చేపట్టాను."

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.

నేటి మ్యాచ్‌లు

కోల్‌కతా x రాజస్థాన్ — మ.3.30 నుంచి — వేదిక: కోల్‌కతా

పంజాబ్ x లఖ్‌నవూ — రా.7.30 నుంచి — వేదిక: ధర్మశాల

డ్రగ్స్ కేసులో పట్టుబడిన రబాడ!

అందుకే ఐపీఎల్‌కు దూరం



న్యూఢిల్లీ: డ్రగ్స్ వాడినట్టు తేలడంతో దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడ సుమారు నెలరోజులపాటు ఐపీఎల్‌కు దూరమయ్యాడు. గుజరాత్ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడిన రబాడ.. గత నెల మూడున హఠాత్తుగా స్వదేశం వెళ్లిపోయాడు. అయితే, వ్యక్తిగత కారణాలతో రబాడ లీగ్‌ను వీడినట్టు గుజరాత్ ఫ్రాంచైజీ తెలిపింది. కానీ, రిక్రియేషనల్ డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు లాంటివి) వాడినట్టు పరీక్షల్లో తేలడంతో అతడిపై తాత్కాలికంగా వేటుపడింది. ఈ విషయాన్ని రబాడ స్వయంగా ఓ ప్రకటనలో తెలిపాడు. సౌతాఫ్రికా టీ20 లీగ్ సమయంలో అతడు డోపింగ్ నిబంధనలను అతిక్రమించినట్టు సమాచారం. సామర్థ్యాన్ని పెంచే డ్రగ్ కాకపోవడంతో.. గతంలో కొన్ని కేసుల్లో విధించిన శిక్షల ప్రకారం అతడిపై విధించిన సస్పెన్షన్ ముగిసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రబాడ ఐపీఎల్‌కు తిరిగి వచ్చాడు. మంగళవారం ముంబైతో జరిగే మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగే అవకాశం ఉంది.

ఉమామహేష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ షూటర్ మద్దినేని ఉమామహేష్ రజతం దక్కించుకున్నాడు. శనివారం న్యూఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో 10 మీటర్ల రైఫిల్ జూనియర్ విభాగంలో మహేష్ 251 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. కేవలం 0.1 పాయింట్ తేడాతో త్రుటిలో స్వర్ణ పతకాన్ని మహేష్ కోల్పోయాడు. పార్థ్ రాకేష్ (మహారాష్ట్ర) 251.01 స్కోరుతో స్వర్ణం, ప్రణవ్ (కర్ణాటక) 229.5 స్కోరుతో కాంస్యం గెలిచారు. ఈ పోటీల్లో ఆంధ్రకు ఇది రెండో పతకం. తొలి రోజు పోటీల్లో ముఖేష్ స్వర్ణం సాధించడం తెలిసిందే. కాగా కిరణ్ అంకుష్ జాదవ్ 10మీ. ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. వివేక్ శర్మ (250.1) రజతం, విశాల్ సింగ్ (230.1) కాంస్యం అందుకున్నారు.

నిషిక పతక మోత



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ యువ జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్ ఒకే రోజు మూడు పతకాలు కైవసం చేసుకొని సంచలనం సృష్టించింది. శనివారం పుణెలోని శివఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ పోటీల్లో తెలుత నిషిక వాల్టింగ్ టేబుల్ విభాగంలో (12.883) స్వర్ణం సాధించింది. ఫ్లోర్ ఎక్సర్‌సైజ్‌లో నిషిక 11.433 స్కోరుతో రెండో స్వర్ణం సొంతం చేసుకుంది. బ్యాలెన్సింగ్ బీమ్ విభాగంలో నిషిక 10.967 స్కోరుతో రజతంతో మెరిసింది. శుక్రవారం జరిగిన ఆల్‌రౌండ్ విభాగంలో నిషిక స్వర్ణం సాధించడం తెలిసిందే. మొత్తంగా ఈ పోటీల్లో నిషికకు ఇది నాలుగో పతకం.

మళ్లీ ఓడిన భారత్

హాకీ అమ్మాయిలకు నాలుగో ఓటమి

పెర్త్: ఆస్ట్రేలియా టూర్‌లో భారత మహిళల హాకీ జట్టు వరుసగా నాలుగో ఓటమిని చవిచూసింది. శనివారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ 2-3తో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. నవ్‌నీత్ కౌర్ (35వ నిమిషం), లాల్‌రిమ్సియామి (59వ) చెరో గోల్ చేయగా.. ఆస్ట్రేలియా తరఫున గ్రేస్ స్టీవార్ట్ (2వ), జేడ్ స్మిత్ (36వ), గ్రెటా హేస్ (42వ) గోల్స్ సాధించారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆఖరి పోరు ఆదివారం జరగనుంది. ఆసీస్-ఎతో జరిగిన రెండు మ్యాచ్‌ల్లో చిత్తయిన భారత్.. గత గురువారం సీనియర్ టీమ్ చేతిలో 0-2తో ఓడింది.

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా..

ఉదయం 10.గం నుంచి



కెప్టెన్ హర్మన్


నేడు శ్రీలంకతో భారత్ పోరు

మహిళల ముక్కోణపు వన్డే సిరీస్

కొలంబో: మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత జట్టు దూసుకెళ్తోంది. ఇప్పటికే శ్రీలంక, దక్షిణాఫ్రికాపై వరుస విజయాలతో పట్టికలో టాప్‌లో ఉంది. తాజాగా ఆదివారం ఆతిథ్య శ్రీలంకతో మరో మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. అన్ని విభాగాల్లోనూ రాణిస్తోన్న భారత జట్టు ఈ మ్యాచ్‌లోనూ నెగ్గి హ్యాట్రిక్ విజయంతో పాటు ఫైనల్లోనూ చోటు దక్కించుకోవాలనుకుంటోంది. అలాగే సంచలన ఓపెనర్ ప్రతీక రావల్.. సచిన్ రికార్డును బ్రేక్ చేసేందుకు ఎదురుచూస్తోంది. ప్రస్తుతం తను వరుసగా ఐదు హాఫ్ సెంచరీలతో సచిన్, ద్రవిడ్ సరసన ఉంది. మహిళల క్రికెట్‌లో ఈ రికార్డు మిథాలీ రాజ్ (7) పేరిట కొనసాగుతోంది. స్పిన్నర్లు స్నేహ్ రాణా, శ్రీ చరణి మరోసారి కీలకం కానున్నారు. అటు దక్షిణాఫ్రికాతో గెలిచిన శ్రీలంక జట్టు భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. కెప్టెన్ చమరి పేలవ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. అయితే మిడిలార్డర్‌లో హర్షిత-కవిష జోడీ దీటుగా నిలబడితే భారత్‌కు ఇబ్బందే.

చెన్నై పోరాడినా..

- ఆఖరి బంతికి ఆర్‌సీబీ విజయం
- విరాట్, బెథెల్, షెఫర్డ్ హాఫ్‌సెంచరీలు
- ఆయుష్ మాత్రే సెంచరీ మిస్



షెఫర్డ్ (14 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 53 నాటౌట్)

1 టీ20ల్లో ఒకే వేదికపై ఎక్కువ సిక్సర్లు (154) బాదిన బ్యాటర్‌గా విరాట్. అలాగే సీఎస్‌కేపై ఎక్కువ హాఫ్ సెంచరీలు (10) సాధించిన బ్యాటర్‌గానూ నిలిచాడు.

2 ఐపీఎల్‌లో రెండో ఫాస్టెస్ట్ (14 బంతుల్లో) ఫిఫ్టీ సాధించిన షెఫర్డ్. కమిన్స్, రాహుల్‌తో సమంగా నిలిచాడు. జైస్వాల్ (13) టాప్‌లో ఉన్నాడు.

3 ఐపీఎల్‌లో ఫిఫ్టీ సాధించిన మూడో యంగెస్ట్ (17 ఏళ్లు) బ్యాటర్‌గా ఆయుష్

చివరి రెండు ఓవర్లలో అత్యధిక పరుగులు (54) సాధించిన జట్టుగా ఆర్‌సీబీ

బెంగళూరు: ఐపీఎల్‌లో అత్యధిక అభిమానగణం కలిగిన చెన్నై సూపర్ కింగ్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ ఉర్రూతలూగించింది. ముఖ్యంగా ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించాక చెన్నై అదిరే ఆటతో ఆకట్టుకున్నా.. ఆఖరి బంతికి ఓడాల్సి వచ్చింది. పేసర్ యష్ దయాళ్ ఈ ఓవర్‌ను కట్టుదిట్టంగా వేయడంతో ఆర్‌సీబీ కేవలం 2 పరుగుల తేడాతో గట్టెక్కింది. అలాగే 16 పాయింట్లతో తిరిగి టాప్‌లోకి చేరి ప్లేఆఫ్స్ బెర్త్ దాదాపు ఖాయం చేసుకుంది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 213 పరుగులు చేసింది. విరాట్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 62), బెథెల్ (33 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 55), షెఫర్డ్ (14 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 53 నాటౌట్) చెలరేగారు. పథిరనకు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్లకు 211 పరుగులు చేసి ఓడింది. ఆయుష్ మాత్రే (48 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 94), జడేజా (45 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 77 నాటౌట్) ఆకట్టుకున్నారు. ఎన్‌గిడికి మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా షెఫర్డ్ నిలిచాడు.

ఆయుష్ అదిరేలా..: భారీ ఛేదనలో చెన్నై ఇన్నింగ్స్ సజావుగానే ఆరంభమైంది. ఓపెనర్ ఆయుష్ మాత్రే అద్భుత ఆటతీరుతో కదం తొక్కాడు. అతడికి జడేజా మధ్య ఓవర్లలో సహకారం అందించాడు. ఇద్దరూ మూడో వికెట్‌కు 114 పరుగులందించారు. అటు ఆర్‌సీబీ ఫీల్డర్లు నాలుగు క్యాచ్‌లను వదిలేసినా.. చివరి ఓవర్‌లో చెన్నైకి నిరాశ తప్పలేదు. మరో ఓపెనర్ రషీద్ (14) విఫలమైనా.. మాత్రే మాత్రం జోరును ఆపలేదు. భువీ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో 4,4,4,6,4,4తో 26 పరుగులు సాధించాడు. అయితే వరుస ఓవర్లలో రషీద్, కర్రాన్ (5) వికెట్లను కోల్పోవడంతో పవర్‌ప్లేలో 58/2 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత కూడా లయ దెబ్బతినకుండా మాత్రే-జడేజా ఆర్‌సీబీ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. 25 బంతుల్లో తొలి హాఫ్ సెంచరీ సాధించిన మాత్రే పదో ఓవర్‌లో 6,6,4తో స్కోరును వంద దాటించాడు. 16వ ఓవర్‌లో మాత్రే, జడేజా క్యాచ్‌లను వదిలేశారు. అయితే మాత్రే 94 పరుగుల వద్ద సిక్సర్‌కు వెళ్లి క్రునాల్ క్యాచ్‌తో వెనుదిరగ్గా, బ్రెవిస్ (0) ఎల్బీ అయ్యాడు. అయితే రీప్లేలో బంతి లెగ్ స్టంప్‌ను మిస్ అవుతున్నట్టు తేలింది. ఈ ఇద్దరినీ ఎన్‌గిడి అవుట్ చేశాడు. ఇక ఆరు బంతుల్లో 15 పరుగులు కావాల్సిన వేళ హైడ్రామా నెలకొంది. పేసర్ యష్ మూడో బంతికి ధోనీ (12)ని అవుట్ చేయగా దూబే (8 నాటౌట్) సిక్సర్‌తో ఉత్కంఠ పెరిగింది. ఆఖరి బంతికి ఫోర్ రావాల్సి ఉండగా ఒక్క పరుగే తీసిన చెన్నై ఓడక తప్పలేదు.

ఓపెనర్ల జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరుకు ఓపెనర్లు విరాట్, బెథెల్ అదిరే ఆరంభాన్ని అందించారు. ఇద్దరూ మైదానం నలువైపులా బౌండరీలు బాదేయడంతో స్కోరు దూసుకెళ్లింది. అయితే వీరున్నంత సేపే జోరు కనిపించగా.. ఆ తర్వాత చెన్నై బౌలర్ల కట్టడితో నెమ్మదించింది. కానీ స్వల్ప స్కోరుకు పరిమితం కావాల్సిన ఆర్‌సీబీని చివర్లో షెఫర్డ్ ఆదుకున్నాడు. తొలి ఓవర్‌లోనే బెథెల్ హ్యాట్రిక్ ఫోర్లతో ధాటిని కనబర్చగా.. పేసర్ ఖలీల్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదాడు. అయితే నాలుగో ఓవర్‌లో బెథెల్ క్యాచ్‌ను జడేజా, పథిరన సమయన్వయ లోపంతో వదిలేశారు. అటు విరాట్ ఆరో ఓవర్‌లో 6,4తో పవర్‌ప్లేలో జట్టు 71 పరుగులతో నిలిచింది. ప్రమాదకరంగా మారిన ఈ జోడీకి పేసర్ పథిరన షాక్ ఇచ్చాడు. పదో ఓవర్‌లో బ్రెవిస్ డైవింగ్ క్యాచ్‌తో బెథెల్ వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్‌లో విరాట్ 6,4,4తో 29 బంతుల్లో వరుసగా నాలుగో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. కానీ ఆ వెంటనే కర్రాన్‌కు చిక్కాడు. అయితే దేవ్‌దత్ (17), రజత్ (11), జితేశ్ (7) ఆకట్టుకోలేదు.

ఆ రెండు ఓవర్లలో..: 18 ఓవర్లలో ఆర్‌సీబీ స్కోరు కేవలం 159/5. ఈ దశలో 180 కూడా కష్టమే అనిపించింది. కానీ ఆట 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చిన రొమారియో షెఫర్డ్ విధ్వంసం సృష్టించాడు. ఖలీల్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన అతడు 6,6,4,6,6నోబ్, 4తో ఏకంగా 33 పరుగులు రాబట్టాడు. ఇక ఆఖరి ఓవర్‌లో 4,4,6,6తో 21 రన్స్ రాగా స్కోరు కూడా 200 దాటేసింది. మరోవైపు 14 బంతుల్లోనే షెఫర్డ్ హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది.

స్కోరుబోర్డు

బెంగళూరు: బెథెల్ (సి) బ్రెవిస్ (బి) పథిరన 55; విరాట్ (సి) ఖలీల్ (బి) కర్రాన్ 62; పడిక్కళ్ (సి) జడేజా (బి) పథిరన 17; రజత్ (సి) కర్రాన్ (బి) పథిరన 11; జితేశ్ (సి) బ్రెవిస్ (బి) నూర్ అహ్మద్ 7; డేవిడ్ (నాటౌట్) 2; షెఫర్డ్ (నాటౌట్) 53; **ఎక్స్‌ట్రాలు:** 6; **మొత్తం: 20 ఓవర్లలో 213/5. వికెట్ల పతనం:** 1-97, 2-121, 3-144, 4-154, 5-157; **బౌలింగ్:** ఖలీల్ 3-0-65-0; అన్షుల్ 3-0-25-0; నూర్ అహ్మద్ 4-0-26-1; జడేజా 3-0-26-0; కర్రాన్ 3-0-34-1; పథిరన 4-0-36-3.

చెన్నై: ఆయుష్ మాత్రే (సి) క్రునాల్ (బి) ఎన్‌గిడి 94, రషీద్ (సి) షెఫర్డ్ (బి) క్రునాల్ 14, కర్రాన్ (సి) జితేష్ (బి) ఎన్‌గిడి 5, జడేజా (నాటౌట్) 77, బ్రెవిస్ (ఎల్బీ) ఎన్‌గిడి 0, ధోనీ (ఎల్బీ) యశ్ 12, దూబే (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు 1, మొత్తం: 20 ఓవర్లలో 211/5, వికెట్లపతనం:** 1-51, 2-58, 3-172, 4-172, 5-201; **బౌలింగ్:** క్రునాల్ 3-0-24-1, భువనేశ్వర్ 4-0-55-0, యశ్ దయాల్ 4-0-41-1, ఎన్‌గిడి 4-0-30-3, సుయాశ్ 4-0-43-0, షెఫర్డ్ 1-0-18-0.

బంగ్లాతో సిరీస్ రద్దు?

ఆసియాకప్ కూడా..

న్యూఢిల్లీ: పహల్గాంలో ఉగ్రదాడి కారణంగా భారత జట్టు క్రికెట్ షెడ్యూల్‌పై తీవ్ర ప్రభావమే పడనుంది. ఇప్పటికే పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లను పూర్తిగా బాయ్‌కాట్ చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. తాజాగా భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటన కూడా సందేహంగా మారింది. ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం టీమిండియా అక్కడికి వెళ్లాల్సి ఉంది. కానీ బంగ్లా రిటైర్డ్ ఆర్మీ అధికారి ఫజ్లూర్ రహమాన్ చేసిన వ్యాఖ్యలు ఈ సిరీస్‌ను సంశయంలో పడేశాయి. ఒకవేళ పాక్‌పై భారత్ దాడి చేస్తే వారి ఈశాన్య రాష్ట్రాలను బంగ్లా ఆక్రమించుకోవాలంటూ అతడు ప్రగల్భాలు పలికాడు. దీంతో ప్రస్తుత స్థితిలో ఈ సిరీస్ జరిగే అవకాశాలు తక్కువేనంటూ బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఈ ఏడాది తటస్థ వేదికపై జరగాల్సిన ఆసియాకప్‌పైనా అనిశ్చితి కొనసాగుతోంది. 8 దేశాలు తలపడనుండగా.. గ్రూప్ ఎలోనే భారత్-పాక్ జట్లు ఉండడం గమనార్హం.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	11	8	3	0	16	0.482
ముంబై	11	7	4	0	14	1.274
గుజరాత్	10	7	3	0	14	0.867
పంజాబ్	10	6	3	1	13	0.199
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	11	3	8	0	6	-0.780
హైదరాబాద్	10	3	7	0	6	-1.192
చెన్నై	11	2	9	0	4	-1.117

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

బిజినెస్ ప్లస్

వ్యక్తిగత రుణాన్ని తిరస్కరించారా!

అయితే ఈ గండం నుంచి గట్టెక్కడం ఎలా?



కొన్ని ఆర్థిక అవసరాలు ఆకస్మికంగా వస్తుంటాయి. వాటిని భరించేందుకు చేతిలో సరిపడా డబ్బులు ఉండకపోవచ్చు. అప్పుడు ఎవరికైనా ముందు గుర్తుకు వచ్చేది వ్యక్తిగత రుణాలే. అయితే ఒక్కోసారి ఈ రుణ దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరిస్తుంటాయి. అప్పుడు మనముందున్న మార్గాలు ఏమిటో తెలుసుకుందాం..

ఇవాళ అందరి జీవితాలు ముఖ్యంగా మధ్యతరగతి బతుకులు అప్పులతోనే తెల్లారిపోతున్నాయి. ఈ సమస్య నుంచి బయట పడేందుకు చాలా మంది వ్యక్తిగత రుణాలను ఆశ్రయిస్తుంటారు. అయితే ఒక్కోసారి బ్యాంకులు ఈ అప్లికేషన్లను తిరస్కరిస్తుంటాయి. అందుకు ఈ కింది విషయాలు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

సిబిల్ స్కోరు

ఏ రుణం కావాలన్నా బ్యాంకులు ఆయా వ్యక్తుల సిబిల్ స్కోరు చూస్తాయి. ఈ స్కోరు కనీసం 750 పాయింట్ల కంటే ఎక్కువ ఉండటం మంచిది. అంతకంటే తక్కువగా ఉంటే రుణం ఇవ్వడానికి బ్యాంకులు ఆలోచిస్తాయి.

అధిక అప్పులు

మీ ఆదాయంలో ఎక్కువ భాగం ఇప్పటికే ఉన్న అప్పుల చెల్లింపులకు పోతుంటే.. బ్యాంకులు వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు ముఖం చాటేస్తాయి.

నిలకడలేని ఆదాయం, ఉద్యోగాలు

ఉద్యోగాల్లో కుదురుగా ఉండి.. స్థిరమైన ఆదాయాలు ఉన్న వారికే వ్యక్తిగత రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ఇష్టపడతాయి.

అనేక అప్లికేషన్లు

స్వల్పకాలంలో రుణాల కోసం మీరు అనేక అప్లికేషన్లు పెట్టినా సమస్యే. బ్యాంకులు అలాంటి వ్యక్తులను అప్పుల అప్పారావులుగా పరిగణించి రుణాలు ఇచ్చేందుకు పెద్దగా ఇష్టపడవు.

పూర్తి వివరాలు లేకపోవడం

రుణ దరఖాస్తుతో పాటు బ్యాంకు అడిగిన ఐడీ ప్రూఫ్, శాలరీ స్లిప్పులు లేదా బ్యాంకు స్టేట్‌మెంట్లు ఇవ్వాలి. లేకపోతే బ్యాంకు మీ పర్సనల్ లోన్ అప్లికేషన్‌ను పక్కన పెడుతుంది.

క్రెడిట్ స్కోరు పెంచుకోవడం

క్రెడిట్ స్కోరు బాగోక బ్యాంకు మీ వ్యక్తిగత రుణ దరఖాస్తును తిరస్కరిస్తే ఈ కింది చర్యల ద్వారా స్కోరు పెంచుకోవచ్చు.
- ఈఎంఐలు, క్రెడిట్ కార్డు బిల్లులు సమయానికి చెల్లించడం
- మీకు ఉన్న పరపతిలో 30 శాతానికి మించి ఉపయోగించుకోకపోవడం
- తరచుగా రుణాల కోసం దరఖాస్తు చేయకపోవడం
- ఉన్న రుణాలు చెల్లించడం ద్వారా పరపతి స్కోరు పెంచుకోవడం
- క్రెడిట్ స్కోరు రిపోర్టులో తప్పులు ఉంటే వెంటనే సరి చేయించుకోవడం.

పూచీకత్తు రుణం

పరపతి స్కోరు సరిగా లేనప్పుడు ఏదైనా ఆస్తిని పూచీగా చూపి వ్యక్తిగత రుణాలు తీసుకోవడం మంచిది. ఈ పూచీతో బ్యాంకులు రుణ దరఖాస్తును త్వరగా ఆమోదించడమే గాక తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తాయి.

అర్హత పెంచుకోవడం

రుణ దరఖాస్తుకు ముందే సిబిల్ స్కోరును మెరుగుపరుచుకోవటం, స్థిరమైన ఆదాయం, పాత రుణాలు సమయానికి సరిగా చెల్లించిన చరిత్ర కలిగి ఉండేలా చూసుకోవాలి. ఇంకా ఈ కింది అంశాలు కూడా రుణ దరఖాస్తు ఆమోదానికి ఉపకరిస్తాయి.
- మీ అర్హతకు మించిన వ్యక్తిగత రుణానికి అప్లయ్ చేయకూడదు
- రుణ దరఖాస్తు చేసే నాటికి కనీసం ఆరు నెలల నుంచి ఒకే ఉద్యోగంలో ఉండాలి. స్వయం ఉపాధి అయితే స్థిరమైన ఆదాయం ఉందని బ్యాంకుకు నిరూపించాలి
- పై అంశాలను తూచా తప్పకుండా పాటిస్తే మీ వ్యక్తిగత రుణ దరఖాస్తును బ్యాంకులు ఆమోదించడంతో పాటు తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చే అవకాశాలు మెరుగవుతాయి.

తిరిగి దరఖాస్తు చేయడం

పరపతి స్కోరు, ఆదాయం పెరిగే వరకు ఆగి.. మళ్లీ దరఖాస్తు చేయడం మరో మార్గం. దీనివల్ల బ్యాంకు మీ రుణ దరఖాస్తుని తాజాగా పరిశీలించి రుణం మంజూరు చేసే అవకాశాలు ఎక్కువ.

తిరస్కరణ తర్వాత ఏమి చేయాలి?

మీ రుణ అప్లికేషన్‌ను బ్యాంకు తిరస్కరించగానే గాభరాపడి పోవాల్సిన పని లేదు. ఈ కింది చర్యల ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.
- సమస్యను అర్థం చేసుకోవడం
- ఏ కారణం చేత మీ రుణ దరఖాస్తు తిరస్కరణకు గురైందో బ్యాంకును అడిగి తెలుసుకోవాలి
- ఇంకో రుణం కోసం దరఖాస్తు చేయడం
- ఇంతకు ముందు దరఖాస్తు చేసిన దాని కంటే తక్కువ రుణం కోసం మరో దరఖాస్తు చేయడం
- కో అప్లికెంట్ లేదా హామీదారుని చేర్చడం
- మీకంటే మంచి పరపతి స్కోరు ఉన్న వ్యక్తిని సహ దరఖాస్తుదారునిగా లేదా హామీదారుగా చేర్చుకోవడం
- ఎన్‌బీఎఫ్‌సీలు, ఫిన్‌టెక్‌లను ఆశ్రయించడం
- బ్యాంకులతో పోలిస్తే ఎన్‌బీఎఫ్‌సీలు, ఫిన్‌టెక్ కంపెనీలు పరపతి స్కోరు తక్కువగా ఉన్నా వ్యక్తిగత రుణాలు ఇస్తాయి. కాకపోతే ఇందుకు వడ్డీ కొద్దిగా ఎక్కువగా ఉంటుంది.

బజాజ్ ఫిన్‌సర్వ్ కొత్త ప్యాసివ్ ఫండ్స్

బజాజ్ ఫిన్‌సర్వ్ రెండు కొత్త తరం ప్యాసివ్ ఫండ్స్‌ను ప్రారంభించింది. దీర్ఘకాలంలో మంచి లాభాలు ఆర్జించేలా తక్కువ పెట్టుబడి వ్యయ ఆప్షన్లతో ఈ ఫండ్స్‌ను రూపొందించింది. బజాజ్ ఫిన్‌సర్వ్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్ పేరుతో వీటిని తీసుకువచ్చింది. నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్‌కు నిఫ్టీ నెక్స్ట్ 50 టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్ఐ) బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 6. కాగా నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్‌కు నిఫ్టీ 50 టీఆర్ఐ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 9. ఈ రెండు ఫండ్స్ కనీస పెట్టుబడి రూ.500.

యూటీఐ మల్టీ క్యాప్ ఫండ్

యూటీఐ మ్యూచువల్ ఫండ్.. మల్టీ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 మల్టీక్యాప్ 50:25:25 టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.1,000. ముగింపు తేదీ ఈ నెల 13.

ఎస్‌బీఐ లాభం రూ.18,642 కోట్లు

- మార్చి త్రైమాసికంలో 10% క్షీణత
- ఒక్కో షేరుకు రూ.15.90 డివిడెండ్

న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఎస్‌బీఐ స్టాండ్‌ఎలోన్ నికర లాభం రూ.18,642 కోట్లకు పరిమితమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.20,698 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం తగ్గింది. మొండి బాకీలు, ఇతర అవసరాల కోసం కేటాయింపులు గణనీయంగా పెరగడంతో పాటు నికర వడ్డీ మార్జిన్ తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. బ్యాంకు మొత్తం ఆదాయం మాత్రం రూ.1,28,412 కోట్ల నుంచి రూ.1,43,876 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.1,11,043 కోట్ల నుంచి రూ.1,19,666 కోట్లకు ఎగబాకింది. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 2.7 శాతం వృద్ధితో రూ.42,774.55 కోట్లకు చేరగా.. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 0.32 శాతం తగ్గి 3.15 శాతానికి పరిమితమైంది. గత 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.15.90 డివిడెండ్ ప్రకటించింది. గడిచిన 12 ఏళ్లలో ఎస్‌బీఐ చెల్లించబోయే అత్యధిక డివిడెండ్ ఇదే. మరిన్ని ముఖ్యాంశాలు..
- క్యూ4లో ఎస్‌బీఐ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 8 శాతం తగ్గి రూ.19,600 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.1,79,562 కోట్లకు పెరిగింది.
- 2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు స్టాండ్‌ఎలోన్ లాభం రూ.70,901 కోట్లు, మొత్తం రాబడి రూ.5,24,172 కోట్లుగా నమోదైంది. ఇదే కాలానికి ఏకీకృత లాభం రూ.79,017 కోట్లు, మొత్తం రాబడి రూ.6,63,343 కోట్లుగా ఉంది.
- బ్యాంక్ ఆస్తుల నాణ్యత మరింత మెరుగుపడింది. ఈ మార్చి 31 నాటికి ఎస్‌బీఐ మొండి బకాయిలు (స్థూల ఎన్‌పీఏ) 1.82 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.47 శాతానికి జారుకున్నాయి.
- ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో క్యూఐపీ లేదా ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీఓ) లేదా ఇతర మార్గాల్లో రూ.25,000 కోట్ల వరకు సమీకరించేందుకు ఎస్‌బీఐ బోర్డు ఆమోదం తెలిపింది.

‘ఆల్ ఇన్ వన్ గోల్డ్ ఏటీఎం’

బేగంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): బంగారు నాణేలను విక్రయించే ఏటీఎంను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన గోల్డ్ సిక్కా సంస్థ.. మరిన్ని సదుపాయాలతో అధునాతన ఏటీఎంను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. బంగారం లావాదేవీలకు సంబంధించి అనేక సేవలను అందించే ‘గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం’ను త్వరలోనే హైదరాబాద్‌లోని బేగంపేటలో ప్రారంభించనున్నట్లు గోల్డ్ సిక్కా లిమిటెడ్ ఎండీ, సీఈవో తరుజ్ తెలిపారు. శనివారం బేగంపేటలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ‘గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం’ పని చేసే వివరాలతో కూడిన పోస్టర్‌ను గోల్డ్ సిక్కా ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తరుజ్ మాట్లాడారు. ఈ ఏటీఎం ద్వారా బంగారాన్ని కొనడం, అమ్మడం, మార్చడం, లీజుకు ఇవ్వడం, డిజిటైజ్ చేయడం, నగదుగా మార్చుకోవడం, బంగారు ఆభరణాలను కొనుగోలు చేయడం వంటి సేవలను పొందవచ్చని తెలిపారు. బంగారు రుణాలు మినహా అన్ని సేవలను ఇది అందిస్తుందని చెప్పారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ‘ఆల్ ఇన్ వన్ గోల్డ్ ఏటీఎం’ అని అన్నారు. 2022లో బేగంపేటలో తాము ప్రారంభించిన ‘గోల్డ్ రియల్ టైమ్ ఏటీఎం’ ఎంతో ఆదరణ పొందిందని పేర్కొన్నారు. దాని కంటే మెరుగైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ‘గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం’ ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందిస్తుందని వివరించారు. వినియోగదారులు బంగారం అమ్మేటప్పుడు ఏటీఎంలో డిపాజిట్ చేసిన వెంటనే ఆధార్, ఐడీ కార్డును వెరిఫై చేస్తుందని చెప్పారు.

వాణిజ్యాన్ని ఆయుధంగా వాడొద్దు..

- ట్రంప్ సుంకాల వ్యూహం అతిపెద్ద తప్పు
- బెర్క్‌షైర్ హాత్‌వే చైర్మన్ వారెన్ బఫెట్

ఒమాహా (అమెరికా): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలను ప్రపంచ ప్రముఖ స్టాక్ ఇన్వెస్టర్, బెర్క్‌షైర్ హాత్‌వే చైర్మన్ వారెన్ బఫెట్ తీవ్రంగా విమర్శించారు. ప్రపంచ దేశాలపై భారీ సుంకాలు విధించడాన్ని అతిపెద్ద తప్పుగా ఆయన అభివర్ణించారు. ఏ దేశమైనా వాణిజ్యాన్ని ఆయుధంగా ఉపయోగించరాదన్నారు. అమెరికాలోని ఒమాహాలో శనివారం జరిగిన బెర్క్‌షైర్ హ్యాత్‌వే వాటాదారుల వార్షిక సమావేశంలో బఫెట్ తొలిసారిగా ట్రంప్ సుంకాల విధానంపై స్పందించారు.

ఫాంగేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	విజయవాడ	142
వరంగల్	140	గుంటూరు	140
కరీంనగర్	140	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	140	చిత్తూరు	107
కర్నూలు	140	నెల్లూరు	112
విశాఖపట్నం	141	అనంతపురం	112
గోదావరి	142		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,500 ▼	87,550 ▼	1,09,000 ▲
విజయవాడ	96,500 ▼	90,500 ▼	96,000 ▼
విశాఖపట్నం	95,510 ▼	87,550 ▼	1,09,000 ▲
రాజమండ్రి	95,510 ▼	87,550 ▼	96,200 ▼
ప్రొద్దుటూరు	96,000 ▲	88,320 ▲	96,200 ▼
ముంబై	93,954 ▼	86,062 ▼	94,125 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	455	విజయవాడ	480
వరంగల్	457	గోదావరి	460
చిత్తూరు	533	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 60	











'లోర్వెన్ ఏఐ' స్టూడియోను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లాలి

దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

"మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త సాంకేతికతను సినీ పరిశ్రమకు పరిచయం చేయాలనే దృఢ సంకల్పంతో దిల్‌రాజు 'లోర్వెన్ ఏఐ' స్టూడియోను లాంచ్ చేయడం అభినందనీయం. దీనిని నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను" అని అన్నారు తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. నిర్మాత దిల్‌రాజు లాంచ్ చేసిన 'లోర్వెన్ ఏఐ' స్టూడియోను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఈ టెక్నాలజీని మూవీతో బ్లెండ్ చేయడమనేది వినోద రంగంలో సరికొత్త అడుగు. హాలీవుడ్‌కి దీటుగా హైదరాబాద్ ఎదుగుతోంది. కొత్త సాంకేతిక వల్ల ఉద్యోగావకాశాలు పుష్కలంగా లభ్యమవుతాయి" అని అన్నారు. "సినిమాల్లో ఈ సాంకేతికతని ఉపయోగించడం ద్వారా ముఖ్యంగా మూడు సౌలభ్యాలు ఉన్నాయి. మొదటిది విజయావకాశాల్ని పెంచుకోవచ్చు. రెండోది, ప్రీ ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్‌లో సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. మూడోది, దీని వల్ల దర్శకులకు సమయం, నిర్మాతలకి డబ్బు మిగులుతుంది. త్వరలోనే అందరికీ అందుబాటులోకి వచ్చేలా అభివృద్ధి చేస్తున్నాం" అని నిర్మాత దిల్‌రాజు చెప్పారు. "దిల్‌రాజు ప్రతీ విషయంలో ముందంజలో ఉంటారు. ఇప్పుడు అదే క్రమంలో పరిశ్రమలోకి ఏఐను ప్రవేశపెట్టడంలో ముందడుగు వేశారు" అని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. "ఈ కంపెనీ పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను" అని దర్శకుడు రాఘవేంద్రరావు అన్నారు. "ఈ సాంకేతికత గురించి దిల్‌రాజు ఇచ్చిన ప్రజంటేషన్ చూశాను. అదిరిపోయింది" అని దర్శకుడు సుకుమార్ పేర్కొన్నారు. "ఈ ప్రాజెక్ట్‌లో దిల్‌రాజు ప్యాషన్ కనిపిస్తోంది. ఈ సాంకేతికతను ఉపయోగించడానికి ఆతృతగా ఎదురుచూస్తున్నాను" అని దర్శకుడు నాగ్ అశ్విన్ చెప్పారు. "ఇది సినీ పరిశ్రమకు ఎంతో ఉపయోగపడుతుంది" అని మరో దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. "ఈ కంపెనీ పెద్ద విజయవంతం కావాలని కోరుకుంటున్నాను" అని దర్శకుడు బాబీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి అధ్యక్షుడు కే.ఎల్.దామోదర ప్రసాద్, నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, సాహు గారపాటి, దర్శకులు వి.వి. వినాయక్, మోహన్‌కృష్ణ ఇంద్రగంటి, వంశీ పైడిపల్లి తదితరులు పాల్గొన్నారు.

అంచనాలకు మించిన ఆదరణ

శైలేష్ కొలను



"హిట్ 3' చిత్రానికి మా అంచనాలకు మించి ప్రేక్షకాదరణ దక్కుతోంది. మేం ఊహించిన దానికి భిన్నంగా మహిళా ప్రేక్షకులకు అర్జున్‌సర్కార్ పాత్ర అమితంగా నచ్చడం ఆశ్చర్యపరిచింది. బహుశా నాని పాత్ర చిత్రణ విభిన్నంగా ఉండడం అందుకు కారణం కావొచ్చు' అని దర్శకుడు శైలేష్ కొలను అన్నారు. ఆయన దర్శకత్వంలో నాని కథానాయకుడిగా నటించిన 'హిట్ 3' చిత్రం ఇటీవలే విడుదలై ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా శైలేష్ కొలను మీడియాతో మాట్లాడారు. 'అర్జున్ సర్కార్ పాత్ర మీద నానికీ, నాకూ మొదట్నుంచి గట్టి నమ్మకం ఉంది. దానికి తగ్గట్లే ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉంది. మాస్ ఛాయలున్న పాత్ర కావడంతో పాటు ఆయన వినోదం పండించిన తీరు ప్రేక్షకులను మెప్పిస్తోంది. 'హిట్ 3'లో ఒక నేషనల్ లెవల్ క్రైమ్‌ను చూపించాం. ప్రతి సన్నివేశంలో ప్రేక్షకులు విజిల్ కొట్టాలనే ఉద్దేశంతో కథ రాసుకున్నాను. ఆ లక్ష్యం నెరవేరిందనే అనుకుంటున్నాను. మిక్కీ జే. మేయర్ నేపథ్య సంగీతం, సముద్రఖని, రావు రమేశ్, శ్రీనిధి శెట్టి నటన సినిమా విజయానికి కీలకంగా నిలిచాయి. ఈ సినిమాకు నాని నిర్మాత కావడం నాకు కలిసొచ్చింది. అనుకున్న విధంగా తెరకెక్కించే స్వేచ్ఛనిచ్చారు. నా తదుపరి చిత్రం రొమాంటిక్ కామెడీ జానర్‌లో చేయాలనుకుంటున్నాను' అని శైలేష్ చెప్పారు.

మెప్పించే ప్రేమకథా చిత్రం



'మల్లేశం, 8ఏ.ఎం. మెట్రో' లాంటి విభిన్న చిత్రాలను రూపొందించిన దర్శకుడు రాజ్ ఆర్. ఆయన దర్శకత్వంలో వస్తోన్న తాజా చిత్రం '23'. నిజ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రాలతో తన ప్రతిభను నిరూపించుకున్న రాజ్ ఆర్ మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. వెంకట్ సిద్దారెడ్డి సహ నిర్మాతగా స్టూడియో 99 పతాకంపై నిర్మించారు. తేజ, తన్మయి జంటగా నటించగా, ఝాన్సీ, తాగుబోతు రమేశ్, ప్రణీత్ కీలకపాత్రలు పోషించారు. చిత్రబృందం శనివారం విడుదల తేదీని ప్రకటించింది. ఈ నెల 16న '23' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రం ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మార్క్ కే రాబిన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి.

అంతకు మించిన ఆనందం మరొకటి లేదు

ఇవానా

"లవ్‌టుడే' సినిమాలో నా పాత్ర పేరు బుజ్జి కన్నా. ప్రేక్షకులకు ఆ పాత్ర బాగా నచ్చింది. తెలుగు ప్రేక్షకులు ఇప్పటికీ నన్ను 'బుజ్జి కన్నా' అంటూ పిలుస్తున్నారు. ఒక నటికి తన పాత్ర పేరుతో గుర్తింపు దక్కడం కంటే ఆనందం మరొకటి ఉండదు' అని హీరోయిన్ ఇవానా అన్నారు. శ్రీవిష్ణు కథానాయకుడిగా కార్తీక్‌రాజు దర్శకత్వంలో తెరకెక్కిన 'సింగిల్' చిత్రంలో ఆమె కథానాయికగా నటించారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఇవానా సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "సింగిల్' కథానాయికగా నాకు తొలి తెలుగు చిత్రం. గీతా ఆర్ట్స్ లాంటి పేరున్న సంస్థలో అవకాశం రావడాన్ని శుభారంభంగా భావిస్తున్నాను. ఇదొక వినోదాత్మక చిత్రం. కుటుంబంతో కలసి థియేటర్‌లో ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఈ సినిమాలో హరిణి అనే డాన్సర్‌గా కనిపిస్తాను. సరదాగా ఉండే యువతిగా, కుటుంబం కోసం ఏం చేయడానికైనా వెనుకాడని ధైర్యవంతురాలిగా భిన్న భావోద్వేగాలను ఆవిష్కరించేలా నా పాత్ర ఉంటుంది. వెన్నెల కిశోర్, కేతిక శర్మతో పనిచేయడం సరదాగా అనిపించింది. శ్రీవిష్ణు గారు ఫోకస్ అంతా పని పైనే ఉంటుంది. తెలుగు నేర్చుకోవడంలో ఆయన నాకు సాయం చేశారు. భవిష్యత్తులో నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రలు మరిన్ని చేయాలనేది నా కోరిక' అని ఇవానా చెప్పారు.





18 ఏళ్ల తర్వాత మళ్లీ

పద్దెనిమిది ఏళ్ల తర్వాత అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ కలసి బాలీవుడ్ స్క్రీన్‌పై మెరవబోతున్నారు. 2016లో మోహన్‌లాల్ కథానాయకుడిగా ప్రియదర్శన్ తెరెక్కించిన మలయాళ చిత్రం 'ఒప్పం'. ఇప్పుడు ఇదే చిత్రాన్ని అక్షయ్, సైఫ్ ప్రధాన పాత్రలుగా ప్రియదర్శన్ హిందీలో రిమేక్ చేస్తున్నారు. ఈ కథ గురించి చెప్పగానే అక్షయ్ కుమార్ వెంటనే ఒకే చేశారట. అటు సైఫ్ అలీఖాన్ కూడా ప్రియదర్శన్ మూవీలో అవకాశం రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సైఫ్ గుడ్డివాని పాత్రలో కనిపించనున్నారు. ఆగస్టులో ఈ ప్రాజెక్ట పట్టాలెక్కనుందని సైఫ్ బాలీవుడ్ మీడియాతో చెప్పారు. కాగా, గతంలో అక్షయ్ కుమార్ హీరోగా ప్రియదర్శన్ తెరకెక్కించిన హెరాపెరి, హంగామా, గరమ్ మసాలా, భూల్ భులయ్యా చిత్రాలు బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టాయి. ప్రస్తుతం వీరిద్దరి కాంబోలో 'భూత్ బంగ్లా' అనే హారర్ కామెడీ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే అక్షయ్ కుమార్- ప్రియదర్శన్ కాంబినేషన్‌లో మరో ప్రాజెక్టు ఖరారు కావడం విశేషం.

చిత్రజ్యోతి

SINCE 1965

ప్రభాస్‌తో మరోసారి?



ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో బాలీవుడ్ భామ దీపికా పదుకోన్ ఓ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమె మరోసారి ప్రభాస్ చిత్రంలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా రూపొందించే 'స్పిరిట్' చిత్రంలో ప్రభాస్ హీరోయిన్‌గా దీపిక నటించనున్నారు. నిజానికి 'స్పిరిట్' చిత్రం గత ఏడాదే ప్రారంభం కావాలి. ఆ సమయంలో హీరోయిన్ పాత్ర కోసం దీపికను సందీప్ సంప్రదించారు. కానీ అప్పుడు ఆమె గర్భవతి కావడంతో ఆ చిత్రంలో నటించలేనని చెప్పేశారు. ఇప్పుడు 'స్పిరిట్' షూటింగ్ షెడ్యూల్ డిలే కావడంతో సందీప్ మరోసారి దీపికను సంప్రదించారనీ, ఆ సినిమా కథ, అందులో హీరోయిన్ పాత్ర నచ్చి నటించడానికి వెంటనే అంగీకరించారనీ బీటౌన్ టాక్. ఇటీవలే షారుక్ ఖాన్ 'కింగ్' చిత్రంలో నటించడానికి దీపిక అంగీకరించారు. తాజాగా 'స్పిరిట్' చిత్రం కూడా ఒప్పుకోవడంతో ఈ ఏడాది చివరి వరకూ ఆమె డేట్స్ ఖాళీ లేనట్లే. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తల ప్రకారం 'స్పిరిట్' చిత్రం ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రారంభించి. 2027 ఫస్ట్ హాఫ్‌లో విడుదల చేయాలని నిర్మాత భూషణ్‌కుమార్ ప్లాన్. ఈ చిత్రం షూటింగ్ ఎప్పుడు ప్రారంభమయ్యేదీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అలాగే హీరోయిన్‌గా దీపికను హీరోయిన్‌గా ఎంపిక చేసిన విషయాన్ని కూడా.

ఎవరినీ బాధపెట్టడం నా ఉద్దేశం కాదు

- విజయ్ దేవరకొండ



ఇటీవల నిర్వహించిన 'రెట్రో' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ దేవరకొండ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన విజయ్ ఎవరినీ బాధ పెట్టడం తన ఉద్దేశం కాదని వివరణ ఇచ్చారు. 'నా మాటలు కొందరిని బాధపెట్టాయనే విషయం నా దృష్టికి వచ్చింది. ట్రైబ్ అని నేను వాడిన పదం వెనుక ఉద్దేశం భూమ్మీద తొలినాళ్లలో మనమంతా తెగలుగా, జాతులుగా ఉన్నామని చెప్పడమే. కానీ ఎవరినీ బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. షెడ్యూల్డ్ ట్రైబ్స్ అంటే నాకు ఎంతో గౌరవం, ప్రేమ. మన సమాజంలో ఐక్యత ఉండాలి. ఒక్కటిగా మనమంతా ముందుకు వెళ్లాలనే చెప్పాను. దేశమంతా ఒక్కటిగా నిలబడాలని మాట్లాడాను. నా మాటలతో ఎవరైనా మనస్థాపం చెంది ఉంటే చింతిస్తున్నాను' అని పేర్కొన్నారు.

జన్మజన్మల బంధం



సమంత నిర్మాతగా మారి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందించిన తొలి చిత్రం 'శుభం'. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రీగుల తెరకెక్కించిన ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శాలినీ కొండెపూడి ప్రధాన పాత్రలు పోషించారు. సమంత ఓ ప్రత్యేక పాత్రలో నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌గా ఓ ప్రమోషనల్ సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. 'జన్మజన్మల బంధం' అంటూ సాగే ఈ పాటలో ప్రధాన తారాగణంతో పాటు సమంత కూడా తళుక్కున మెరిశారు. మే 9న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీన్



మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి

నాగపూర్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీన్‌తో సినిమా థియేటర్‌ను నిర్మించనున్నారు. 'వేవ్స్' సమ్మిట్‌లో పాల్గొన్న తెలుగు నిర్మాతలు అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఈ సందర్భంగా అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ 'వరల్డ్ బిగ్గెస్ట్ సినిమా స్క్రీన్ నిర్మించే అవకాశం మాకు దక్కడం గర్వంగా ఉంది. భారత వినోద రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. ఆ దిశగా మా ప్రయత్నం మొదలైంది' అని అన్నారు. 'సినిమాను మరింత గొప్పగా తీర్చిదిద్దడమే మా యూవీ క్రియేషన్స్ లక్ష్యం. గొప్ప సినిమాలు తీయడం కాదు. అద్భుతమైన థియేటర్లు నిర్మించడమే మా ధ్యేయం' అని మరో నిర్మాత విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు.

అందగత్తెలు వచ్చేస్తున్నారు!



సంప్రదాయ నృత్యాలతో మిస్ కెనడా క్యాథరిన్ మోరిసన్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో ఆహ్వానం పలుకుతున్న కళాకారులు

- శంషాబాద్‌లో మిస్ కెనడా మోరిసన్‌కు సంప్రదాయ స్వాగతం పలికిన అధికారులు
- నేడు, రేపు.. 120 దేశాల పోటీదారుల రాక



కెనడా నుంచి వచ్చిన క్యాథరన్ మోరిసన్‌కు బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న దృశ్యం

హైదరాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల సుందరీమణులు హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. కెనడా నుంచి శనివారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మిస్ కెనడా క్యాథరన్ మోరిసన్‌కు రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు ఘనస్వాగతం పలికారు. యువతులు సంప్రదాయ నృత్యాలు చేస్తుండగా.. తెలంగాణ సంప్రదాయం ప్రకారం హారతి పట్టి, నుదుటన బొట్టుపెట్టి, మెడలో పూలమాల వేసి ఆమెను ఆహ్వానించారు. అనంతరం ఆమెను ఆతిథ్యం ఇచ్చే హోటల్‌కు తీసుకువెళ్లారు. ఇప్పటికే మిస్‌వరల్డ్ సంస్థ సీఈవో, ఛైర్‌పర్సన్ మిస్ జూలియా ఎవెలిన్ మోర్లీ, మిస్‌వరల్డ్ ప్రతినిధి మిస్ కెర్రి హైదరాబాద్ చేరుకోగా.. ఆది, సోమవారాల్లో 120 దేశాల నుంచి పోటీదారులు, ప్రతినిధులు రానున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ -2025 పోటీలు జరగనున్న విషయం తెలిసిందే. ఇందులో 120 దేశాల ప్రతినిధులు పాల్గొనడమే కాకుండా 150పైగా దేశాల్లో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఈ వేదిక ద్వారా మెడికల్ టూరిజంపై ప్రచారం చేయడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా హెల్త్ టూరిస్టులను ఆకర్షించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.

నాలుగు రోజులు ఎండ-వాన

- రాష్ట్రంలో విభిన్న వాతావరణం
- పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు
- మిగిలిన ప్రాంతాల్లో ఎండతీవ్రత..
- రేపు, ఎల్లుండి ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల వానలు



అమరావతి, విశాఖపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా విదర్భ వరకూ, రాజస్థాన్ నుంచి మధ్యప్రదేశ్, విదర్భ, కర్ణాటక మీదుగా తమిళనాడు వరకూ వేర్వేరుగా ఉపరితల ద్రోణులు విస్తరించాయి. దీనికితోడు సముద్రం నుంచి భారీగా తేమగాలులు భూ ఉపరితలంపైకి వీచాయి. వీటన్నింటి ప్రభావంతో శనివారం రాష్ట్రంలో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. కాకినాడలో 49.25, చిత్తూరు జిల్లా ఏటవాకిలిలో 48.5, అనంతపురం జిల్లా సొల్లాపురం, అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో 45 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో ఎండతీవ్రత కొనసాగింది. సాధారణం కంటే ఒకటి నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 42.8, ప్రకాశం జిల్లా బోట్లగూడూరులో 41.5, పల్నాడు జిల్లా క్రోసూరులో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సోమ, మంగళవారాల్లో ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, రాష్ట్రంలో మరో నాలుగు రోజులు ఎండావానలతో భిన్న వాతావరణ పరిస్థితులు ఉంటాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. చాలా చోట్ల పగలు ఎండ తీవ్రత, వడగాడ్పులు, కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. 41.5-43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ, మంగళ, బుధవారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వివరించింది.

నేడే నీట్

పాత పద్ధతిలోనే పరీక్ష

హైదరాబాద్, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత పరీక్ష (నీట్) ఆదివారం జరగనుంది. రెండు షిఫ్టుల్లో.. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు రెండో షిఫ్టులో పరీక్ష నిర్వహిస్తారు. గత ఏడాది ఉత్తరాది రాష్ట్రాల్లో నీట్ ప్రశ్నపత్రాలు లీకైన నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం ఈసారి ప్రభుత్వ కేంద్రాల్లో మాత్రమే పరీక్ష నిర్వహిస్తోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. పరీక్షా కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలు, మంచినీరు, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. కాగా, కోవిడ్‌కు ముందు నీట్‌లో.. ఒక్కో సబ్జెక్టు నుంచి 45 ప్రశ్నల చొప్పున నాలుగు సబ్జెక్టుల (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ) నుంచి మొత్తం 180 ప్రశ్నలు ఇచ్చేవారు. అన్నింటికీ జవాబివ్వాలి. కోవిడ్ తర్వాత మార్పులు చేశారు. ఒక్కో సబ్జెక్టు నుంచి 50 ప్రశ్నలు ఇస్తున్నారు. ఇందులో సెక్షన్-ఏ కింద ఉండే 35 ప్రశ్నల్లో అన్నింటికీ జవాబు రాయాలి. సెక్షన్-బీలోని 15 ప్రశ్నల్లో ఏవైనా పదింటికి జవాబు ఇవ్వాలి. అంటే మొత్తంగా 200 ప్రశ్నల్లో.. 180 ప్రశ్నలకు జవాబులు రాయాలి. కానీ ఈ ఏడాది నుంచి తిరిగి పాత విధానాన్ని అమలు చేస్తున్నారు. మొత్తం 180 ప్రశ్నలు ఇస్తే.. అన్నింటికీ జవాబులు రాయాల్సి ఉంటుంది.

26 మంది ఎంబీబీఎస్ విద్యార్థుల సస్పెన్షన్

న్యూఢిల్లీ, మే 3: దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన నీట్-యూజీ 2024 పేపర్ లీక్ వ్యవహారంలో నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) చర్యలు తీసుకుంది. లీకేజీతో సంబంధం ఉన్నట్లు గుర్తించిన 26 మంది ఎంబీబీఎస్ విద్యార్థులను సస్పెండ్ చేయడంతో పాటు రాబోయే విద్యా సంవత్సరానికి 14 మంది అభ్యర్థుల అడ్మిషన్లు రద్దు చేయాలని ఆదేశించింది. విచారణ పెండింగ్‌లో ఉన్న 215 మంది అభ్యర్థుల అడ్మిషన్లను కూడా కమిషన్ నిలిపివేసింది. అలాగే నీట్-యూజీ పరీక్షకు హాజరు కాకుండా 42 మంది అభ్యర్థులపై మూడేళ్ల పాటు (2024, 2025, 2026), తొమ్మిది మందిపై రెండేళ్ల పాటు (2025, 2026) నిషేధం విధించింది. కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ నివేదిక ఆధారంగా సంబంధిత వైద్య కళాశాలలు, సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. నీట్-యూజీ 2025 పరీక్షలు మే 4న జరగనున్న నేపథ్యంలో ఎన్ఎంసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

నీట్ కేంద్రాల్లో మాక్ డ్రిల్

నీట్-యూజీ 2025ను సజావుగా నిర్వహించేందుకు శనివారం అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ విద్యాశాఖ అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. సెల్‌ఫోన్ జామర్ల పనితీరు, సిబ్బంది లభ్యత, బయోమెట్రిక్ ఆథంటికేషన్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. దేశవ్యాప్తంగా 500 నగరాల్లోని 5,453 కేంద్రాల్లో ఆదివారం ఈ పరీక్ష జరగనుంది. ఈ ఏడాది పరీక్షకు 22.7 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష రోజున జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయుల్లో మూడంచెల పర్యవేక్షణ ఉంటుందని విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. పరీక్షకు ముందు, తర్వాత, పరీక్ష జరుగుతున్నప్పుడు అభ్యర్థులెవరైనా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తిస్తే... ఎన్‌టీఏ నిర్వహించే పరీక్షలకు హాజరుకాకుండా వారిపై మూడేళ్ల వరకూ నిషేధం విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



జీవితం ఘనం.. జీవనం దైన్యం!





ఇసుక నేలలో నలు వైపులా నాలుగు పుల్లలు నాటి... వాటికి తాళ్లు కట్టి... పాత చీరలతో పైకప్పు వేసుకుని... దానినే ఇల్లు అని పిలుచుకుంటూ అందులోనే రోజులు గడిపేస్తుంటారు వీరు. ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ... చలికి వణుకుతూ ఈ గుడారాల్లోనే జీవితాలు వెళ్లదీస్తుంటారు. వీరే సంచారజీవులు. ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం ఘాట్ వద్ద ఇసుక నేలలో, కృష్ణా నది ఒడ్డున కొన్నాళ్లుగా ఇలా గుడారాలు వేసుకుని వీరు జీవిస్తున్నారు. తాగడానికి, ఇతర అవసరాలకు కృష్ణా నది నీళ్లను తెచ్చుకుని వాడుకుంటుంటారు. - విజయవాడ

రష్యా విక్టరీ డే అతిథులకు ఉక్రెయిన్ హెచ్చరిక

మాస్కో, మే 3: రష్యాలో ఈనెల 9న జరగనున్న విక్టరీ-డే పరేడ్‌కు హాజరయ్యే విదేశీ ప్రముఖుల భద్రతకు హామీ ఇవ్వలేమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరించారు. విక్టరీ-డే సందర్భంగా రష్యా ప్రతిపాదించిన 3 రోజుల కాల్పుల విరమణను కూడా ఆయన తిరస్కరించారు. "రష్యన్ భూభాగంలో జరిగే దానికి మేం బాధ్యత వహించలేం. మీ భద్రతపై హామీ ఇవ్వలేం" అని విదేశీ నాయకులను ఉద్దేశించి జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయం సాధించిన రష్యా 80వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ వేడుకలకు మోదీ, జిన్‌పింగ్ సహా 20కంటే ఎక్కువ మిత్ర దేశాల నాయకులను రష్యా ఆహ్వానించింది. అయితే, పహల్గాం ఘటన నేపథ్యంలో ఈ పరేడ్‌కు మోదీకి బదులుగా రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ హాజరుకానున్నారు.

ఇంట్లో వాడే వస్తువుల్లో హంతక కెమికల్!

న్యూఢిల్లీ, మే 3: మనం రోజూ వాడే వస్తువుల్లో ఉండే ఓ కెమికల్ ఏటా లక్షల మంది ప్రాణాలను హరిస్తోంది. మనకు తెలియకుండానే దాన్ని మన శరీరంలోకి పంపించి మన ప్రాణాలను మనమే తీసుకుంటున్నాం. డీ-2-ఎథిలిక్సైల్ థాలెట్ (డీఈహెచ్‌పీ) అనే ఈ కెమికల్‌ను ప్లాస్టిక్ నుంచి మేకప్ సామగ్రి వరకు చాలా వాటిలో వినియోగిస్తారు. బొమ్మలు, దుస్తులు, షాంపూలు, ఆహారాన్ని నిల్వ చేసే పాత్రలు ఇలా ప్రతిరోజూ వాడే వస్తువుల్లో ఈ కెమికల్ ఉంటుంది. ఇది మన హార్మోన్లకు హాని కలిగిస్తుంది. డీఈహెచ్‌పీ నేరుగా మరణానికి కారణం కాకపోయినా గుండెజబ్బులకు కారణమవుతున్నట్లు లాన్సెట్ పరిశోధకులు తాజాగా గుర్తించారు. 55 నుంచి 64 ఏళ్ల వయస్సు మధ్య చనిపోయిన సుమారు 1,03,587 మంది నమూనాలను పరిశీలించగా అత్యధిక మందిలో డీఈహెచ్‌పీ కెమికల్ స్థాయి ఎక్కువగా ఉన్నట్లు తేలిందని తెలిపారు. దీని వల్లనే వారికి గుండెజబ్బులు వచ్చి మరణించినట్లు గుర్తించారు. డీఈహెచ్‌పీ ప్రభావంతో భారత్‌లో ఏటా సుమారు 3,56,238 మంది మరణిస్తున్నారని తెలిపారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు

శ్రీవారి సేవలో జస్టిస్ వెంకటేశ్వర్లు

తిరుమల, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, సినీ గాయనీ ఉషా ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి ఆలయం వద్ద విజయసాయిరెడ్డి దంపతులు

అనుమతిస్తే పాక్‌లో మానవబాంబుగా పేలుతా



» మంత్రి జమీర్ అహ్మద్ వ్యాఖ్యలు

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా అనుమతిస్తే ఆత్మాహుతి బాంబుగా మారి పాకిస్థాన్‌లో ఉగ్రవాదులను పేల్చేస్తానని కర్ణాటక వక్ఫ్, వసతి శాఖల మంత్రి జమీర్ అహ్మద్ అన్నారు. మీడియా ఎదుట శుక్రవారం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. 'మేము భారతీయులం. హిందూస్థానీలం. పాకిస్థాన్‌తో మాకు ఎలాంటి సంబంధాలూ లేవు. కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే నా ఒంటికి బాంబును కట్టుకుని యుద్ధం కోసం పాకిస్థాన్ వెళ్లేందుకు సిద్ధం' అని వ్యాఖ్యానించారు. ఇమ్రాన్ ఖాన్, పాకిస్థాన్ భారత్‌కు ఎప్పుడూ శత్రువులేనని జమీర్ అహ్మద్ పేర్కొన్నారు. పహల్గాంలో దాడి నీచమైనదంటూ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సమయంలో భారతీయులంతా సమైక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పాక్ సైన్యంపై విరుచుకుపడ్డ బలోచ్ 'డెత్ స్క్వాడ్'

క్వెట్టా, మే 3: పహల్గాం దుర్ఘటన అనంతరం భారత సరిహద్దులో సవాళ్లను ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌కు బలోచిస్థాన్‌లో మరో దెబ్బ తగిలింది. బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ఏకంగా పాక్ సైన్యంపై విరుచుకుపడింది. బీఎల్‌ఏకు చెందిన 'డెత్ స్క్వాడ్' కలత్ జిల్లాలోని మంగోచెర్ నగరాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలను కూడా తన కంట్రోల్‌లో ఉంచుకుంది. బలోచ్ తిరుగుబాటుదార్లు ఆర్మీ క్యాంపుపై దాడి చేసి, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పాక్ తన సైన్యాన్ని భారత్ సరిహద్దుకు తరలిస్తున్న తరుణంలో బలూచ్‌లో ఎదురుదెబ్బ తగిలింది. గతనెల 26న జరిగిన దాడిలో 10 మంది పాక్ సైనికులు మరణించడం గమనార్హం.

కన్నడ పాట పాడాలన్న విద్యార్థిపై సోనూ అసహనం

» ఇలాంటి డిమాండ్లతోనే పహల్గాం దాడి జరిగిందని వ్యాఖ్య

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): కన్నడ పాట పాడమని ఓ అభిమాని కోరడంతో అసహనానికి గురైన గాయకుడు సోను నిగమ్, అతని డిమాండ్‌ను పహల్గాం దాడితో పోల్చాడు. దీంతో సోనునిగమ్‌పై కన్నడ సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. బెంగళూరు నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో వారం క్రితం నిర్వహించిన కార్యక్రమంలో సోనునిగమ్ బృందం పాల్గొంది. అన్నీ హిందీ పాటలే పాడుతుండటంతో కన్నడ పాటలు పాడాలని ఓ అభిమాని కోరారు. దీంతో ఆగ్రహించిన సోను నిగమ్, 'కన్నడ.. కన్నడ..! ఇలాంటి డిమాండ్లతోనే పహల్గాం దాడి జరిగింది' అని అసంతృప్తి వ్యక్తం చేశారు. సోను నిగమ్‌ను కన్నడ సినిమా రంగం వెంటనే బ్యాన్ చేయాలని కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ డిమాండ్ చేశారు.

బీఎస్ఎఫ్ అదుపులో పాకిస్థానీ రేంజర్

న్యూఢిల్లీ, మే 3: సరిహద్దుల వద్ద విధులు నిర్వహించే పాకిస్థాన్‌కు చెందిన ఓ రేంజర్‌ను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకొంది. రాజస్థాన్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నట్టు శనివారం అధికార వర్గాలు తెలిపాయి. గత బుధవారం పొరపాటున సరిహద్దు దాటిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ పూర్ణం కుమార్ షాను పాకిస్థాన్ సైన్యం అదుపులోకి తీసుకొంది. అతడి సమాచారం ఏదీ ఇంకా వెల్లడి కాలేదు. ఎనిమిది రోజులుగా రెండు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఫలితం లేకపోయింది. దానికి ప్రతీకారంగానే పాక్ జవాన్‌ను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకొంది. ఇరు దేశాల సైనికులు పొరపాటున సరిహద్దులు దాటడం సర్వసాధారణం. మిలటరీ అధికారులు చర్చలు జరిపి వారిని విడిచిపెడుతుంటారు. కానీ పహల్గాం దుర్ఘటన కారణంగా పాకిస్థాన్ జాప్యం చేస్తుండడంతో బీఎస్ఎఫ్ కూడా అదే రీతిలో వ్యవహరించింది.

కొలంబో ఎయిర్‌పోర్టులో హైటెన్షన్

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం దాడి జరిపిన ఉగ్రవాదులు శ్రీలంక ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో పారిపోతున్నారన్న సమాచారంతో కొలంబో ఎయిర్‌పోర్టులో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సమాచారం భారత్‌నుంచి రావడంతో శ్రీలంక ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. చెన్నై నుంచి కొలంబోకు బయలుదేరిన ఈ విమానంలో ఆరుగురు ఉగ్రవాదులు ప్రయాణిస్తున్నట్టు భారత నిఘావర్గాలు అనుమానించాయి. వెంటనే శ్రీలంకను అప్రమత్తం చేశాయి. దీంతో కొలంబోలోని బండారునాయకే అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం మధ్యాహ్నం 11.59 నిమిషాలకు విమానం(యూఎల్122) ఆగిన వెంటనే అందులో తనిఖీలు జరిపారు. అయితే, విమానంలో ఉగ్రవాదుల జాడ కనిపించలేదు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోండి: రష్యా

న్యూఢిల్లీ, మే 3: భారతదేశం, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ భారత విదేశాంగమంత్రి జై శంకర్‌తో రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా 1972 సిమ్లా ఒప్పందం, 1999 లాహోర్ డిక్లరేషన్‌కు అనుగుణంగా ఇరు దేశాలు తమ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సెర్గీ లావ్రోవ్, జై శంకర్‌కు సూచించినట్లు రష్యన్ ఫెడరేషన్ తెలిపింది. మరోవైపు, ఉగ్రవాదంపై కఠినచర్యలు తీసుకునేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉందని మోదీ పునరుద్ఘాటించారు. 4రోజుల పర్యటన కోసం గురువారం భారత్‌కు విచ్చేసిన అంగోలా అధ్యక్షుడు జోవో లౌరెంకోతో సంయుక్తంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

వాణిజ్యం బంద్!

(మొదటి పేజీ తరువాయి)

ఎగుమతి చేసే అన్నిరకాల ఉత్పత్తులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతి ఉన్నవైనా, ఎలాంటి అనుమతీ అవసరం లేని ఉత్పత్తులు అయినా ఈ నిషేధం వర్తిస్తుంది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు ఇది అమల్లో ఉంటుంది. ఈ నిషేధం నుంచి ఏదైనా మినహాయింపు కావాలంటే.. ప్రభుత్వం నుంచి ముందుగానే అనుమతులు తీసుకోవాలి.." అని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) స్పష్టం చేసింది. జాతీయ భద్రత, ప్రజాప్రయోజనం నిమిత్తం ఈ చర్యలు తీసుకుంటున్నామని, తక్షణమే ఈ నిర్ణయాలు అమల్లోకి వస్తాయని ప్రకటించింది. భారత్ నుంచి వచ్చే దిగుమతులను నిషేధిస్తూ పాకిస్థాన్ ఇప్పటికే ప్రకటించగా.. తాజాగా భారత్ నిర్ణయంతో ఇరు దేశాల మధ్య వాణిజ్యం పూర్తిగా నిలిపోయినట్లైంది.



పరోక్ష దిగుమతులపైనా నిషేధంతో దెబ్బ..

వాస్తవానికి పుల్వామా దాడి తర్వాత పాక్‌తో వాణిజ్యాన్ని భారత్ బాగా తగ్గించుకుంది. చాలా ఉత్పత్తులపై 200% కస్టమ్స్ సుంకాలు కూడా విధించింది. అయినా పళ్లు, నూనెగింజలు, ఔషధ మొక్కలు, బాదం, జీడిపప్పు వంటి డ్రైఫ్రూట్స్, రాగి ఖనిజం, గాజు ఉత్పత్తులు వంటి కొన్నిరకాల ఉత్పత్తుల దిగుమతులు మాత్రం నేరుగా జరుగుతున్నాయి. 2022-23లో భారత్ నుంచి పాక్‌కు సుమారు రూ.5,300 కోట్ల విలువైన ఎగుమతులు జరగ్గా.. పాక్ నుంచి దిగుమతుల విలువ సుమారు రూ.170 కోట్లు. అదే 2024-25 ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి పాక్‌కు ఎగుమతులు సుమారు రూ.3,700 కోట్లకు తగ్గిపోతే.. దిగుమతులు కేవలం రూ.4 కోట్లలోపే కావడం గమనార్హం. అయితే ఆంక్షలు, సుంకాల నుంచి తప్పించుకోవడానికి.. పాక్ నుంచి చాలా వరకు ఉత్పత్తులను దుబాయ్, సింగపూర్, శ్రీలంక, ఇండోనేషియా వంటి దేశాలకు తరలించి, ఆయా దేశాల ఉత్పత్తులుగా చూపుతూ భారత్‌కు పంపుతుంటారని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. ఇలా పరోక్షంగా వచ్చే పాక్ ఉత్పత్తుల విలువ సుమారు రూ.5 వేల కోట్ల వరకు ఉంటుందని అంటున్నాయి. ఇప్పుడు పాక్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపైనా నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించడంతో.. పాకిస్థాన్‌లోని పలు రకాల పరిశ్రమలకు గట్టి దెబ్బపడుతుందని అంటున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి భారత్-పాకిస్థాన్‌ల మధ్య వాణిజ్యం విలువ రూ.84 వేల కోట్లకు పైనే ఉంటుందని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. పాకిస్థాన్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష మార్గాల్లో.. రాగి, రాగి ఉత్పత్తులు, పండ్లు, డ్రైఫ్రూట్స్, పత్తి, హిమాలయాల రాతి ఉప్పు, సల్ఫర్, గ్రానైట్, కొన్నిరకాల ముడి ఖనిజాలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఉన్ని, గాజు వస్తువులు, తోలు ఉత్పత్తులు భారత్‌కు దిగుమతి అవుతున్నాయి. ఇక భారత్ నుంచి ముఖ్యంగా మందులు, వ్యవసాయ ఉత్పత్తులు, కాఫీ, టీ, మసాలాలు, నూనెగింజలు పాక్‌కు ఎగుమతి అవుతాయి.

పాక్ మీదుగా ఆ విమానాలు బంద్!

భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో.. యూరోపియన్ దేశాల విమానాలు పాకిస్థాన్ గగనతలం మీదుగా కాకుండా, చుట్టూ తిరిగి భారత్‌కు చేరుకుంటున్నాయి. ఇప్పటికే ఎయిర్ ఫ్రాన్స్, బ్రిటీష్ ఎయిర్‌వేస్, స్విస్ ఎయిర్‌వేస్ సంస్థలు తమ విమానాలను మళ్లించి నడుపుతుండగా.. తాజాగా లుఫ్తాన్సా (జర్మనీ), ఐటీఏ ఎయిర్‌వేస్ (ఇటలీ), లాట్ ఎయిర్‌వేస్ (పోలండ్) కూడా ఇదే నిర్ణయం తీసుకున్నాయి.

ప్రధాని మోదీతో ఒమర్ అబ్దుల్లా భేటీ

పహల్గాం ఘటన తర్వాత తొలిసారి భేటీ

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తొలిసారి భేటీ అయ్యారు. ప్రధాని నివాసంలో 30 నిమిషాలకు పైగా జరిగిన ఈ సమావేశంలో ఉగ్రదాడితో పాటు అనంతర పరిస్థితులపై చర్చించారు. ఉగ్రదాడి ఘటన జమ్మూకశ్మీర్ ప్రజల మనస్సులను తీవ్రంగా కలచివేసిందని, హింసకు రాష్ట్ర ప్రజలు వ్యతిరేకమని ఒమర్ ప్రధానికి తెలిపారు.



వాయు సేనలో మోగిన 'భేరి'

45 లాంచర్లు... 85 విధ్వంసక మిస్సైళ్లు

టెండర్లు పిలిచిన రక్షణ శాఖ

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్ర దాడి అనంతర పరిణామాల్లో తమపై ఎప్పుడైనా భారత్ యుద్ధానికి దిగొచ్చునని దాయాది దేశం పాకిస్థాన్ భయపడుతోంది. దానికి తగినట్టే మనదేశ సైనిక నిర్ణయాలు యుద్ధ సన్నద్ధతను సూచిస్తున్నాయి. తాజాగా కొత్త తరం ఆయుధశక్తితో వాయు సేనను బలోపేతం చేసుకునేందుకు భారత్ సిద్ధమైంది. భుజంపై పెట్టుకుని ప్రయోగించడానికి వీలైన 45 లాంచర్లు, 85 విస్సైళ్లు, 48 నైట్ విజన్ పరికరాల కొనుగోలుకు శనివారం టెండర్లు పిలిచింది. క్షణాల్లో శత్రు లక్ష్యాలను ఛేదించగలిగే విధ్వంసక శక్తి ఈ మిస్సైళ్లకు ఉంది. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా సాయుధశక్తిని బలోపేతం చేసుకునేందుకు ఈ నిర్ణయం తీసకున్నామని సైనికవర్గాలు చెబుతున్నాయి. అయితే, పాక్‌తో తథ్యం అని భావిస్తున్న యుద్ధానికి దీనిని సన్నాహంగా మిలిటరీ నిపుణులు అనుమానిస్తున్నారు. భూతలానికి అతి సమీపంనుంచి, స్వల్ప దూరం నుంచి దాడులు చేసే శత్రు యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లను ఈ కొత్త తరం వాయు రక్షణ వ్యవస్థ ((వీఎస్‌హెచ్‌ఓఆర్‌ఏడీఎస్) కనురెప్పపాటులో నేలకూల్చగలదు. భూతలంపై పోరాడే సైన్యానికి రక్షణ కవచంగా ఉంటుంది. "గగనతలదాడుల నుంచి కాపాడే విధ్వంసక, రక్షణ వాయు వ్యవస్థ మనకు కావాలి. ఈ వ్యవస్థ ఇన్‌ఫ్రా రెడ్ హోమింగ్ (ఐఆర్) టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. ఫైర్ అండ్ ఫర్గెట్ తరహా మిస్సైల్ వ్యవస్థ ఇది" అని టెండర్ నోటీసులో (ఆసక్తి వ్యక్తీకరణ) రక్షణ శాఖ తెలిపింది. ఈ మిస్సైళ్ల రేంజ్ ఆరువేల మీటర్లకు విస్తరించి ఉంటుంది.

సింధు జలాలు మళ్లించే ఏ నిర్మాణమైనా ధ్వంసం చేస్తాం!

» పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

» 450 కి.మీ బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిన పాక్



న్యూఢిల్లీ, మే 3: సింధు నది నీటిని మళ్లించేందుకు భారత్ నిర్మించే ఏ ప్రాజెక్టునైనా కూల్చివేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం ప్రకారం తమ దేశానికి నది నీటిలో వాటా ఉందన్నారు. పాకిస్థాన్ నీటిని మళ్లించే ఏ ప్రయత్నాన్నైనా దురాక్రమణగా పరిగణిస్తామని పాక్ మంత్రి వ్యాఖ్యానించారు. సింధు నది పరివాహక ప్రాంతంలో భారత్ డ్యామ్‌లు నిర్మించదలిస్తే పాకిస్థాన్ ఏ విధంగా స్పందిస్తుందని ఓ ఇంటర్వ్యూలో అగిడిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. మరోవైపు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ శనివారం 450 కిలోమీటర్ల పరిధి కలిగిన ఉపరితలం-ఉపరితలం బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. 'ఎక్సర్‌సైజ్ ఇండస్' పేరుతో ఆ దేశం చేపట్టిన సైనిక విన్యాసాల్లో భాగంగా అబ్దాలి ఆయుధ వ్యవస్థగా పిలిచే ఈ క్షిపణి ప్రయోగం చేపట్టారు. 'బలగాల కార్యాచరణ సంసిద్ధతను నిర్ధారించే లక్ష్యం'తో ఈ పరీక్ష చేపట్టినట్లు పాక్ ఆర్మీ ఒక ప్రకటనలో పేర్కొంది.

పాకిస్థాన్ ఓ విఫల దేశం

భారత్‌ను ప్రశాంతంగా ఉండనివ్వదు: ఒవైసీ



కిసాన్‌గంజ్, మే 3: పాకిస్థాన్ ఓ విఫల దేశమని, భారత్‌ను ఎప్పటికీ ప్రశాంతంగా ఉండనివ్వదని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పాకిస్థాన్‌పై కేంద్ర ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బిహార్‌లోని కిసాన్‌గంజ్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన అసదుద్దీన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ముస్లిం వర్గాల్లో శాంతి నెలకొల్పలేని, పొరుగు దేశాలైన ఇరాన్, ఆఫ్ఘానిస్థాన్‌తో సత్సంబంధాలు నెరపలేని పాకిస్థాన్ ఓ విఫల దేశమని ఒవైసీ అన్నారు. పాకిస్థాన్ కంటే భారత్ ఎప్పటికీ బలమైన దేశమేనని పేర్కొన్నారు. భారత్‌లో నివసిస్తున్న ముస్లింలు 1947లోనే జిన్నాను తిరస్కరించారని స్పష్టం చేశారు.

నావికాదళం యుద్ధానికి సిద్ధం!

అరేబియా సముద్రంలో లైవ్ ఫైరింగ్ డ్రిల్

న్యూఢిల్లీ, మే 3: పహల్గాం ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో... యుద్ధ సన్నద్ధతను పరిశీలించేందుకు భారత నావికాదళం అరేబియా సముద్రంలో విన్యాసాలు చేపట్టింది. సాధారణ డ్రిల్ తరహాలో కాకుండా.. యుద్ధంలో ఉన్నట్టుగానే లక్ష్యాలపై అసలైన ఆయుధాలను ప్రయోగించి, ప్రత్యక్షంగా (లైవ్ ఫైరింగ్ డ్రిల్) పరిశీలించనుంది. ఆయుధాల సామర్థ్యం, కచ్చితత్వాన్ని పరీక్షించడంతోపాటు దాడి సమయంలో వ్యవహరించాల్సిన తీరు, వ్యూహాల రూపకల్పనకు ఈ డ్రిల్ తోడ్పడుతుందని రక్షణశాఖ వర్గాలు చెబుతున్నాయి. శనివారమే ప్రారంభమైన ఈ లైవ్ డ్రిల్ బుధవారం (7వ తేదీ) వరకు కొనసాగనుంది. అరేబియా సముద్రంలో నేవీ విన్యాసాల నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాంతం మీదుగా ప్రయాణించే వాణిజ్య నౌకలకు నావిగేషన్ హెచ్చరికలను జారీ చేసింది. మరోవైపు.. నావికాదళం ప్రధానాధికారి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి శనివారం నేవీ లైవ్ డ్రిల్ ప్రారంభం కావడానికి ముందే ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. సుమారు గంట పాటు జరిగిన ఈ సమావేశంలో నావికాదళం సన్నద్ధత, అరేబియా సముద్రంలో లైవ్ డ్రిల్‌కు సంబంధించిన అంశాలను ప్రధానికి వివరించినట్టు తెలిసింది.



నౌకాదళం త్రిశూల వ్యూహం

సముద్రం ఉపరితలం(యుద్ధనౌక), సముద్రం లోపల(జలాంతర్గామి), సముద్ర జలాల పై నుంచి(హెలికాప్టర్) మూడు రకాలుగా దాడులకు సిద్ధమంటూ భారత నౌకాదళం శనివారం విడుదల చేసిన ఫొటో



గోవా ఆలయంలో తొక్కిసలాట

» ఆరుగురి మృతి, ఐదుగురు సీరియస్

» మృతుల్లో ఇద్దరు మహిళలు

» 80 మంది క్షతగాత్రులు.. ఆస్పత్రుల్లో చికిత్స

» ఘటనాస్థలిని సందర్శించిన సీఎం సావంత్

» సమగ్ర విచారణకు ఆదేశాలు.. ఫోన్‌లో ఆరా తీసిన మోదీ

పనాజీ, మే 3: ఉత్తర గోవాలోని శిర్గావ్‌లో ఉన్న శ్రీలైరాయ్ ఆలయంలో జాతర సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున భక్తులు నిప్పుల గుండంలో నడిచే సమయంలో తొక్కిసలాట చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సహా.. ఆరుగురు మృతిచెందారు. మరో 80 మంది గాయాలపాలయ్యారు. వీరిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గోవా ఆరోగ్య శాఖ మంత్రి విశ్వజీత్‌రాణె వెల్లడించారు. తీవ్ర గాయాలపాలైన వారిని గోవా వైద్య కళాశాల(జీఎంసీ)లో చేర్పించినట్లు డీజీపీ అలోక్ కుమార్ తెలిపారు. మిగతా వారిని వేర్వేరు ఆస్పత్రులు, కమ్యూనిటీ సెంటర్లలో చేర్పించామన్నారు. ఏటా మే నెలలో శ్రీలైరాయ్ దేవీ జాతర జరుగుతుంది. ఈ ఉత్సవాలకు గోవాతో పాటు.. మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. శుక్రవారం సాయంత్రం జాతర మొదలవ్వగా.. భక్తులు క్రమంగా శిర్గావ్ చేరుకోవడం ప్రారంభించారు. తెల్లవారుజామున 3 గంటలకు జరిగే అగ్నిగుండం వేడుక సమయానికి ఆ ప్రాంతంలో 40 వేల మంది వరకు భక్తులున్నట్లు పోలీసులు తెలిపారు. "అగ్నిగుండం సమీపంలో ఓ వైపు ఉన్న ఏటవాలుగా ప్రాంతంలో ఎక్కువ మంది నిలబడ్డారు. భక్తులు అగ్నిగుండంలో నడుస్తున్న సమయంలో.. అటువైపు రద్దీ పెరిగింది. ఈ క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. దాంతో.. ఏటవాలు ప్రాంతంలో ఉన్నవారిలో కొందరు కిందపడిపోయారు. తొక్కిసలాట కారణంగా ఇద్దరు మహిళలు సహా.. ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. క్షతగాత్రులను ఐదు అంబులెన్స్‌లలో సమీప ఆస్పత్రుల్లో చేర్పించాం" అని శిర్గావ్ పోలీసులు వివరించారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని, వారు జీఎంసీలో వెంటిలేటర్లపై చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా.. విద్యుత్తు తీగ తెగిపడి, విద్యుదాఘాతం కారణంగా తొక్కిసలాట జరిగిందని స్థానిక వార్తాసంస్థలు కథనాలను ప్రచురించాయి. పోలీసులు దీన్ని నిర్ధారించలేదు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా తీశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌కు ఫోన్ చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సీఎం సావంత్ ఉదయమే ఘటనాస్థలికి చేరుకున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరపాలని పోలీసు శాఖను ఆదేశించారు. కాగా.. విపక్ష ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్(ఏఐటీసీ), గోవా ఫార్వర్డ్ పార్టీ(జీఎఫ్‌పీ) ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి. జాతర సందర్భంగా వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, డ్రోన్లతో నిఘాను ముమ్మరం చేశారని పోలీసులు శుక్రవారమే ప్రకటించారని, ఇంతటి భద్రత ఉండగా ప్రమాదం ఎలా జరిగిందని నిలదీశాయి.

ఉక్రెయిన్ యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు: వాన్స్

మాస్కో, మే 3: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శనివారం వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌తో ఖనిజాల ఒప్పందం కుదుర్చుకున్న తరుణంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. మరోవైపు, ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో తాజాగా 170 డ్రోన్లను కూల్చివేశామని రష్యా తెలిపింది. అదే సమయంలో అనేక క్రూయిజ్ మిస్సైళ్లను అడ్డుకున్నామని తెలిపింది.

పచ్చళ్లపైనా ట్రంప్ పగ!

భారత్ నుంచి తెప్పించుకునే ఆహారోత్పత్తులపై నిఘా

» పన్ను కట్టకపోతే భారీ జరిమానాలు

» సోషల్ మీడియా, యాప్‌ల ద్వారా భారతీయుల చిరువ్యాపారాలు

» ఇండియా నుంచి తినుబండారాలు తెప్పించి విక్రయం..ఇకపై వాటిపై పన్ను



(డల్లాస్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి - కృష్ణమోహన్ దాసరి)

డబ్బు వసూలు చేసే ఏ చిన్న అవకాశాన్ని, మార్గాన్ని కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వదిలి పెట్టటం లేదు. ఆఖరికి, భారత్ నుంచి పచ్చళ్ల వంటి వాటిని తెచ్చుకుంటే వాటి మీద కూడా సుంకాలు విధించటానికి సన్నద్ధమవుతున్నారు. ఇండియా నుంచి ఎవరైనా స్నేహితులో, బంధువులో అమెరికా వస్తుంటే ఫలానా వస్తువులు కొని తీసుకు రావాల్సిందిగా అమెరికాలో ఉన్న భారతీయులు పురమాయిస్తుంటారు. వ్యక్తిగత స్థాయిలో ఈ విధంగా తెప్పించుకునే ఉత్పత్తుల మీద అమెరికా ప్రభుత్వానికి సుంకాలు చెల్లించడం వంటిదేమీ ఇప్పటి వరకూ లేదు. దశాబ్దాలుగా ఇలాగే నడుస్తోంది. కానీ, ట్రంప్ 2.0లో అన్నీ తారుమారవుతున్నాయి. ఇలాంటి చిన్న చిన్న వ్యవహారాలపై కూడా అమెరికా ప్రభుత్వం తాజాగా దృష్టి సారిస్తోంది. వ్యక్తుల ద్వారా, సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా తెప్పించుకునే ఉత్పత్తుల మీద ఇక మీదట నిఘా పెట్టనున్నారు. వీటి మీద కూడా సుంకం వసూలు చేసి ఖజానా నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సుంకం చెల్లించకపోతే, భారీ జరిమానాలు విధించి ఇలాంటి మార్గాలను పూర్తిగా కట్టడి చేయాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. భారత్‌లో మాదిరిగానే అమెరికాలో కూడా.. సోషల్ మీడియా హ్యాండిల్స్‌నే వ్యాపార వేదికలుగా మార్చుకుని అనేక మంది విక్రయాలు జరుపుతున్నారు. వీరిలో పలువురు తెలుగువాళ్లు, ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. ఇండియా నుంచి వివిధ ఉత్పత్తులను కొరియర్ ద్వారా తెప్పించుకొని.. సోషల్ మీడియాలో ఆర్డర్లు తీసుకొని కొనుగోలుదార్లకు కొరియర్ ద్వారా పంపిస్తున్నారు. వీరు సాధారణంగా పన్నులు చెల్లించడం అంటూ ఉండదు. ఇంకొందరు యాప్‌ల ద్వారా కూడా ఈ తరహా వ్యాపారాలు చేస్తున్నారు. భారత్ నుంచి ఏమైనా ఉత్పత్తులను, వస్తువులను తెప్పించుకోవాలనుకున్న వాళ్లు ఈ యాప్‌లలో రిజిస్టర్ చేసుకుంటారు. యాప్ నిర్వాహకులు ఇండియాలో వాటిని కొనుగోలు చేసి కొరియర్ ద్వారా తెప్పించి అందజేస్తారు. ఈ తరహా వ్యాపారంలో కూడా యూఎస్ ప్రభుత్వానికి పన్ను చెల్లించడం జరగదు. వీరందరి మీద ఇప్పుడు ట్రంప్ సర్కారు నజర్ పడింది. విక్రయించేవారితోపాటు కొనుగోలుదార్ల మీద కూడా సుంకాలు విధించాలని భావిస్తున్నారు. దీంట్లో భాగంగా, భారత్‌లోని రిటైలర్ల నుంచి అమెరికాలో ఉన్న వ్యక్తులు తెప్పించుకుంటున్న షిప్మెంట్లను అధికార వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఈ మేరకు పలువురికి భారీ జరిమానాలు, న్యాయపరమైన చర్యలకు సంబంధించి నోటీసులు పంపుతున్నాయి. ఇదంతా చిరువ్యాపారాలు చేస్తున్న వారికి సంబంధించి కాగా, వ్యక్తిగత స్థాయిలో బంధుమిత్రులు అమెరికాకు వస్తుంటే వారి ద్వారా పచ్చళ్లు, తినుబండారాలు, దుస్తులు, బంగారు నగలు వంటివి తెప్పించుకుంటే ఏమిటి పరిస్థితి అన్నదీ ఇప్పుడు చర్చనీయాంశమైంది.

పన్ను మినహాయింపు హోదా తొలగిస్తా

హార్వర్డ్ యూనివర్సిటీకి ట్రంప్ తాజా హెచ్చరిక

వాషింగ్టన్, మే 3: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హార్వర్డ్ వర్సిటీపై దాడిని తీవ్రతరం చేశారు. ఆ యూనివర్సిటీ పన్ను మినహాయింపు హోదాను తొలగిస్తానని తాజాగా హెచ్చరించారు. ఆ వర్సిటీకి ఇదే తగిన మూల్యం అంటూ శుక్రవారం ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. ఇప్పటికే యూనివర్సిటీల వ్యవహారాల్లో ట్రంప్ జోక్యాన్ని ఈశాన్య అమెరికాలోని ఎనిమిది ప్రఖ్యాత యూనివర్సిటీలకు చెందిన 'ఐవీ లీగ్ స్కూల్' ఖండించింది. ఐవీ లీగ్ స్కూల్స్‌కు పన్ను రహిత స్థితిని మార్చేస్తానని ట్రంప్ ప్రకటించిన కొన్ని వారాల తర్వాత తాజా హెచ్చరిక వెలువడటం గమనార్హం. ట్రంప్ తాజా ప్రకటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. క్యాంపస్ విధానాల్లో సంస్కరణలు చేపట్టేందుకు హార్వర్డ్ యూనివర్సిటీ నిరాకరించడమే ట్రంప్ ఆగ్రహానికి కారణం. కాగా, పన్ను మినహాయింపు హోదా తొలగించడం సుదీర్ఘ ప్రక్రియ అని, ఇప్పట్లో సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. కోర్టుల్లో అవరోధాలను దాటుకొని వెళ్లే సరికి సంవత్సరాలు పడుతుందని అంటున్నారు.



పదిలో ఆరు సబ్జెక్టులూ ఫెయిల్

» కేక్ కట్ చేసి ధైర్యం నింపిన తల్లిదండ్రులు

బెంగళూరు, మే 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో తమ కుమారుడు అన్ని సబ్జెక్టులూ ఫెయిలైనా ఆ తల్లిదండ్రులు తేలిగ్గా తీసుకున్నారు. పైగా కేక్ కట్ చేసి వేడుక చేసి ధైర్యం చెప్పారు. బాగల్కోట జిల్లా నవనగరకు చెందిన అభిషేక్ పదో తరగతి పరీక్షల్లో ఆరు సబ్జెక్టుల్లోనూ ఫెయిలయ్యాడు. అన్ని సబ్జెక్టులూ కలిపి 625కు 200 మార్కులు వచ్చాయి. దీంతో సహ విద్యార్థులు కొందరు అభిషేక్‌ను హేళన చేశారు. కుమారుడి పరిస్థితిని గమనించిన తల్లిదండ్రులు.. ఏమాత్రం ఆలోచించకుండా ఓ కేక్ తెప్పించి కట్ చేయించి వేడుక చేశారు. పదో తరగతి పరీక్షలు మరోసారి రాసుకోవచ్చని, ఫెయిలైనంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గట్టి ధైర్యం చెప్పారు. తల్లిదండ్రులతోపాటు తమ్ముడు, అవ్వ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ విషయమై అభిషేక్ మీడియాతో మాట్లాడుతూ, 'ఫెయిలయ్యానని నా క్లాస్‌మేట్స్ కొందరు చిన్నచూపు చూశారు. కానీ తన తల్లిదండ్రులు అండగా నిలిచి ధైర్యం చెప్పారు. నేను పరీక్షల్లో ఫెయిలైనా.. జీవితంలో ఫెయిల్ కాను. మరోసారి ప్రయత్నం చేసి పాసవుతా' అని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు.

ఆస్ట్రేలియా ప్రధానిగా మళ్లీ అల్బనీస్!

కాన్‌బెర్రా, మే 3: ఆస్ట్రేలియా పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని అల్బనీస్ ఘన విజయం సాధించారు. ఆస్ట్రేలియా ప్రధాని వరుసగా రెండోసారి పదవి చేపట్టనుండడం గత 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మొత్తం 150 స్థానాలు ఉన్న దిగువ సభలో ఆయన ప్రాతినిధ్యం వహించే లేబర్ పార్టీ 70 స్థానాలు పొందింది. సొంతంగాగానీ, ఇతర పార్టీల మద్దతుతోగానీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

రాష్ట్రానికి మరో భారీ ప్రాజెక్టు


దేశంలోనే తొలి ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ
10 వేల కోట్ల పెట్టుబడులు.. 1.50 లక్షల ఉద్యోగాలు

- క్రియేటివ్‌ల్యాండ్ ఆసియాతో ప్రభుత్వం ఒప్పందం
- ముంబై వేవ్స్ సదస్సులో ఎంవోయూపై సంతకాలు
- థీమ్ పార్క్‌లు, గ్లోబల్ సినిమా కో-ప్రొడక్షన్ జోన్‌లు
- ఏఐ ఆధారిత వర్చువల్ స్టూడియో కాంప్లెక్స్ ఏర్పాటు
- సినిమా, వినోదం, పర్యాటకం అభివృద్ధికి దోహదం
- నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ ఆవిష్కరణలకు ప్రోత్సాహం

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో భారీ ప్రాజెక్టు రాబోతోంది. దేశంలోనే మొట్టమొదటి ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీని రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నారు. దీన్ని క్రియేటర్‌ల్యాండ్‌గా పిలుస్తారు. ముంబైలో జరుగుతున్న వేవ్స్ సదస్సు-2025లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, క్రియేటివ్‌ల్యాండ్ ఆసియా ఈ మేరకు ఒప్పందం చేసుకున్నాయి. శనివారం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఎంవోయూ ప్రకారం క్రియేటివ్ ల్యాండ్ ఐదారేళ్లలో రూ.8 వేల నుంచి రూ.10 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తుందని అంచనా. 1.50 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. మంత్రి దుర్గేశ్ ప్రస్తుతం వియత్నాంలో ఉండటంతో పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి, క్రియేటివ్‌ల్యాండ్ స్టూడియోస్ వ్యవస్థాపకులు సాజన్‌రాజ్ కురుప్, హాలీవుడ్ నుంచి గ్లోబల్ అడ్వైజరీ బోర్డు ప్రతినిధులు డేవిడ్ ఉంగర్, సీఈవో ఆర్టిస్ట్స్ ఇంటర్నేషనల్, గ్లోబల్ గేట్ మేనేజింగ్ డైరెక్టర్ విలియం ఫైఫర్, నికోలస్ గ్రానాటినో చైర్మన్ నోవాక్వార్క్‌లు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఇటీవల క్రియేటివ్‌ల్యాండ్ ఆసియా ప్రతినిధులు అమరావతి సచివాలయంలో మంత్రి దుర్గేశ్‌ను కలిసి ఈ విషయంపై చర్చించారు. అప్పుడే మంత్రి సమక్షంలో ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ ఏర్పాటుకు అంగీకరించారు. సందర్శకులు లీనమయ్యేలా థీమ్ పార్క్‌లు, గేవింగ్ జోన్‌లు, గ్లోబల్ సినిమా కో-ప్రొడక్షన్ జోన్‌లు ఏర్పాటు చేయనున్నారు. యువతకు నైపుణ్యం కల్పించడానికి క్రియేటివ్‌ల్యాండ్ అకాడమీ ద్వారా ఆర్టిఫిషియల్ ఆధారిత వర్చువల్ స్టూడియో కాంప్లెక్స్‌కు రూపకల్పన చేస్తారు. ఏఐ, ఆర్ అండ్ డీ, వీఎఫ్ఎక్స్, గేమింగ్, వినోదం, టెక్, పర్యాటక రంగాల్లో 1.50 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించేందుకు అవకాశముంది. ఉద్యోగాల సృష్టి, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, డిజిటల్ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ ఎంవోయూ దోహదం చేస్తుందని మంత్రి దుర్గేశ్ వివరించారు. క్రియేటివ్‌ల్యాండ్ ఆసియాతో భాగస్వామ్యం రాష్ట్రంలో చలనచిత్ర, వినోద పర్యాటకం అభివృద్ధికి మైలురాయి వంటిదని అన్నారు. క్రియేటర్‌ల్యాండ్ ఏర్పాటు చేస్తే ప్రపంచ స్థాయి ప్రొడక్షన్ హబ్ ద్వారా వినోదంతో పాటు ఆర్థిక వ్యవస్థ మెరుగవుతుందని మంత్రి పేర్కొన్నారు. క్రియేటర్‌ల్యాండ్ ప్రాజెక్ట్ ఆవిష్కరణలతో పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి తెలిపారు. ప్రపంచ సృజనాత్మక పటంలో ఏపీ కీర్తిని పెంచడానికి దోహదం చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో తాము చేతులు కలపడం వినోదం, విద్య, ఆవిష్కరణల భవిష్యత్తుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని క్రియేటివ్ ల్యాండ్ ఆసియా వ్యవస్థాపకులు సాజన్‌రాజ్ కురుప్ అన్నారు.

దేశానికి 'అమరావతి' తెలియాలనే..

- ప్రధానితో రాజధానిలో సభ జరిపాం
- కార్యక్రమాన్ని బాగా నిర్వహించారు
- నేతలు, అధికారులకు సీఎం అభినందన



అమరావతి మే 3 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఆవశ్యకతను దేశప్రజలందరికీ వివరించేందుకు అమరావతి పనుల పునఃప్రారంభాన్ని ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిపించామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. శనివారం కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అమరావతి పునఃప్రారంభ సభ విజయవంతమైందని చంద్రబాబు అన్నారు. సభ నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని ప్రశంసించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలందరూ సమన్వయంతో పనిచేశారని అభినందించారు. "అమరావతి ఒక నగరం కాదని, ఒక శక్తిగా మారుతుందన్న ప్రధాని మాటలు స్ఫూర్తిని నింపాయి. రాష్ట్ర వృద్ధిరేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందని ప్రధాని చేసిన వ్యాఖ్యలు భవిష్యత్ రాజధానిని ఆవిష్కరించాయి. అమరావతికి ప్రధాని భరోసా ఇచ్చారు. దేశానికి అమరావతి రోల్‌మోడల్‌గా రూపొందుతుందని ప్రధాని అనడం రాష్ట్రానికి గర్వకారణం. ప్రధాని ప్రసంగం రాష్ట్ర ప్రజల పట్ల ఆయనకు ఉన్న అభిమానానికి, రాష్ట్రాభివృద్ధిపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం." అని చంద్రబాబు తెలిపారు. కాగా, అమరావతి పునఃప్రారంభ సభపై అన్నివర్గాల ప్రజల్లో సానుకూలత వ్యక్తమైందని మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, నాదెండ్ల మనోహర్ అభిప్రాయపడ్డారు. మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాల్సిన బాధ్యత మంత్రి నారాయణపై ఉందని వ్యాఖ్యానించారు.

'బుగ్గమఠం భూముల్లో' రుబాబు

(మొదటి పేజీ తరువాయి)



పెద్దిరెడ్డి ఇంటి వద్ద బందోబస్తు నడుమ సర్వే చేస్తున్న సిబ్బంది



సర్వే ముగించుకుని తిరిగి వెళుతున్న బుగ్గ మఠం అకౌంటెంట్ బాలాజీ బండి తాళం లాక్కుని, గొడవ పడుతున్న పెద్దిరెడ్డి అనుచరులు

ముత్యాలరెడ్డిపల్లె ప్రాంతంలోని 261-1, 261-2, 314-1బి, 314-2, 314-3ఏ, 315-1 తదితర ఆరు సర్వే నంబర్లలో 14.49 ఎకరాల బుగ్గమఠం భూములు అన్యాక్రాంతమయ్యాయని మఠం అధికారులు గుర్తించారు. ఆక్రమణదారుల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి కూడా ఉన్నారని గుర్తించి ఆక్రమణలు తొలగింపునకు నోటీసులు ఇచ్చారు. దానిపై మాజీ మంత్రి హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి మఠం భూముల సర్వే కోసం అధికారులు ప్రయత్నిస్తుండగా, శనివారం ఎట్టకేలకు ఆ ప్రక్రియ మొదలైంది. అంతకు మునుపే మఠం అధికారులు సర్వే కోసం మరోసారి పెద్దిరెడ్డితో పాటు మరో నలుగురికి నోటీసులు జారీచేశారు. అయితే ఆ భూములతో తనకు సంబంధం లేదని, వాటిని తన సోదరుడు ద్వారకానాథరెడ్డి కొనుగోలు చేశారని తెలిపారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 10.45 గంటలకు బుగ్గమఠం ఏసీ వెంకటేశ్వర్లు, జిల్లా దేవదాయ శాఖ ఏసీ రామకృష్ణారెడ్డి, మఠం సిబ్బంది, జిల్లా సర్వేయర్ చిట్టిబాబు, తిరుపతి అర్బన్ మండల సర్వేయర్, సిబ్బంది పెద్దిరెడ్డి ఇంటి సమీపానికి చేరుకున్నారు. పోలీసులు కూడా బందోబస్తు నిమిత్తం అక్కడే ఉన్నారు. మఠం అధికారులను చూడగానే ఆక్రమణదారులు సర్వే చేయడానికి లేదంటూ అడ్డుకున్నారు. వారం పది రోజులు ముందుగా నోటీసులు ఇవ్వకుండా ముందు రోజు సాయంత్రం నోటీసులు ఇచ్చి వెంటనే సర్వేకు ఎలా వస్తారని ప్రశ్నించారు. తమ వద్ద భూముల పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, మార్కెట్ ధర ప్రకారం డబ్బు చెల్లించిన రశీదులు ఉన్నాయని దబాయించారు. ఇప్పటి మార్కెట్ ధర చెప్పినా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని, ఇవి తమ భూములని తేల్చిచెప్పారు. తమ భూముల్లోకి అడుగుపెట్టడానికి వీల్లేదంటూ అడ్డుపడ్డారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. మఠం, దేవాదాయశాఖ అధికారులు నోరు మెదపకుండా మౌనంగా ఉండిపోవడంతో ఆక్రమణదారులు రెచ్చిపోయారు.

గంట ఆలస్యంగా..

పెద్దిరెడ్డి అనుచరులు అడ్డుపడటంతో గంట పాటు సర్వే ప్రారంభం కాలేదు. సమాచారం అందుకున్న తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఎస్వీయూ, అలిపిరి, ఈస్ట్ సీఐలు, టాస్క్‌ఫోర్స్ బలగాలతో 11.45కు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు జోక్యం చేసుకోకుండా మౌనంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనే స్వయంగా ఆక్రమణదారులను పక్కకు నెట్టేశారు. దీంతో పోలీసులు వారిని అదుపు చేయడంతో సర్వే ప్రారంభమైంది. రెవెన్యూ అధికారులు రోవర్ పరికరంతో సర్వే చేపట్టారు. దీనికి పదేపదే ఆక్రమణదారులు అడ్డుపడుతూ వచ్చారు. సుధహస్కూలు సమీపంలో సర్వే నిర్వహిస్తుండగా అక్కడ కూడా అంతరాయం కలిగించారు. వెస్ట్ రైల్వే గేటు వద్ద కూడా ఆటంకం కలిగించారు. కొబ్బరి కాయల మండీ వెనుకవైపు కూడా సర్వే సిబ్బందిని అడ్డుకున్నారు. ప్రతిచోటా డీఎస్పీ, సీఐలు జోక్యం చేసుకుని వారికి పక్కకు నెట్టేసి సర్వే జరిగేలా చూశారు.

పెద్దిరెడ్డి ఇంటి వద్ద హల్‌చల్

పెద్దిరెడ్డి నివాసానికి తూర్పు గేటు నుంచి ఆవరణలోకి ప్రవేశించేందుకు యత్నించిన మఠం, దేవదాయ, రెవెన్యూ సర్వే అధికారులు, సిబ్బందిని పెద్దిరెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. తమ ఇళ్లలోకి ఎలా వస్తారని ప్రశ్నించారు. సర్వేకు ఎవరు అనుమతి ఇచ్చారు? అనుమతులు చూపండి అంటూ దబాయించారు. ఇంటికి ఇరువైపులా సర్వే చేసే సమయంలో పెద్దిరెడ్డి అనుచరులు అడ్డుపడ్డారు. పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడ నుంచి పంపేశారు. 12.45 గంటలకు సర్వే ముగించి అధికారులు వెనుదిరగ్గా.. బుగ్గమఠం అకౌంటెంట్ బాలాజీ బైక్‌కు అడ్డుపడ్డ ఆక్రమణదారులు బైక్ తాళాలు లాక్కున్నారు. కాగా, రూ.వందల కోట్ల విలువైన భూముల సర్వే వ్యవహారమని తెలిసినా కనీసం అర్బన్ మండల తహసీల్దారు గానీ, ఆర్డీవో గానీ అక్కడికి రాకపోవడం విమర్శలకు దారి తీసింది.

వైసీపీకి లిక్కర్ ఫండ్



(మొదటి పేజీ తరువాయి)

సిట్ విచారణలో సంచలన విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. ముడుపులు ఇచ్చిన వారి లిక్కర్ ఆర్డర్ బాధ్యతలు మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి (ఏ2), బేవరేజెస్ కార్పొరేషన్ ఓఎస్డీ సత్యప్రసాద్ (ఏ3)చూసుకున్నారని, ముడుపులు ఎవరికి చేరాయో తనకు తెలీదని చెప్పారు. శనివారం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కస్టడీలో అధికారులు సుమారు 90కి పైగా ప్రశ్నలు సంధించారు. మొదట్లో రాజ్ కసిరెడ్డి(ఏ1) సరిగా సహకరించలేదు. అధికారులు ఉదయం ఏది అడిగినా.. 'లిక్కర్ స్కామ్ గురించి నాకెలా తెలుస్తుంది? నేను ఐటీ అడ్వైజర్‌గా ఉన్నాను. నాకు సంబంధం లేని వాటి గురించి మీరు అడిగితే నేను చెప్పలేను' అంటూ బుకాయించాడు. సిట్ అధికారులు కొన్ని ఆధారాలు ముందు పెట్టి ప్రశ్నించడంతో నీళ్లు నమిలిన రాజ్ కసిరెడ్డి అసలు గుట్టు విప్పాడు. 'వైసీపీ విజయం సాధించిన తర్వాత జగన్ రెడ్డి పిలిచి లిక్కర్ పాలసీ తయారు చేయాలి.. అందులో మన పార్టీకి బాగా ఫండ్ రావాలి.. సాయన్న, మిథున్‌తో మాట్లాడు అని చెప్పారు. అప్పట్లో వైసీపీలో కీలకంగా ఉన్న ఆ ఇద్దరు నేతలకు ఈ విషయం చెప్పా. అప్పటికే వారికి జగన్ రెడ్డి ఆదేశాలున్నాయి. హైదరాబాద్‌లో 2019 అక్టోబరు 13న సాయిరెడ్డి ఇంట్లో ఫస్ట్ మీటింగ్ జరిపాం. మద్యం వ్యాపారులు కిక్ బ్యాక్స్ ఇస్తారని తెలిసి డిస్టిలరీల యజమానుల్ని ఒక హోటల్‌కు పిలిచి 12 శాతం ఇస్తేనే ఏపీలో మీ ప్రొడక్ట్‌ను అనుమతిస్తామని చెప్పాం. కొందరు సరే అన్నారు. మరికొందరు ఆలోచిస్తామని వెళ్లిపోయారు. స్పందన లేని మద్యం కంపెనీల సరుకు ఆర్డర్ ఆపేయాలని వాసుదేవ రెడ్డి, సత్యప్రసాద్‌కు ఆ తర్వాతి సమావేశంలో చెప్పాం. కొన్ని డిస్టిలరీలను బలవంతంగా లాక్కునే బాధ్యత విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి తీసుకున్నారు. సజ్జల శ్రీధర్ రెడ్డి భాగస్వామి అయ్యాడు' అని మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి సిట్ అధికారులకు వివరించినట్లు తెలిసింది.

ఎదురెదురుగా కూర్చోబెట్టి...

ముడుపుల డబ్బులు ఎవరు వసూలు చేశారో? ఎక్కడికి చేరాయో తనకు తెలియదని రాజ్ కసిరెడ్డి తొలుత బుకాయించాడు. పలువురు నిందితుల స్టేట్‌మెంట్లతో పాటు ఫోన్ డేటా, వసూళ్లకు ఏర్పాటు చేసుకున్న నెట్‌వర్క్, లిక్కర్ వ్యాపారులు చెప్పిన వివరాలను సిట్ అధికారులు ముందుంచారు. 'నన్ను ఇబ్బంది పెట్టొద్దు.. ఎవరు ఇచ్చారో, ఎవరికి చేరాయో నాకు తెలీదు' అంటూ కసిరెడ్డి బిక్కమొహం వేసినట్లు సమాచారం. అదే సమయంలో మరో నిందితుడు రాజ్ కసిరెడ్డి ముఖ్య అనుచరుడు బూనేటి చాణక్యను ఎదురుగా కూర్చోబెట్టి అధికారులు ప్రశ్నించారు. ఇద్దరి నుంచి పొంతన లేని సమాధానాలు వచ్చాయి. విజయసాయి రెడ్డి, అనిల్ రెడ్డి, జగన్ ఓఎస్డీకి డబ్బులు అందజేశారా అని ప్రశ్నించగా, ఇద్దరూ వేర్వేరు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అప్పటికే సమయం పూర్తి కావడంతో సిట్ అధికారులు వారిని విజయవాడ జైలుకు తరలించారు.

నేడూ విచారణ

ఆదివారం నాడు రాజ్ కసిరెడ్డి, చాణక్యను వేర్వేరుగా, ఇద్దరిని కలిపి విచారించి మరింత కీలక సమాచారాన్ని సేకరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మూడో రోజు కస్టడీలో రాజ్ కసిరెడ్డిని ఏమి అడగాలి? అతడి ముఖ్య అనుచరుడు చాణక్యను ఏం విచారించాలి? అనే దానిపై సీఐడీ ఉన్నతాధికారులు సిట్ బృందానికి కీలక సూచనలు చేసినట్లు తెలిసింది. అందుకు అనుగుణంగా ప్రశ్నావళి సిద్ధం చేసుకుని మరిన్ని గుట్టుమట్లు నిందితుల నోటి నుంచి రాబట్టనున్నారు. ఏసీబీ కోర్టు రాజ్ కసిరెడ్డిని వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వగా, చాణక్యను శనివారం నుంచి ఐదు రోజుల పాటు కస్టడీకి ఇచ్చింది. దీంతో శనివారం ఇద్దరిని ఒకేసారి కస్టడీకి తీసుకుని సిట్ కార్యాలయానికి తరలించారు. అంతకుముందు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. విచారణ అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి తిరిగి జైలు అధికారులకు అప్పగించారు.

ఏపీభవన్‌లో 'కబ్జా దుకాణం'!

20 ఏళ్లుగా అక్రమంగా షాపు నిర్వహణ

- ఆరోపణలు రావడంతో ఖాళీ చేయించిన ఆర్సీ
- కొత్తగా కారులో దుకాణం తెరిచిన ఘనుడు
- రాత్రి ఏపీ భవన్‌లో పార్కింగ్.. అక్కడే బస

(న్యూఢిల్లీ-ఆంధ్రజ్యోతి)

అతను రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తి కాదు.. ఏపీతో గానీ, తెలంగాణతో గానీ అతనికి ఏ సంబంధమూ లేదు. అయినా గత రెండు దశాబ్దాలుగా ఢిల్లీలోని ఏపీ భవన్‌లో తిష్ట వేశాడు. దుకాణం నిర్వహణ ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నాడు. అధికారులు దాన్ని ఖాళీ చేయించి, కూల్చివేయించినా కూడా అతను అక్కడినుంచి కదలడం లేదు. వివరాలు... ఎస్టీడీ బూత్ నిర్వహణ కోసం అప్పట్లో ఒక దివ్యాంగుడికి ఏపీ భవన్‌లో కేటాయించిన దుకాణాన్ని కొంత మంది అధికారుల సహకారంతో తమిళనాడుకి చెందిన ఓ వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడు. అందులో నిత్యావసరాలు, పచ్చళ్ల అమ్మడంతో పాటు ట్రావెల్ బిజినెస్ చేసేవాడు. దుకాణం ముసుగులో అతను అక్రమ వ్యవహారాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో పాటు ఇంటెలిజెన్స్ నివేదికలతో రెండు నెలల క్రితం ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ఆ దుకాణాన్ని ఖాళీ చేయించారు. దీంతో షాప్‌ను తిరిగి తనకు అప్పగించాలంటూ ఏపీ కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక మంత్రి వద్దకు సదరు వ్యక్తి రాయబారం నడిపాడు. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి ఆ ఇద్దరు నేతలు నిరాకరించారు. అయితే కబ్జాదారుడి బాగోతాలు తెలియని దక్షిణ తెలంగాణకు చెందిన ఒక సీనియర్ ఎంపీ మాత్రం అతడికి మద్దతు పలికారు. కొంతమంది మాటలు నమ్మి అండగా ఉంటానంటూ రెసిడెంట్ కమిషనర్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అయినా కమిషనర్ రెండు నెలల క్రితమే ఆ దుకాణాన్ని కూల్చివేయించారు. అక్రమాలకు అలవాటు పడిన కబ్జాదారుడు దుకాణాన్ని కూల్చివేసిన ప్రదేశానికి నాలుగు అడుగుల దూరంలోనే కారులో కొత్త దుకాణాన్ని తెరిచాడు. తన పాత కార్యకలాపాలను యథాప్రకారం కొనసాగిస్తున్నాడు. పగలంతా దుకాణం నిర్వహిస్తూ... రాత్రిళ్లు ఆ కారును ఏపీ భవన్‌లోనే పార్కింగ్ చేస్తున్నాడు. భవన్‌కు చెందిన కిందిస్థాయి ఉద్యోగులు నివాసం ఉండే పటౌడీ హౌస్‌లో అక్రమంగా ఉంటున్నాడు. శుక్రవారం బాంబు బెదిరింపులు వచ్చిన దృష్ట్యా రెండు రాష్ట్రాల భవన్‌లకు సంబంధించిన నిర్మాణాల్లో అక్రమంగా తిష్ట వేసినవారిని గుర్తించి సాగనంపేందుకు రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు చర్యలను చేపట్టారు. అతడిని ఖాళీ చేయాలని ఆదేశించినా ఇంకొంత సమయం అడుగుతుండటం విశేషం.

ఇప్పుడైనా పశ్చాత్తాపపడండి

- ప్రజలే రాజధాని సాధించుకున్నారు: మంత్రి పార్థసారథి



విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): 'స్వార్థపరులు, అప్రజాస్వామిక వాదులు ఇప్పుడైనా పశ్చాత్తాప పడితే తెలుగు ప్రజలు క్షమిస్తారో లేదో తెలీదు కానీ... కనీసం భగవంతుడైనా క్షమించడానికి ప్రయత్నం చేస్తాడు' అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'అమరావతి నిర్మాణాన్ని వైసీపీ నాయకులు అడ్డుకోవాలని చూసినా ప్రజలే తమ రాజధానిని సాధించుకున్నారు. రాష్ట్రం నంబర్ వన్‌గా ఎదుగుతుందనే నమ్మకం ప్రధాని మోదీ వ్యాఖ్యలతో కలిగింది. చంద్రబాబు పనితనం, దూరదృష్టి ప్రతిపక్షానికి తెలియకపోవడం దురదృష్టం. దేవతల రాజధానిగా అమరావతిని ప్రధాన మంత్రి గుర్తించడం గర్వంగా ఉంది. కానీ వైసీపీ నాయకులు భ్రమరావతి లాంటి పేర్లు పెట్టి విషాన్ని కక్కారు. తుచ్ఛ రాజకీయ నాయకులకు అందని రీతిలో చంద్రబాబు ఆలోచనలు ఉంటాయి' అని కొనియాడారు.

పునఃప్రారంభం అదిరింది

- మంత్రి నారాయణ



విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమం ఊహించినదానికంటే విజయవంతమైందని మంత్రి నారాయణ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మోదీ పర్యటనకు రెట్టించిన ఉత్సాహంతో రాష్ట్రం నలుమూలల నుంచి అశేష ప్రజానీకం హాజరైంది. ప్రజా రాజధాని అనే అంశాన్ని మీడియా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో సభ అనుకున్నదానికంటే విజయవంతమైంది. మీడియాకు ధన్యవాదాలు' అని మంత్రి తెలిపారు.

ఉగ్రవాదులకన్నా జగన్ పెద్ద ముష్కరుడు

- కోర్టుల్లో ఆయనకు శిక్షలు తప్పవు
- బీజేపీ ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, విష్ణుకుమార్‌రాజు
- వైసీపీ నేతలు కాలకేయులు: పాతూరి



అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): 'కశ్మీర్‌లో దాడి చేసిన ఉగ్రవాదుల కన్నా జగన్ పెద్ద ముష్కరుడు. ఆయనపై ఉన్న కేసులు కోర్టుల్లో విచారణకు వస్తున్నాయి. చట్టం, న్యాయపరంగా ఆయనకు శిక్షలు తప్పవు' అని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అన్నారు. విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మరో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏపీని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చిన మోదీపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు దేనికి సంకేతం? పేదలకు ఇళ్ల నుంచి రైల్వే లైన్ల వరకూ ఎన్నో ప్రాజెక్టులు ఇచ్చిన ప్రధాని మోదీపై కాంగ్రెస్, వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు నీచం. అమరావతి ప్రజల్ని జగన్ భయపెట్టారు. చంద్రబాబు భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చి అభివృద్ధి చేస్తున్నారు. ఆయనకు మోదీ అండగా నిలుస్తున్నారు. వైసీపీ నేతలు ప్రశాంతంగా నిద్రపోలేక పోతున్నారు' అని ఆదినారాయణ వ్యాఖ్యానించారు. విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, 'జగన్‌కు ఆహ్వానం పంపినా అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనకుండా ముఖం చాటేశారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అని అన్నారు. ఉగ్రదాడి తర్వాత విదేశీ పర్యటనలు సైతం రద్దు చేసుకుని భద్రతా సమీక్షల్లో తీరిక లేకుండా ఉంటోన్న ప్రధాని ఆంధ్రప్రదేశ్‌పై ప్రేమతో అమరావతికి వచ్చి అనుకున్న సమయం కన్నా ఎక్కువ గడిపారని వారిరువురూ కొనియాడారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం విడిగా మాట్లాడుతూ... 'రాష్ట్రాభివృద్ధికి భుజం భుజం కలుపుదామంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు సభా వేదిక నుంచి ప్రధాని నరేంద్ర మోదీ చేసిన సూచనతో ఆ ముగ్గురినీ ప్రజలు బాహుబలులుగా.. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీ నేతల్ని కాలకేయులుగా చూస్తున్నారు' అని వ్యాఖ్యానించారు.

మే 2... ప్రత్యేకం!

- యాదృచ్ఛికంగా ఎన్టీఆర్ పెళ్లి రోజునే అమరావతి పనుల పునఃప్రారంభ వేడుక

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): అమరావతి పనులు పునఃప్రారంభించిన మే 2వ తేదీనే టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పెళ్లి రోజు కావడం విశేషం. 1942, మే 2న ఎన్టీఆర్ వివాహం కృష్ణా జిల్లా కొమరవోలులో బసవతారకంతో జరిగింది. 83 ఏళ్ల తర్వాత మళ్లీ అదే రోజు అమరావతి విధ్వంసం నుంచి వికాసం దిశగా అడుగులు వేయడానికి ముహూర్తం నిర్ణయించడం యాదృచ్ఛికం. ఈ విషయాన్ని టీడీపీ అభిమానులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు.

రూ.400 కోట్లతో 191 రహదారుల నిర్మాణం

అమరావతి, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్లు భవనాల శాఖ పరిధిలోని గ్రామీణ, మండల రహదారుల నిర్మాణం కోసం నాబార్డు నుంచి రూ.400 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మరమ్మతులకు ఏమాత్రం అనువుగా లేని గ్రామీణ ప్రాంతాల్లోని 191 రహదారులను పునర్నించనున్నారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్‌కు అనుమతి ఇస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు రహదారుల నిర్మాణం కోరుతూ ప్రభుత్వానికి విన్నపాలు చేసిన నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా అత్యంత ముఖ్యమైన 191 రోడ్లను ఎంపిక చేశారు. ఈ పనులు చేపట్టేందుకు ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఇప్పుడు పరిపాలనామోదం కూడా లభించడంతో త్వరలో టెండర్లు పిలవనున్నారు.

లేపాక్షి భూములకు త్వరలో విముక్తి

- రాష్ట్రానికి చంద్రబాబు ఎవరెస్ట్ శిఖరం
- పది నెలల్లో రూ.8.5లక్షల కోట్ల పెట్టుబడులు: మంత్రి టీజీ భరత్



హిందూపురం, మే 3(ఆంధ్రజ్యోతి): హిందూపురం లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములకు త్వరలో విముక్తి కలిగే అవకాశం ఉందని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో శనివారం జరిగిన వాసవీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములు 10 వేల ఎకరాలున్నాయి. ఆ భూముల సమస్య పరిష్కారంపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. అది పరిష్కారమైతే ఈ ప్రాంతానికి పెద్దఎత్తున పరిశ్రమలు వస్తాయి. తద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా పెద్దఎత్తున వస్తాయి' అని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చాక రాయలసీమను అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కరేనని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ఎవరెస్ట్ శిఖరంలాంటివారని, ఆయన ఎప్పుడూ భవిష్యత్తు తరాల గురించే ఆలోచిస్తారని పేర్కొన్నారు. పదినెలల్లో రాష్ట్రానికి 8.5లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని, ఈ ఘనత సీఎం చంద్రబాబుదేనని చెప్పారు. వైసీపీ హయాంలో ఆర్యవైశ్యులు చాలా ఇబ్బందులు పడ్డారని, నష్టపోయారని, కష్టపడ్డారని మంత్రి భరత్ అన్నారు.

బెంగళూరులో ఫుల్‌టైం.. తాడేపల్లిలో పార్ట్‌టైం!

- అలాంటి జగన్‌కు రాష్ట్రం గురించి ఏం తెలుసు
- ప్రతి పంటకూ మద్దతు ధర: అచ్చెన్నాయుడు



అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల వైసీపీ పాలనలో పండించిన పంటలకు మద్దతు ధర కల్పించలేదు. రైతుల కష్టం నుంచి కూడా కమీషన్లు తీసుకున్న నీచ చరిత్ర వైసీపీ నేతలది' అని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మిర్చికి ఎంఐపీ(మార్కెట్ ఇంటర్‌వెన్షన్ ప్రైస్) రూ.11,781 ఉంటే మార్కెట్‌లో రూ.13,300 పలుకుతోంది. వైసీపీ నాయకులు ఎంఐపీ ఇవ్వాలని కోరుతున్నారంటే రైతులను రోడ్డున పడేయాలన్నది వారి కుట్రగా ఉంది. ప్రత్తికి రూ.7,121 ఎంఎస్‌పీ ఉంటే మార్కెట్‌లో రూ.8,000 పలుకుతోంది. జగన్ ఏమో ఎంఎస్‌పీకి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాడు. టమాటాకు కనీస మద్దతు ధర లేకపోయినప్పటికీ రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ధర తగ్గినప్పుడల్లా రైతు బజార్ల ద్వారా విక్రయించి ఆదుకుంటున్నాం. బెంగళూరులో ఫుల్ టైం.. తాడేపల్లిలో పార్ట్ టైం గడిపే జగన్‌కు రాష్ట్రంలో ఏం జరుగుతుందో ఎలా తెలుస్తుంది' అని మంత్రి ఎద్దేవా చేశారు.

జగన్‌కు రైతులపై చిత్తశుద్ధి లేదు: మంత్రి మనోహర్



అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రైతులపై ఎప్పుడూ చిత్తశుద్ధి లేదు. జగన్ పాలనలో రైతులకు రూ.1,674 కోట్లు చెల్లించకుండా పెట్టిన బకాయిలను మా కూటమి ప్రభుత్వం చెల్లించింది' అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రైతులకు మద్దతు ధర చెల్లించడం లేదని విమర్శిస్తూ శనివారం ఎక్స్ వేదికగా జగన్ చేసిన విమర్శలను మంత్రి తిప్పికొట్టారు. 'ఈ ఖరీఫ్ సీజన్‌లో 5.65 లక్షల మంది రైతుల నుంచి 35.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. 24 గంటల్లోనే రూ.8,27.59 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశాం. రబీ సీజన్‌లో 1,16,627 మంది రైతుల నుంచి 12.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లో రూ.2,722.81 కోట్లు జమ చేశాం. రైతుల కష్టానికి తక్షణ ఆర్థిక మద్దతు అందించాం' అని మంత్రి మనోహర్ వివరించారు.

రాష్ట్రానికి నిధులు కావాలి... అప్పు కాదు

- చంద్రబాబూ... మోదీని నమ్మి మోసపోకండి: షర్మిల



అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర అభివృద్ధికి, రాజధాని అమరావతికి కావాల్సింది అప్పులు కాదు, నిధులు. 'అభివృద్ధి చేస్తాం.. భుజాలు కలుపుతాం' అంటూ మళ్లీ ప్రధాని నరేంద్ర మోదీ చెపుతున్న బూటకపు మాటలు నమ్మి మోసపోవద్దు" అని పీసీసీ చీఫ్ షర్మిల, సీఎం చంద్రబాబుకు సూచించారు. శనివారం ఎక్స్ వేదికగా ఆమె ప్రధాని పర్యటనపై స్పందించారు. 'ఐదు కోట్ల మంది కలల సౌధం అమరావతికి 2015 నుంచి అన్నీ చేశామని పచ్చి అబద్ధాలు చెప్పారు. అన్నీ ఇస్తే మాకు రాజధాని నిర్మాణం ఇంతవరకు ఎందుకు కాలేదు? అమరావతి నిర్మాణానికి ఖర్చయే రూ.లక్ష కోట్లలో ఒక్క రూపాయి అయినా ప్రకటించారా? రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత అని హామీ ఇచ్చారా? విభజన హామీలపై టైమ్ బౌండ్ క్లారిటీ ఇచ్చారా? చంద్రబాబు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మోదీని నమ్మి ఆయన మళ్లీ మళ్లీ మోసపోతున్నారు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అప్పు పుట్టందే జీతాలకు దిక్కులేదని చెప్పే మీరు... రాజధాని నిర్మాణానికి ఎవరిని అడిగి రూ.60 వేల కోట్లు అప్పు తెస్తున్నారు? వాటిపై వడ్డీల భారం మోసేదెలా? కేంద్రం మెడలు వంచే దమ్ములేక భావి తరాల మీద అప్పు భారాన్ని వేస్తారా?' అని షర్మిల ప్రశ్నించారు.

ప్రత్యేక హోదా ఊసెత్తని ప్రధాని

- రాజధానికీ నిధులు ప్రకటించలేదు
- సీఎం, డిప్యూటీ సీఎం అడగనూ లేదు: నారాయణ



తిరుపతి(ఆటోనగర్), మే 3(ఆంధ్రజ్యోతి): అమరావతి పనులను శుక్రవారం పునఃప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక హోదా ఊసెత్తకుండా, రాజధాని అభివృద్ధికి ప్రత్యేక గ్రాంట్లు విడుదల చేయకుండా, ఉత్తుత్తి హామీలు ప్రకటించి వెళ్లారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మండిపడ్డారు. తిరుపతిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్ల కిందట రాజధాని నిర్మాణానికి వేసిన పునాది రాయిని మోదీ గుర్తు చేసుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేత ప్రత్యేక హోదా, అవసరమైన నిధులు, అభివృద్ధి పనుల మంజూరుపై ప్రకటనలు చేయించడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విఫలమయ్యారని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నుంచి అప్పుగా తీసుకునే రూ.15,000 కోట్లలో 10 శాతానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొంటుందని, మిగిలిన మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాల్సి రావడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలతో సంబంధం లేకుండా ప్రధాని పర్యటన ఒక షోగా ముగిసిందన్నారు. రాష్ట్రంలో పాలకులు మారారు తప్ప అవినీతి విధానాల్లో ఏమాత్రం తేడా లేదని నారాయణ ఆరోపించారు.

తిరుమల కిటకిట



గదుల కోసం తిరుమల సీఆర్వో ఆఫీసు ముందు నిరీక్షణ

» వరుస సెలవులతో పెరిగిన రద్దీ

» సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, మే 3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద శనివారం వాహనాలు బారులు తీరాయి. ఇక్కడినుంచి గరుడ విగ్రహం దాకా వాహనాలు నిలిచిపోయాయి. వేసవి సెగ ఎక్కువగా ఉండడంతో ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నడక దారులు కూడా కిటకిటలాడాయి. ఇంత ఎండలోనూ భక్తులు మోకాళ్లమీద మెట్లు ఎక్కుతూ మొక్కులు తీర్చుకున్నారు. సర్వదర్శనానికి 14 గంటలకు పైగానే సమయం పడుతోందని అధికారులు తెలిపారు. స్లాటెడ్ టోకెన్లు ఉన్న వారికి కూడా నాలుగు గంటల సమయం పడుతోంది. వేసవి సెలవులకు తోడు వారాంతపు రోజులు సెలవులు రావడంతో తిరుమలలో ఎక్కడ చూసినా భక్తులే కనిపిస్తున్నారు. గదులు పొందడానికి మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతోంది. గదులు లభించని భక్తులు యాత్రికుల వసతి సముదాయాలు, జర్మన్ షెడ్లు, కార్యాలయాల ముందు సేదదీరుతున్నారు.



అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద బారులు తీరిన వాహనాలు

వీఐపీ బ్రేక్ దర్శన వేళలో మార్పు

తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల మార్పు శనివారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో ఉదయం 6.20 గంటలకే బ్రేక్ దర్శనాలు మొదలయ్యాయి. గతంలో ఉదయం 5.30 గంటలకు వీఐపీ బ్రేక్ దర్శనాలు ప్రారంభమై 11 గంటకు ముగిసేవి. అయితే రాత్రి వేళల్లో కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించాలనే ఉద్దేశంతో ఉదయం 5.45 గంటల నుంచే వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రారంభించాలని టీటీడీ బోర్డు తీర్మానించింది. దీంతో శనివారం ఉదయం 6.20 గంటలకు బ్రేక్ దర్శనాలు మొదలయ్యాయి. 8.30 గంటల వరకు ప్రొటోకాల్, రిఫరెల్ ప్రొటోకాల్, జనరల్ బ్రేక్ దర్శనాలు జరిగాయి. ఆతర్వాత 10 గంటల వరకు సర్వదర్శన భక్తులను దర్శనానికి అనుమతించారు. తిరిగి మధ్యాహ్నం 12.20 గంటల వరకు బ్రేక్ దర్శనాలు కొనసాగించి అనంతరం సర్వదర్శన భక్తులను అనుమతించారు. ఈ నూతన విధానంతో అదనంగా గంట సమయం సామాన్య భక్తులకు దక్కినట్టయింది.

'క్వాంటమ్'తో కొత్త శకం

(మొదటి పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ దిగ్గజం ఎల్అండ్‌టీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అత్యాధునిక 156 క్యూబిట్ హెరాన్ క్వాంటమ్ ప్రాసెసర్ కలిగిన అతిభారీ క్వాంటమ్ సిస్టమ్ 2ను దేశంలోనే తొలిసారిగా ఐబీఎం సంస్థ అమరావతిలో ఏర్పాటు చేయబోతోంది. దీంతో నాలెడ్జి ఎకానమీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోందంటూ విశ్లేషణలు వెలువడ్డాయి. విజ్ఞాన, వాణిజ్య కేంద్రంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోబోదని టెక్ పండితులు భావిస్తున్నారు. రూ.10వేల కోట్ల నుంచి రూ.15వేల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని లెక్కలు వేస్తున్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో జీనోమ్ వ్యాలీకి రూపకల్పన చేసిన చంద్రబాబు.. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో అమరావతిని కొత్త 'టెక్' రెక్కలు తొడుగుతున్నారని పేర్కొంటున్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ డిజైన్ ప్రత్యేకంగా ఉండబోతోందని రాష్ట్ర ఐటీ శాఖ ఉన్నతాధికారులు వివరించారు.

క్వాంటమ్ టెక్నాలజీ అంటే..

భౌతిక శాస్త్ర ప్రకారం క్వాంటమ్ అంటే అతి సూక్ష్మ పరిమాణం. క్వాంటమ్ ఫిజిక్స్‌లో ఉన్న సిద్ధాంతాలు, లక్షణాలు ఉపయోగించి రూపొందించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ. సాంకేతిక విప్లవంలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఇప్పుడిప్పుడే తొలి అడుగులు వేస్తోంది. అభివృద్ధి చెందుతున్న ఈ టెక్నాలజీ భవిష్యత్‌లో అద్భుతాలు సృష్టించబోతోంది. అత్యంత శక్తివంతమైన ప్రస్తుత కంప్యూటర్ల సామర్థ్యానికి మించి క్వాంటమ్ టెక్నాలజీ కంప్యూటర్లు పనిచేస్తాయి. సంప్రదాయ కంప్యూటర్లు పరిష్కరించలేని సంక్లిష్ట సమస్యలను క్వాంటమ్ మెకానిక్స్‌ను ఉపయోగించి పరిష్కరించవచ్చు. క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీలో క్వాంటమ్ హార్డ్‌వేర్, క్వాంటమ్ ఆల్గోరిథమ్స్‌తో పాటు వివిధ శ్రేణులు ఉంటాయి. క్వాంటమ్ ఫిజిక్స్ ప్రయోజనాలను పుణికిపుచ్చుకున్న క్వాంటమ్ కంప్యూటర్స్... ప్రస్తుతమున్న అత్యాధునిక కంప్యూటర్లకంటే వేగంగా, సులువుగా జటిలమైన సమస్యలను పరిష్కరించగలవు. ఇవి ఎంత పెద్ద డేటా అయినా చిటికెలో విశ్లేషిస్తాయి. ఒక క్లాసికల్ కంప్యూటర్ ఏదైనా సమస్య పరిష్కరించడానికి రోజులకొద్దీ సమయం తీసుకుంటే... అదే సమస్యను క్వాంటమ్ కంప్యూటర్లు నిమిషాల్లో సాల్వ్ చేయగలవు.



నాలుగు సూత్రాలు...

సబ్ ఆటమిక్ పార్టికల్స్ అధ్యయనాన్ని క్వాంటమ్ మెకానిక్స్ అని కూడా పిలుస్తారు. ఇది ప్రత్యేకమైన, ప్రాథమిక సహజమైన సూత్రాలను వెల్లడిస్తుంది. సూపర్ పొజిషన్, ఎన్‌టాంగిల్‌మెంట్, డీకొహెరెన్స్, ఇంటర్‌ఫియరెన్స్ అనే ముఖ్యమైన నాలుగు సూత్రాల ఆధారంగా క్వాంటమ్ కంప్యూటింగ్ పనిచేస్తుంది.

1. సూపర్ పొజిషన్: ఒక క్వాంటమ్ పార్టికల్ లేదా వ్యవస్థ ఒకే స్థితిలో ఉండటం కాకుండా, బహుళ అవకాశాల కలయిక స్థితిలో ఉంటుంది.

2. ఎన్‌టాంగిల్‌మెంట్: సాధారణ సంభావ్యత అనుమతించేవాటి కన్నా ఎన్‌టాంగిల్‌మెంట్ ప్రాసెస్‌లో పలు క్వాంటమ్ పార్టికల్స్ అనుసంధానమై బలంగా రూపొందుతాయి.

3. డీకొహెరెన్స్: ఈ స్థితిలో క్వాంటమ్ పార్టికల్స్ సిస్టం క్షయం అయ్యి, నశించి లేదా మారి క్లాసికల్ ఫిజిక్స్ ద్వారా కొలవదగ్గ ఏక స్థితిలోకి వస్తాయి.

4. ఇంటర్‌ఫియరెన్స్: అనుసంధానమైన క్వాంటమ్ స్థితులు ఒకదానిపై ఒకటి ప్రభావం చూపుతాయి. అంతేగాక ఎక్కువ లేదా తక్కువ సంభావ్యతను నిర్మిస్తాయి.

క్యూబిట్ అంటే..

ప్రస్తుతం మనం ఉపయోగించే క్లాసికల్ కంప్యూటర్లు 0, 1 అనే బైనరీ బిట్స్‌పై ఆధారపడి పనిచేస్తాయి. ఈ రూపంలోనే సమాచారాన్ని నిల్వ చేయడం లేదా విశ్లేషించడం చేస్తాయి. ఇక్కడ బిట్ విలువ సున్నా లేదా ఒకటి. క్వాంటమ్ టెక్నాలజీలో ఇలాంటి బిట్‌ను క్యూబిట్ అని పిలుస్తారు. ఈ క్యూబిట్ సాధారణ బిట్‌కు భిన్నంగా ఒకే సమయంలో సున్నా లేదా ఒకటిగా వ్యవహరించగలదు. అదే విధంగా డేటాను నిల్వ చేయగలదు. సూపర్ పొజిషన్‌లో క్యూబిట్స్ అనుసంధానమైనపుడు క్వాంటమ్ టెక్నాలజీ విపరీతమైన వేగంతో పనిచేస్తుంది. ఒకేసారి రెండు క్యూబిట్లు నాలుగు రకాల సమాచారాన్ని లెక్కించగలవు. అలాగే నాలుగు క్యూబిట్లు 16 రకాల అంశాలను విశ్లేషించగలవు. అందుకే ఇది ఊహాతీతమైన వేగంతో పనిచేస్తుంది. ఈ కంప్యూటర్లలో మరో విశేషం కూడా ఉంది. క్లాసికల్ కంప్యూటర్ల డేటాను క్వాంటమ్ సిస్టమ్‌లు విశ్లేషించగలవు కానీ, క్వాంటమ్ డేటాను క్లాసికల్ కంప్యూటర్లు యాక్సెస్ చేయలేవు. సమస్యలను పరిష్కరించడానికి ఈ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి ప్రపంచ దిగ్గజ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఐబీఎం, మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి సంస్థలు క్వాంటమ్ టెక్నాలజీపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. 2035 కల్లా క్వాంటమ్ కంప్యూటింగ్ ఇండస్ట్రీ 1.3 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా.

క్వాంటమ్ టెక్నాలజీ ఉపయోగాలు

విస్తృత శ్రేణిలో క్వాంటమ్ టెక్నాలజీ వినియోగంతో వివిధ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఔషధరంగం, ఆర్థిక సేవలు, మెటీరియల్ సైన్స్ తదితర రంగాల్లో అనూహ్య పురోగతి కనిపిస్తుంది. క్లాసికల్ కంప్యూటర్ టెక్నాలజీకి లేని సామర్థ్యం దీనికి ఉండటంతో ఆప్టిమైజేషన్, క్రిప్టోగ్రఫీ, మెషీన్ లెర్నింగ్ మరింత మెరుగవుతుంది. దీనివల్ల ఏఐ పనులు మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చు. క్వాంటమ్ కీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా సమాచారం హ్యాక్ చేయలేని విధంగా మారుతుంది. అత్యంత భద్రంగా సమాచార నిల్వ, మార్పిడి జరుగుతుంది. అణు స్థాయిలో రసాయన చర్యలను విశ్లేషించడం ద్వారా కొత్త మందులను వేగంగా అభివృద్ధి చేయవచ్చు. మార్కెట్ అంచనా, పోర్ట్‌ఫోలియో ఆప్టిమైజేషన్ వంటి క్లిష్టమైన సమస్యలను వేగంగా పరిష్కరించవచ్చు. వాతావరణ మార్పులు, వాటి అంచనాలు మరింత కచ్చితంగా విశ్లేషించవచ్చు. క్వాంటమ్ టెక్నాలజీతో విస్తృత డేటా విశ్లేషణలో పెరిగే వేగం కారణంగా పాలనలో కూడా వేగం పెరుగుతుంది. ఉదాహరణకు.. రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఎంతమందికి క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయి, ఎంతమందిలో రోగ నిరోధక శక్తి ఉంది అనే విషయం క్షణాల్లో తెలుసుకోవచ్చు. పంటలకు సోకే క్రిమికీటకాలు, వాటి ప్రభావం, నివారణపైనా రాష్ట్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు వీలు కలుగుతుంది. భారీ బహిరంగ సభల్లో పది లక్షల మంది హాజరైనా ఒక్కొక్కరినీ గుర్తించవచ్చు. ట్రాఫిక్ నియంత్రణ కూడా సలువు అవుతుంది.

మరో హైటెక్ సిటీగా అమరావతి

» బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్

ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం ప్రజారాజధాని పునఃనిర్మాణానికి శుభసూచకమని ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు. దీంతో అమరావతి మరో హైటెక్ సిటీగా మారేందుకు అవకాశం ఉందన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2026 జనవరి నుంచి యావత్ ప్రపంచం అమరావతి వైపు చూస్తుందన్నారు. ఇప్పటికే గూగుల్, నాసా లాంటి ప్రఖ్యాత సంస్థల్లో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను వినియోగిస్తున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా క్వాంటమ్ టెక్నాలజీ హబ్‌లు ఏడు మాత్రమే ఉన్నాయని, ఆసియాలో ఇంతవరకు ఆ టెక్నాలజీపై పరిశోధనే చేయలేదన్నారు. అలాంటిది దేశంలోనే తొలిసారిగా అమరావతి ద్వారా ఆసియాకు క్వాంటమ్ టెక్నాలజీని చంద్రబాబు పరిచయం చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ సీఎం కూడా క్వాంటమ్ టెక్నాలజీపై మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. దూరదృష్టి కల సీఎం కాబట్టే చంద్రబాబు క్వాంటమ్ టెక్నాలజీపై మాట్లాడటమే కాదు రాజధానిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దనున్నారని కొనియాడారు. 17 రాష్ట్రాల్లో 43 పరిశోధనా కేంద్రాల ద్వారా దీనిని అనుసంధానం చేస్తారని తెలిపారు. అమరావతిలో 50 ఎకరాల విస్తీర్ణంలో క్వాంటమ్ వ్యాలీని ప్రారంభిస్తున్నారని వెల్లడించారు.

అంతర్జాతీయ స్థాయిలో

రాష్ట్ర 'ఫోరెన్సిక్'

» శిక్షణను వర్చువల్‌గా ప్రారంభించనున్న డీజీపీ



అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ) వైపు వేగంగా దూసుకెళ్తున్న ఏపీ పోలీసులు.. రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం సేవలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తీసుకెళ్లే దిశగాచర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 5 నుంచి 10 వరకు రాష్ట్రంలోని 26 జిల్లాల పోలీసు యూనిట్లలో ఫోరెన్సిక్ నిపుణులు దర్యాప్తు అధికారులు(ఏఎస్ఐ, ఎస్ఐ, సీఐ, డీఎస్పీ), ప్రభుత్వాస్పత్రి వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమాన్ని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఏపీ ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ పాలరాజు(ఐజీ) ఈ వర్క్‌షాప్‌ను పర్యవేక్షిస్తారు. గత ఏడాది జూలై నుంచి అమల్లోకి వచ్చిన కొత్త నేర చట్టాల (బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ) ప్రకారం ఫోరెన్సిక్ నిపుణులే ఆధారాలు సేకరించాల్సి ఉంది. అందుకు అనుగుణంగా నేరం జరిగిన చోటుకు పోలీసులు ఏ విధంగా రక్షణ కల్పించాలి? వెంట్రుక లాంటి ఆధారాలను సైతం ఎలా సేకరించాలి? వాటిని ఎలా నిల్వ చేయాలి? ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదికను వారంలోనే ఎలా తెప్పించుకోవాలి? కోర్టుకు తీసుకెళ్లే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ప్రస్తుతం జరుగుతున్న తప్పులను ఎలా సరిదిద్దుకోవాలి? అనే అంశాలపై వర్క్‌షాప్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ నేరస్తులకు కోర్టుల్లో శిక్షలు పడితేనే నేరాలు తగ్గుతాయన్నారు. ఆ దిశగా అత్యంత అధునాతన పద్ధతులు అందిపుచ్చుకుని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'మారుతున్న పరిస్థితులు, ఏఐ టూల్స్‌ను సమకూర్చుకొంటున్నాం' అని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ వహించి అమరావతిలో రూ.250 కోట్లతో ప్రపంచ స్థాయి ఫోరెన్సిక్ సేవల కేంద్రం (సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ) 2026 మార్చి నాటికి నిర్మించి పోలీసు శాఖకు అందించబోతున్నారని డీజీపీ తెలిపారు.



నాడు

రాజధానిపై విద్రోహ శక్తుల విద్వేషం

» సచివాలయ టవర్ల శిలాఫలకం ధ్వంసం

» పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మరుసటి రోజే దాడి

విజయవాడ, మే 3(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో సచివాలయం, హెచ్‌ఓడీ ఆఫీసు కాంప్లెక్స్ (సచివాలయ టవర్లు) శంకుస్థాపన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అంగరంగ వైభవంగా అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన జరిగిన మరుసటి రోజునే ఈ సంఘటన జరగటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కడుపు మంటతో ఎవరు చేసిన పనో ఇప్పటి వరకు తెలియదు. అయితే ఇది ఉద్దేశ్యపూర్వకంగా చేసిన ఘటనగానే తెలుస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018, డిసెంబరు 27న సీఎం చంద్రబాబు దీనికి శంకుస్థాపన చేశారు. అప్పటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తితో పాటు అప్పటి మంత్రులు, స్థానిక జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధుల పేర్లను ప్రోటోకాల్ ప్రకారం శిలాఫలకం బోర్డులో రాయించారు. తెలుగు, ఇంగ్లిషులో రెండు బోర్డులను ఏర్పాటు చేశారు. ఇంగ్లిషు బోర్డును ప్రస్తుతం ధ్వంసం చేశారు. ఇనుప రాడ్డు లేదా సుత్తి వంటి దానితో గట్టిగా కొట్టి ధ్వంసం చేసినట్లు కనిపిస్తోంది. ఈ శిలాఫలకానికి రెండు వైపులా సచివాలయ టవర్ల నమూనాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే సచివాలయ టవర్ల శంకుస్థాపన శిలాఫలకం ధ్వంసంపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.



నేడు

15 ఏళ్ల తర్వాత పూర్తిస్థాయి

పెన్షన్ పునరుద్ధరణ సరైందే

» కమ్యుటేషన్ పింఛన్ విధానం గురించి ఉద్యోగులకు తెలుసు: హైకోర్టు

» రిటైర్డ్ ఉద్యోగుల వ్యాజ్యాలు కొట్టివేత



అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు కమ్యుటేషన్ పెన్షన్ విధానం కింద ఏకమొత్తంలో ముందస్తుగా తీసుకున్న సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం 15 ఏళ్ల పాటు రికవరీ చేయడాన్ని హైకోర్టు సమర్థించింది. వేతన కమిషన్ సిఫారసు మేరకు సొమ్ము రికవరీ కాలాన్ని 15ఏళ్లుగా నిర్ణయించారని పేర్కొంది. పూర్తిస్థాయి పెన్షన్ పునరుద్ధరణకు 15ఏళ్ల వ్యవధిని కేంద్రం అనుసరిస్తోందని గుర్తుచేసింది. కమ్యూటెడ్ పెన్షన్ రూపంలో ఏకమొత్తంలో తీసుకున్న సొమ్ముకు అసలుతో పాటు వడ్డీని 11 సంవత్సరాల 3 నెలల పాటు ప్రభుత్వం రికవర్ చేస్తే సరిపోతుందన్న పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. 15ఏళ్ల అనంతరం పూర్తి పెన్షన్ పునరుద్ధరణకు వీలుకల్పిస్తున్న ఏపీ సివిల్ పెన్షన్ రూల్స్‌లోని నిబంధన 18ని సవాల్ చేస్తూ వేసిన పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు తమకు వచ్చే పెన్షన్ సొమ్ములో కమ్యుటేషన్ పెన్షన్ కింద ఏకమొత్తంగా ముందస్తుగా తీసుకున్న మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం 15ఏళ్ల పాటు రికవరీ చేశాకే పూర్తిస్థాయి పెన్షన్ పునరుద్ధరణకు వీలుకల్పిస్తున్న ఏపీ సివిల్ పెన్షన్ రూల్స్‌లోని నిబంధన 18ని సవాల్ చేస్తూ పలువురు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఏకమొత్తంలో ముందస్తుగా తీసుకున్న సొమ్మును 11 ఏళ్ల 3 నెలలపాటు రికవర్ చేస్తే సరిపోతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. 15 ఏళ్లపాటు రికవరీ చేశాక పూర్తిస్థాయి పెన్షన్‌ను పునరుద్ధరించడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) సాంబశివ ప్రతాప్ వాదనలు వినిపిస్తూ.. పెన్షన్ సంక్షేమ పథకంలో భాగమని, దీర్ఘకాలంలో ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక భద్రత కల్పించేందుకు ఉద్దేశించిందన్నారు. ఉద్యోగులు ఎలాంటి సొమ్మును చెల్లించరని, పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే పెన్షన్ సొమ్మును చెల్లిస్తుందన్నారు. పదవీ విరమణ చేసే సమయంలో ఉద్యోగులే స్వచ్ఛందంగా కమ్యుటేషన్ పెన్షన్ విధానాన్ని ఎంచుకుంటున్నారని తెలిపారు. దీనిలోని నిబంధనలు వారికి ముందే తెలుసునని చెప్పారు. కమ్యుటేషన్ పెన్షన్ విధానంలో ఉద్యోగులు ప్రయోజనాలు పొందుతున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం... కమ్యుటేషన్ పెన్షన్ కింద ఏకమొత్తంలో ముందస్తుగా తీసుకుంటున్న సొమ్ముకు ఉద్యోగులు ఆదాయపు పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు, ఇతర ప్రయోజనాలు పొందుతున్నారని గుర్తు చేసింది. పూర్తి పెన్షన్‌ను 15 ఏళ్ల తర్వాత పునరుద్ధరిస్తారని తెలుసుకున్నాకే ఉద్యోగులు కమ్యుటేషన్ పెన్షన్ విధానాన్ని ఎంచుకుంటున్నారని స్పష్టం చేసింది. ఒకవైపు కమ్యుటేషన్ పెన్షన్ విధానంలో ప్రయోజనాలు పొందుతూ మరోవైపు రూల్ 18ని సవాల్ చేయడం సరికాదని పేర్కొంటూ పిటిషన్లను కొట్టివేసింది.

బోరుగడ్డ అనిల్‌కు బెయిల్

» అనంతపురంలో నమోదైన కేసులో మంజూరు



అనంతపురం క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు బెయిల్ మంజూరైంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను దూషించినందుకు నమోదైన ఈ కేసులో బోరుగడ్డ బెయిల్ పిటిషన్‌ను గత నెలలో ఎక్సైజ్ కోర్టు తోసిపుచ్చడంతో అనంతపురం జిల్లా కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. జిల్లా మొదటి అదనపు న్యాయస్థానం న్యాయాధికారి సత్యవాణి ఇరువర్గాల వాదనలు విని బోరుగడ్డ అనిల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

జీవో 69ని రద్దు చేయండి

» హైకోర్టులో వైసీపీ నేత పిల్

» ఏపీఎండీసీకి క్వారీల లీజును సవాల్ చేసిన లేళ్ల అప్పిరెడ్డి

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 436 కొత్త మైనర్ మినరల్ క్వారీల లీజులను, ఖనిజాల హక్కులను ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నామినేషన్ ప్రాతిపదికన అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 69ని రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దీనిని దాఖలు చేశారు. ప్రాజెక్టుల విస్తరణ, అభివృద్ధి, కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు బాండ్ల రూపంలో రూ.9వేల కోట్లను సమీకరించేందుకు, ఆ రుణానికి గ్యారెంటీ ఇస్తూ ప్రభుత్వం ఇచ్చిన మరో జీవో 33ను కూడా ఆయన సవాల్ చేశారు. జీవో 69 అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ, సీఎస్, మైనింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి, ఏపీఎండీసీ వైస్ చైర్మన్, ఎండీని ప్రతివాదులుగా చేర్చారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.